# గజేంద్ర మోక్షణము



ధనిష్ఠ

బమ్మెర పోతనామాత్య ప్రణీతంబైన

# గజేంద్ర మోక్షణము

శ్రీమదాంధ్ర భాగవతము - అష్టమ స్కంధమునుండి


వ్యాఖ్యాన ప్రణాళిక :

**కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య**

వ్యాఖ్యాన రచయిత :

**శ్రీ చివుకుల రవిశర్మ**



**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణము : జనవరి, 1994
ద్వితీయ ముద్రణము : శ్రీ వికృతి - శరన్నవరాత్రులు, 2010

ప్రతులు : 1,000

వెల : **నామస్మరణము**

*ప్రాప్తిస్థానము :*

**జగద్గురు మందిరము**
(ది వరల్డ్ టీచర్ టెంపుల్)
'రాధామాధవమ్'
14-38-2, ముప్పిడి కోలనీ,
విశాఖపట్నం - 530 002.
ఫోన్ : 0891-2701531
e-mail : dhanishta@rediffmail.com

*ముద్రణ :*
**ఎక్వేరియస్ ప్రింటింగ్ స్కూల్**
43-11-24, సుబ్బలక్ష్మీనగర్.
విశాఖపట్నం 530 016.
ఫోన్ : 0891-2747320, 9848075132.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవము నకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ" మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపములోను భద్రపరచి సత్సాధకుల కందించు నట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ఆశీర్వచనము

**గ**జేంద్రమోక్షణము పోతనామాత్యునిచేత విరచింపబడినది. తెలుగు పద్యముల ద్వారా పోతనామాత్యులవారి నుండి సాక్షాత్తు సరస్వతియే తానుగా ఈ ఉపాఖ్యానమును రచించుకొనినది కాబోలునని అనిపించునట్లు అత్యంత మధురమగు భక్తిజ్ఞాన వైభవము భాగవతము నందు అలరారు చున్నది. పద్యములయందు దివ్యజ్ఞాన మెంతున్నదో అంతకు మించిన భక్తి మార్గమున్నది. ఇందలి పద్యములు నిత్యము పారాయణము చేయువారు సూటిగా బంధవిమోచన స్థితిని అనుభవింతురు.

పరమాత్మయే కటాక్షించి పోతనగ రూపుగట్టుకొని కొన్ని పద్యములు ఈ ఉపాఖ్యానమున చేర్చుట అరుదైన వైభవము. పోతనామాత్యులవారు ఆంధ్రదేశమున బుట్టుట ఆంధ్రుల భాగ్యము. వారి భాగవత రచన సంస్కృత మూలము కన్న నెక్కువ భక్తి మాధుర్యముతో నిండి యున్నది. ఇది నిస్సందేహము. భాగవతమును తెలిసి పలుకుట బ్రహ్మరుద్రులకు కూడా సాధ్యము కానిపని. సర్వసమర్పణము చెందిన పోతనామాత్యులవారి నుండి తెలుగు భాగవతము మరల భగవద్గీతగా ప్రకటింపబడిన దని నా విశ్వాసము. ఆంధ్రభాగవతము కన్న మించిన భాగవతము భారతమున లేదు. ఇందలి పద్యములు నిత్యము పారాయణము చేయుట ఆంధ్రుల సత్సాంప్రదా యము. పద్యపారాయణము గావించు భక్తజనులకు పునర్ముద్రణమున ఈ ఉపాఖ్యానము సమర్పింపబడు చున్నది.

ఈ ప్రచురణకు **చి॥ గంటి సుబ్రహ్మణ్యశర్మ** (గణేష్) ప్రేరణ యిచ్చినాడు. భక్తి శ్రద్ధలతో చి॥ శివశంకర్, చి॥ కృష్ణమోహన్, చి॥ ధనంజయలు దీనిని మరింత సుందరముగా రూపొందించినారు. శ్రీ కంభంపాటి వేంకటప్పయ్యశాస్త్రిగారి పవిత్ర నామాంకితముగా ‘శ్రీరామనామ లేఖన మహాయజ్ఞము’ నిర్వర్తింపబడుచున్నది. గజేంద్ర మోక్షణము 1994 జనవరిలో మొదటిమారు ప్రచురింపబడినది. మరల నిపుడు రెండవ ప్రచురణ జరుగుచున్నది. ఈ ఉపాఖ్యానమును భక్తజనులు హృదయస్తము గావించుకొని తరించవలెనను ఆకాంక్షతో పునఃసమర్పితము చేయబడినది.

వికృతి – శరన్నవరాత్రులు
విశాఖపట్నం.

ఇట్లు
**కంభంపాటి పార్వతీకుమార్**



# ఉపోద్ఘాతము

గజేంద్రమోక్షణము విన్నను, చదివినను, వ్రాసినను శుభము, యశము, కీర్తి, సంపద సిద్ధించుననుట సత్యము. పీడలు, బాధలు తొలగుననుట కూడ సత్యము. మోక్షము అరచేతిలో నుండుననుట పరమసత్యము.

శ్రీమద్భాగవతమునందు జీవుల అవరోహణము, ఆరోహణ క్రమము ఎన్నియో ఉపాఖ్యానములుగా వివరింపబడినది. పురంజనోపాఖ్యానము, అజామీళో పాఖ్యానముల వలె గజేంద్రమోక్షణము కూడ దేవుని నుండి దిగివచ్చిన జీవులు మరల దేవుని చేరుట యను భగవల్లీలలను విపులీకరించునవియే. ప్రకృతి, పురుషుల క్రీడార్థముగా సృష్టి, సృష్టిజీవులు దిగివచ్చుట, అందు సృష్టికి పరాకాష్ఠగా మానవ దేహ నిర్మాణము, అందు భగవంతుని యొక్క పునఃప్రవేశము, జీవుల ఉద్ధారణము క్రీడలో అంతర్భాగములుగా జరుగుచుండును. గ్రంథమునందలి ఉపాఖ్యానము లన్నియు ఈ క్రమమునే పాటించుట గమనించదగును. సృష్టి యందు జీవుల కథలో అంతర్భాగముగా జీవులు వికల్పము చెందుట, విపత్తులలో భగవత్స్మరణము జరుగుట, తద్వారా తన్ను తానెరుగుట కూడ క్రీడలోని భాగములే. గజేంద్రమోక్షణము నందు ఈ అంశము లన్నియు ప్రతిపాదింపబడినవి. ఇది శాశ్వత కథ.

గుహనుండి ఓంకారముగా గజేంద్రుడు వ్యక్తమగుట, అతనిని అనుసరించి గుంపులు గుంపులుగా గజములు వ్యక్తమగుట సృష్టి ఆరంభమును, జీవుల పుట్టుకను సంకేతించుచున్నవి. సృష్టి యందు జీవుల ప్రవర్తనములలో సహజ సంకల్ప స్థితి నుండి వికల్పస్థితికి సంసరణము చెందుటగా గజేంద్రుడు సరస్సుయందు స్నానమాచ రించుటకై దిగి సరస్సును చిందర వందర చేయుట. వికల్పముల వలన చిక్కుపడు టయే సృష్టి యను సరస్సులో మకరము పాలగుటగా సంకేతింపబడినది. మకరి

చేత చిక్కిన గజేంద్రునివలె వికల్పముల యందు చిక్కిన జీవుడు కొట్టుమిట్టాడుచు ఈశ్వరుని శరణు వేడుట మానవజీవితమందు ఎఱిగిన సత్యమే.

గజేంద్రమోక్షణము నందు మూడు మకరములు వివరింపబడినవి. అహంకారము, బుద్ధి, చిత్తము అను నీ అంతఃకరణముల యందు దిగబడిన జీవుడు బద్ధుడై స్వభావముచే నిర్దేశింపబడుట మొసలి పట్టుగా సంకేతించబడినది. అహంకారము వలన తనను తాను ప్రత్యేకముగా చూచుకొను స్వభావమేర్పడును. తనవారు, యితరులు అను భావ ముదయించును. అట్టి అహంకారముతో సంగమము చెందిన బుద్ధి పరిమితమై తప్పొప్పుల పట్టికను సంకల్పించుకొని, అందు గింగిరములు కొట్టుచుండును. అహంకార మమకారాదుల వలనను, తానేర్పరచుకొన్న తప్పొప్పుల వలనను, దేహము, పరిసరముల ప్రభావముల వలనను ఏర్పడిన చిత్తము తనదైన శైలిలో రాగద్వేషాదులను, కామక్రోధాదులను, ఈర్ష్యాసూయలను వ్యక్తము చేయు చుండును. ఇన్నిటి నడుమ జీవుడు నిస్సహాయుడై నిలబడి యుండును. మొసలి పట్టు యనగా నిదియే. మొసలి పట్టువలన సంపూర్ణముగా నిస్సహాయుడైన జీవుడు ఎట్టి ఆలంబనము లేని స్థితిలో ఆత్మేశ్వరుని ఆలంబనముగా చేసికొనును. ఆత్మభవుని శరణమును వేడుకొనుట మొదలిడును.

సంఖ్యా శాస్త్రమున 'మ' అను శబ్దము అంకె 'ఐదు'నకు సంకేతము. కావున 'మ'కర మనగా ఐదు చేతులు కలది; పంచభుజి లేక పంచారము. ఈ సృష్టి మొత్తము ఒక కరణముగా ఋషులు తెలిపియున్నారు. పంచీకరణము చేయబడిన సృష్టియందు జీవులు మెలగుచున్నారు. ఈ పంచారములనే మకరము లుగా తెలిపియున్నారు. ఉదాహరణకు సృష్టి యందలి చతుర్వింశతి (24) తత్త్వము లలో నాలుగు వ్యూహములు, నాలుగు పంచారములు కలవు. నాలుగు వ్యూహముల నుండి దేవుడు జీవుడుగా దిగి రాగా వానికి దేహములుగా పంచతన్మాత్రలు, పంచేంద్రియములు, తదంగములు, కర్మేంద్రియములు ఏర్పడుచున్నవి. వీనిలోనికి దేవుడు నాలుగు వ్యూహములుగా అనగా వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములుగా దిగివచ్చుచుండుట ఋషు లెరిగించిన సత్యము.

మకరాలయము లనగా పంచీకరణము చేయబడిన సృష్టి. ఇందలి మకరము లనగా దేహములు లేక రూపములు ధరించిన చైతన్యము. మకరములపై స్వామిత్వము వహించుట వలన జీవుడు సృష్టిలో దేవునివలె మెలగుచుండును. మొసలిపై సంచరించు దేవునిగా వరుణుని ధ్యానించుట ఆ సామర్థ్యమును పొందుటకే. ఆ సామర్థ్యము లేనివాడు స్వామిత్వము కోల్పోయి సృష్టి సరస్సులోని మకరముల చేజిక్కును. తదుపరి జీవితము బరువెక్కును. భగవత్ స్మరణ మాత్రము చేత వెలుగు దారి (అర్చిర్ మార్గము) పొంది మరల ఉద్ధరింపబడును.

ఇంద్రియార్థములపై, బుద్ధిపై, అహంకారముపై స్వామిత్వము పొందినవాడు మోక్ష పదమును పొందినవాడు. గజేంద్రుడు ఇంద్రియార్థము లను మకరము చేజిక్కి, పీడితుడై తన బుద్ధి, అహంకారము క్షీణించగా దైవ యోగమున, దైవ ప్రేరితుడై శరణాగతి చెంది మకరము బాధనుండి విముక్తినొందెను. ప్రస్తుత కాలమాన పరిస్థితులలో మానవుని దుస్థితి గజేంద్రుని సంకటముతో సరిపోలినది. తన కోరికలచేత, అభిప్రాయములచేత, అహంకార మమకారములచేత తనను తాను బంధన యోగమున నిలుపుకొన్నవానికి, గజేంద్రమోక్షణము- ప్రవాహమున మునిగి పోవుచున్నవానికి ఆసరావలె నిలచి కడతేర్చును. ప్రతి నిత్యము యిందలి ప్రార్థనా పద్యములను పారాయణ చేయుట వలన సమస్తమైన సమస్యలకు పరిష్కార మేర్పడి దైవయోగమున వెలుగుదారి పట్టించును.

ఈ యుపాఖ్యానమును సామాన్య జనుల కందించుటకు చేసిన ఈ ప్రయత్నము శుభములను కలిగించును. ఇందు పద్యముల వివరణము, రహస్య ప్రకాశము నొసంగిన పూజ్య సోదరులు శ్రీ చివుకుల రవిశర్మ ఎంతయూ ప్రశంస నీయులు. ముద్రణను సంకల్పించి, వివరణమును వ్రాయింపజేసి గ్రంథ రూపమును దాల్చుటకు కృషిచేసిన చిరంజీవి కంభంపాటి శివశంకర్‌కు మరియు శ్రీ రవిశర్మకు, ప్రత్యక్ష పరోక్షముగా ప్రథమ ముద్రణకు తోడుగా నిలచిన కైలాసవాసి, సోదరుడు కంభంపాటి సురేంద్రనాథ్‌కు ప్రథమ ఉపాఖ్యాన ఫలము అందవలెనని విశ్వమయు డైన విష్ణుని ప్రార్థించుచున్నాము.

**- కంభంపాటి పార్వతీకుమార్**



# భాగవత గ్రంథ ప్రాశస్త్యము

- కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య

**శ్రీ** కైవల్యపదము చేరుటకునై వేదవ్యాసమహర్షి ప్రసాదించిన యొక అపూర్వ గ్రంథము భాగవతము. పరాశరమహర్షి కుమారుడగు వేదవ్యాసుడు తండ్రి దగ్గఱ సమస్త విద్యల నభ్యసించి కలియుగమున కనుగుణముగా వేద వాఙ్మయమును సంస్కరించి సంహితలుగా విభజించెను. వేదము యొక్క పరమార్థ మును వివరించుటకై గురువులు శిష్యులకు కొన్ని ఇతిహాసముల నుదాహరించి రహస్యముల బోధపఱచుట అనాదిగా వచ్చుచున్న సంప్రదాయము. అట్లు వివరింప బడిన కథలు కొన్ని వందలు బ్రాహ్మణముల యందున్నవి. కొన్ని ఉపనిషత్తు లందున్నవి. వాని నితిహాసము లందురు. వాని క్రమ సమన్వయముచే సృష్టిగా దిగివచ్చు పరబ్రహ్మమును ఐదు లక్షణములలో వివరించుట పురాణ మనబడును. ఇట్టి పురాణములు వేదవాఙ్మయమున కొన్ని వందలు.

ఈ పురాణములలో పదునెనిమిదింటిని స్వీకరించి, సంస్కరించి పరాశరుడు విష్ణు పురాణమున నిబద్ధము చేసెను. వ్యాసుడు విస్తరించి యొక్క పురాణ సంహితను స్థిరము చేసి దానిని వేఱు వేఱు గ్రంథములలో పంచి పెట్టెను. అవియే పదునెనిమిది పురాణములు. తన శిష్యులైన పైలుడు, జైమిని, సుమంతుడు, వైశంపాయనుడు అనువారిచేత వేద సంహితలు నాలుగింటిని వేఱు వేఱుగా నభ్యసింపజేసి శిష్యవర్గము నేర్పరచి స్థిరము చేయించెను. ఐదవ శిష్యుడు సూతునిచే విస్తారమైన పురాణ సంహితను ప్రచారము చేయించెను. ఇదికాక వ్యాసమహర్షి తన సమ కాలికులైన కురుపాండవుల నడుమ జరిగిన ప్రపంచ మహా సంగ్రామమును **'జయ'** మను పేర నొక ఇతిహాసముగ రచించెను. దానికి సర్పయాగ సందర్భమున జనమేజయుని ఆస్థానమున వైశంపాయనుడు మరికొంత వివరణము కలిపి కురువంశ చరిత్రలు కూడ నిలిపి **'భారత'** మను పేర ప్రవచనము చేసెను.

దానిని విపులముగ వ్యాఖ్యానించి అనేక యుగములలోని ఉపాఖ్యానములతో సూతుడు శౌనకాది మునులకు బోధించి దానికి **'మహాభారత'** మని పేరు పెట్టెను. ఈ విస్తృతి యంతయు వ్యాసుని సమక్షమున, సమ్మతమున జరిగినదే. వేదముతో గూడిన సమస్త విజ్ఞానమును వేదవ్యాసు డీ విధముగా వివరించి "ఈ కలియుగము వారు ఇంత గ్రంథజాలము నధ్యయనము చేయుదురా?" అని సందేహపడెను. ఈ గ్రంథములయందు బహుశాఖల విజ్ఞాన మున్నది. కాని కలియుగమున కష్టజీవనులకు కావలసినది అనుభూతి, అది భగవంతునికి సంబంధించినది. పై గ్రంథములలో కొంత కొంత యున్నను, అది కాని విజ్ఞాన మెక్కువగా నున్నది. వీనిని చదివినప్పుడు కలియుగ మానవుల మనస్సు అనుభూతి నుండి విజ్ఞానశాఖల మీదికి చెదరిపోవును. అనేక భ్రమలకు లోనై మతభేదములు పుట్టి వాని గుణదోష విమర్శలో వారు కేవల పండితులుగా చనిపోవలసి వచ్చును. మఱియు పొట్ట పోసికొనుట యను శూద్రధర్మము ప్రధానముగా గల కలియుగ మానవులకు అర్థకామములకై ధర్మము పనికివచ్చునే కాని, ధర్మమునకై అర్థకామములను సమన్వయించుకొను సత్తువ యుండదు. ఈ పతనావస్థచే వారు కార్యాంతర వ్యగ్రులై అలసులు, మందబుద్ధులునై అల్పతరాయువు లగుట తప్పదు. ఇక పదునెనిమిది పురాణముల విజ్ఞానమును పట్టుటెక్కడ? తీరుబడి ఎక్కడ?

వారికి కావలసినవి సుఖశాంతులు. వాని నిచ్చునది ఏ విషయమో తెలియని వారు. సుఖశాంతులు కలిగించునది దైవానుభూతి యొక్కటే. దానిని స్థాపించుటకు వ్యాసుడు సంగ్రహముగ బ్రహ్మసూత్రములను రచించెను. అవి బోధపడవు. అనుభూతికి సుగమము, మధురము అయిన బోధ యుండవలెను. ఇంద్రియము లలో జీవించు వారి కొఱకు గనుక ఆకర్షణ రమ్యత యుండవలెను. ఆకర్షణ ఇంద్రియలోలతకు దారితీయును. ఇక మార్గమేమి? జీవిత మంతయు ధారపోసి సాధించినది పామర ప్రజలకు పనికివచ్చు ననిపించుట లేదు. దానిని గూర్చి వ్యాస మహర్షి పూర్ణకాముడై కూడ వ్యాకుల చిత్తు డయ్యెను. ఈ సమయమున నారదుడు దిగి వచ్చి ఆకర్షణ వలన కీడు మూడదనియు, మాధుర్యము నలవరచి ఇంద్రియారాముల నుద్ధరింపవలె ననియు తెలిపి మార్గము నుపదేశించెను. శాసించినందు వలన, దమించినందు వలన ఫలితము కలుగకపోగా మానవులు

రహస్యములైన హేయమార్గములు పట్టుదురని కూడ నారదుడు హెచ్చరించెను. దైవానుభూతి ప్రధానముగ భాగవతమును రచింపుమని మధురమైన మార్గము నుపదేశించెను. అంతకుముందే కృష్ణ నిర్యాణ కాలమున భాగవత ధర్మ రహస్యము కృష్ణునిచే మైత్రేయునకు, వానిచే విదురునకు నుపదేశింపబడుట జరిగినది. తాను సృష్టి సమయమున బ్రహ్మ కుపదేశించు విషయమని దానిని గూర్చి భగవానుడు శ్రీకృష్ణుడు మైత్రేయునకు వివరించెను. బ్రహ్మ వలన నుపదేశ మందిన నారదుడు వ్యాకులచిత్తుడైన వ్యాసమహర్షి కుపదేశించెను.

వేదముల యందు అగ్ని, విష్ణువు అను పేర్లతో పరబ్రహ్మ ముపదేశింపబడెను. సర్వాంతర్యామియైన అగ్ని లేక విష్ణుని నుండి సృష్టికర్తలైన ఇంద్రాది దేవతలు, బ్రహ్మ మొదలగు ఋషు లుద్భవించిరి. వారికి సర్వాంతర్యామి స్ఫురణ కలిగి నపుడు పరబ్రహ్మత్వము, కలుగనప్పుడు నానాత్వము సంభవించుచున్నది. అందు మొదటి దానివలన ఆనందము, సృష్టియజ్ఞము నిర్వహించుటకు సామర్థ్యము కలుగుచున్నవి. రెండవదాని వలన స్వతంత్ర బుద్ధి, ఏపని యెట్లు నిర్వహింపవలెనో తెలియక సందేహపడుట కలుగుచున్నవి.

**సామవేదమునగల నాదోపాసన మూలమున పరబ్రహ్మమున లయమై యుండుట భక్తిమార్గ మనబడును. ఈ సామవేద మార్గమే భాగవత సంప్రదాయముగ పరిణమించినది. "వేదములలో సామవేదమును నేను" అని గీతలో కృష్ణుడు ఉపదేశించెను. దాని నుండియే సంకీర్తనలు, భజనలు, నాటకములు మొదలగు సంప్ర దాయములు వచ్చినవి. గ్రంథము లందలి విజ్ఞానము ప్రధానము కాక, అదికూడ నాదము మున్నగు వానితో ఆనందానుభూతికి సహకరించుట భాగవత సంప్ర దాయము. ఏమి తెలిసినది అను దానికి ప్రాధాన్యము లేక ఏమి రచించినది అను దానికి ప్రాధాన్యము కలిగించి యుద్ధరించుట ఇందలి కొలికిపూస. సంగీతముతో సమానమైన స్థాయి కుడి యెడమగ సాహిత్యమునకు గూడ అబ్బుట ఈ మార్గముననే సాధ్యమగును. భారతము మున్నగు గ్రంథములకు విజ్ఞానము ప్రధానము. దానినే బ్రహ్మకోశము అందురు. భాగవతమునకు అనుభూతి ప్రధానము. బ్రహ్మకోశ మనబడు పద్మకోశము వికసించి మకరందమును చిమ్మినపుడే సార్థకత. ఈ**

**రహస్యముల కనుగుణముగా భాగవత గ్రంథమున వ్యాసుని రచనయు, శైలియు మాధుర్య ప్రధానములు. తెనుగున పోతన రచనలో గూడ నివే ప్రధానములు.**

**ఈ ఆనందానుభూతి మార్గము నభ్యసించు నేర్పరితనము నారదునికడ నున్నది. దానిని నిర్దేశించుటకే నారదుడు వ్యాసమహర్షికి తన పూర్వజన్మ వృత్తాంత మును తెలిపెను. దాసీ పుత్రుడై జన్మించిన నారదుడు భాగవతసాధన మార్గమున సిద్ధులైన మహనీయుల సేవ చేసెను. తత్ఫలితముగ మూడు సోపానములలో నతడు భాగవతోపాసనము పొందెను.**

## విష్ణూపాసనము :

నామరూపములతో గూడియున్న వ్యక్తులను, వస్తువులను, ఆకారము లను భగవంతుని వ్యక్త స్వరూపములుగా నిత్యము స్మరణ యందుంచుకొనుట. *"విష్ణుండు విశ్వంబు..."* అనునది దీని మూలసూత్రము. భగవద్గీతలో చూపబడిన విశ్వ రూప సందర్శన మిదియే. మరియు భీష్ముడు ధర్మజునకు పరమ ధర్మముగ *"విశ్వం విష్ణుః..."* అని ప్రారంభించి దీనినే సహస్ర నామార్చనముగ నుపదేశించెను. దీనిని నిష్కామ కర్మయోగమున సాధింపవలెను. దీనియందు నిష్ఠ కుదిరిన వెంటనే రెండవ సోపాన మారంభ మగును. దీనిని *'వాసుదేవోపాసనము'* అందురు.

## వాసుదేవోపాసనము :

**వాసుదేవు డనగా వసించునట్టి దేవుడు లేక జీవులయందు చేష్టల రూపమున నున్న దేవుడు. ఇందు నామరూపములందు మాత్రమే గాక జీవుని ప్రవర్తనమునందు భగవంతుని సాన్నిధ్యము కుదురుట తేలిక. వాసుదేవోపాసనము నందొక స్థాయి చిక్కుట చాల కష్టము. ఇతరుల చేష్టలను గమనించుచున్నప్పుడు అందలి మంచి చెడ్డలయందు, పాపపుణ్యములయందు, కామక్రోధములు ప్రసరించి మరపు కలుగు చుండును. చూచువానిలో నున్న పూర్వార్జితములైన కామక్రోధ వాసనల లోతు ననుస రించి, యెదుటివారి ప్రవర్తనలో పాపములు కనిపించు చుండును. వెంటనే చూచు వానిలో గూడ ఉన్నంత లోతుగా అదే ప్రవర్తనము రేకెత్తును. ఇంక వాసుదేవు డెక్కడ? వీనిని తప్పించుకొని భగవంతుని జ్ఞప్తియందు ఉంచుకొనుటకు స్వప్రయత్నము**

చాలదు. కొండచిలువచే మ్రింగబడుచున్నవాడు స్వసామర్థ్యముచే తన చేయి, కాలు కూడతీసుకొన గలుగుట ఎట్లు సాధ్యము? అట్లే కామ క్రోధ ప్రేరితములైన ప్రవృత్తి కలవానికి ఎదుటి వారి ప్రవృత్తిలో, చేష్టలలో భగవంతుని స్మరింప గలిగిన సామర్థ్యము కలుగదు. ఇచ్చట మహనీయుల సాంగత్య మావశ్యక మగును. దాని వలన భక్తి జనించును. జీవులలోని చేష్టలు చూచు చున్నపుడు మాయ క్రమ్మును. దానిని తెలియజేయుటకే భాగవత జనుల చరణ సేవ. ఈ యంశమును చెప్పుచు నారదుడు "…. నేను వారి యుపదేశంబున వాసుదేవుని మాయానుభావంబు దెలిసితి …." అని వివరించెను. అటుపైన మూడవ సోపాన మారంభమగును. దీనిని *'నారాయణోపాసన'* మందురు.

**నారాయణోపాసనము :**

**ఇందు జీవుని ప్రజ్ఞ దేవునియందైక్యమై, తన్మయమై సర్వాంతర్యామిత్వము నందును. ఈ స్థితిలో నున్నవాడు తన దేహమును, జనన మరణాదులనే గాక, సర్వజీవరాశుల దేహాదులను లెక్కజేయక ఆవశ్యకతను బట్టి అందు తానే వ్యక్త మగుచుండును. తన సంకల్పము లేకుండ పిలువబడి ఆకర్షింపబడుటకూడ కలదు. ధర్మజుడు పట్టాభిషేకమైన వెనుక నొక ప్రాతఃకాలమున శ్రీకృష్ణుని దర్శింప నేగెను. కృష్ణుని శరీరము కొంత తడవు నిశ్చేష్టమై నిలచెను. అటుపైన మేల్కాంచి కృష్ణుడు 'శరతల్పగతుడైన భీష్ముడు నన్ను పిలుచుటచే అచ్చటి కేగితిని' అని చెప్పెను. నారాయణోపాసనమున సిద్ధులైనవారు కూడ నిట్లుందురు. వారు దేహధారులైన నారాయణుని మూర్తులేగాని జీవులు కారు.**

ఈ మూడు సోపానముల ఆచరణీయమైన మార్గమును అనుభూతి కందించి యుపదేశించుటయే భాగవతము యొక్క పరమార్థము. ఈ ఆచరణీయత సాధకుని స్థితిపై నాధారపడినది కాక మార్గము యొక్క అమోఘత్వముపై నాధారపడినది.

భగవంతుని అంతర్యామిత్వము నందినవారు భాగవతులు. వారిని సేవించి నపుడు కలుగు భగవంతుని యనుభూతి, సూటిగ అవ్యక్తుడగు భగవంతుని సేవించు నపుడు కలుగదు. "మీరు దేహము ధరించినవారు కనుక అవ్యక్తమైన మార్గము దుఃఖము కలిగించును." అని కృష్ణుడు గీతయం దుపదేశించెను. దీనిని బట్టి

వాసుదేవోపాసనమే భాగవతమున ప్రాధాన్యము వహించును. వేద సంప్రదాయమున సంవత్సరమును కాలపురుషుడైన భగవంతునిగ నారాధించుట, అందు పండ్రెండు మాసములును వాసుదేవుని మంత్రమున పండ్రెండక్షరములుగ స్వీకరింపబడుట కూడ భాగవత గ్రంథ రచనా రహస్యమునకు పునాది. ఈ మాసములకు సంకేతములుగ *"ఓం నమోభగవతే వాసుదేవాయ"* అను పండ్రెండు అక్షరములు వాసుదేవ ద్వాదశాక్షరీమంత్రముగ ఋషులచే అనుగ్రహింపబడినది. వాని ననుసరించి భాగవత గ్రంథము పండ్రెండు స్కంధములుగ నిబద్ధము చేయబడినది. ఇట్లు గ్రంథరచన చేయుట ఋషిప్రోక్త గ్రంథము లన్నిటియందును కాననగును.

పరమ పురుషుడైన భగవంతుడు జీవుడుగ దిగివచ్చుట వాసుదేవుని అవతరణము అనబడును. అవతరించు స్థితిలో నున్న దేవుడు 'హరి' అను సంకేత పదమున చెప్పబడును. అతడు గర్భస్థుడై మొదటి మాసమున తన అంతర్యామి ప్రజ్ఞను మాటుపరచి జీవ ప్రజ్ఞను పొందుట 'భగవంతుని నిర్యాణము' అనబడును. దీని ననుసరించి ప్రథమ స్కంధమున శ్రీకృష్ణ నిర్యాణ మున్నది. పదియవ మాసమున జీవుడు సర్వాంగపరిపుష్టి పొంది దిగివచ్చుట అవతరణము. దీని ననుసరించి దశమస్కంధమున శ్రీకృష్ణుని జననమున్నది. గర్భస్థుడైన జీవునకు మూడవ మాసమున లోపలి అవయవముల విభాగము, పాంచభౌతిక స్థితుల వినియోగము జరుగును. దీనికి చిహ్నముగ సృష్టి నిర్మాణము చేయు దేవతల, తత్త్వముల పరిగణనమును, సృష్టి విభాగమును కపిలుడు గర్భస్థుడై తల్లి కుపదేశించుట మూడవ స్కంధమున చెప్పబడినది. గర్భమున అండమునుండి శిశువు దేహాదులు సృష్టింపబడుట కూడ మూడవ మాసమున జరుగును. కనుక తృతీయ స్కంధముననే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించిన విధానము వర్ణింపబడినది. అన్ని ప్రజ్ఞలకును మూలమైన శిరస్సునుండి వెన్నెముక నాళముగ దిగివచ్చుట కూడ మూడవ మాసమున జరుగును. కనుక బ్రహ్మదేవుడు పద్మము నందు మేల్కొని పద్మనాళములో దిగువకు ప్రయాణము చేసి దాని మూలమును తెలిసికొనగోరి, చేతకాక తిరిగి వచ్చుట మూడవ స్కంధముననే వర్ణింపబడినది. అన్ని ప్రజ్ఞలకును సమన్వయము, బ్రహ్మజ్ఞాన వికాసమునకు మూలము, యోగాభ్యాస సాధనకు కావలసిన

యంత్రము అగు వెన్నెముకలోని విభాగములు మూడవ మాసముననే యేర్పడును. కనుక మూడవ స్కంధముననే బ్రహ్మ, నారాయణుని నుండి యోగవిద్యను, భాగవత రహస్యమును స్వీకరించుట చెప్పబడినది. ఇవి కేవల ముదాహరణలు మాత్రమే.

గ్రంథరచన మంతయు ప్రత్యేకములైన జీవుల యుపదేశ గుప్తవిద్యలతో నిండి యున్నది. ఇన్నియు అనుభూతితో జోడించి మాత్రమే ఉపదేశింపబడును. వీనిని నేర్చుచున్నపుడు వీనియందు భగవంతుని స్మరణ లేనిచో కేవల శాస్త్రము లగును. భాగవతమున కది పనికిరాదు. అన్నియు వాని లీలలుగ గుర్తుంచుకొనినచో ఆడుచు, పాడుచు విద్యలయందు విప్పారుట జరుగును. ఇందేవిద్యకును స్వతంత్ర మైన అస్తిత్వము లేదు. ఉన్నట్లు కనిపించినచో అది ద్రష్టయొక్క అజ్ఞానము లేక బంధము అనబడును. విష్ణూపాసనమున కర్మయోగము, వాసుదేవోపాసనమున వైరాగ్య వివేకములతో గూడిన జ్ఞానయోగము, నారాయణోపాసనమున భక్తి యోగము అను స్థితులు సమన్వయింపబడి అష్టాంగములుగ భాగవతమూర్తియైన సాధకుని దివ్య దేహమున నెనిమిది అంగములుగ సమన్వయము చూపబడినది. నవీనయుగమున ఈ సంపూర్ణ యోగమునే అరవింద యోగీంద్రులు మరల నొక్కమారు నొక్కిచెప్పిరి.

# గజేంద్రమోక్షణము

(మూలము)

వ. చతుర్థమనువు కాలప్రసంగంబు వివరించెద. 17

సీ. మానవాధీశ్వర! మనువు నాలవవాఁడు
తామసుండనఁగ నుత్తముని భ్రాత
పృథివీపతులు కేతువృషనరఖ్యాత్యాదు
లతనిపుత్రులు పద్గు రధికబలులు
సత్యకహరివీర సంజ్ఞులు వేల్పులు
త్రిశిఖనామమువాఁడు దేవవిభుఁడు
మునులు జ్యోతిర్వ్యోమ ముఖ్యులు హరిపుట్టె
హరిమేధునకుఁ బ్రీతి హరిణియందు

ఆ. గ్రాహబద్ధుఁ డయిన గజరాజు విడిపించి
ప్రాణభయమువలనఁ బాపి కాచె
హరి దయాసముద్రుఁ డఖిలలోకేశ్వరుఁ
డనిన శుకునిఁ జూచి యవనివిభుఁడు. 18

క. నీరాట వనాటములకుఁ
బోరాటం బెట్లు గలిగెఁ బురుషోత్తముచే
నారాట మెట్లు మానెను
ఘోరాటవిలోని భద్ర కుంజరమునకున్. 19

క. మునినాథ! యీ కథాస్థితి
వినిపింపుము వినఁగ నాకు వేడుక పుట్టెన్
వినియెదఁ గర్ణేంద్రియముల
పెనుఁబండువు సేయు మనముఁ బ్రీతిం బొందన్. 20

క. ఏ కథలయందుఁ బుణ్య
శ్లోకుడు హరి సెప్పఁబడును సూరిజనముచే
నా కథలు పుణ్యకథ లని
యాకర్ణింపుదురు పెద్ద లతిహర్షమునన్. 21

వ. ఇవ్విధంబునఁ బ్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రుండు బాదరాయణి నడిగె నని చెప్పి సభాసదులయిన మునుల నవలోకించి సూతుండు పరమహర్ష సమేతుండై చెప్పె నట్లు శుకుండు రాజున కి ట్లనియె. 22

సీ. రాజేంద్ర! విను సుధారాశిలో నొక పర్వ
తము త్రికూటం బనఁ దనరుచుండు
యోజనాయుత మగు నున్నతత్వంబును
నంతియ వెడలుపు నతిశయిల్లుఁ
గాంచ నాయస్సారకల ధౌతమయములై
మూఁడుశృంగంబులు మొనసియుండుఁ
దటశృంగబహురత్న ధాతుచిత్రితములై
దిశలు భూనభములుఁ దేజరిల్లు

తే. భూరిభూజలతాకుంజ పుంజములును
మ్రోసి పఱతెంచు సెలయేటి మొత్తములును
మరగి తిరిగెడు దివ్యవిమానములును
జఱులఁ గ్రీడించు కిన్నరచయముఁ గలిగి. 23

వ. అది మఱియును మాతులుంగ లవంగ లుంగ చూత కేతకీ భల్లాత కామ్రాతక సరళ పనస బదరీ వకుళ వంజుల వట కుటజ కుంద కురవక కురంటక కోవిదార ఖర్జూర నారికేళ సిందువార చందన పిచుమంద మందార జంబూ జంబీర మాధవీ మధూక తాల తక్కోల తమాల హింతాల రసాల సాల ప్రియాళు బిల్వామలక క్రముక కదంబ కరవీర కదళీ కపిత్థ కాంచన కందరాళ శిరీష శింశుపాశోక పలాశ నాగ పున్నాగ చంపక శతపత్ర మరువక మల్లికా మతల్లికాప్రముఖ నిరంతర వసంత సమయ సౌభాగ్య

సంప దంకురిత పల్లవిత కోరకిత కుసుమిత ఫలిత లలిత విటప విటపి వీరు న్నివహాలంకృతంబును మణివాలుకానేక విమల పులినతరంగిణీ సంగతవిచిత్రవిద్రుమలతా మహోద్యాన శుక పిక నికర సమంచిత నిశిత చంచూపుట నిర్దళిత శాఖిశాఖాంతర పరిపక్వఫలరంధ్ర ప్రవర్షిత రసప్రవాహ బహుళంబును గనకమయసలిలకాసార కాంచన కుముదకహ్లారకమల పరిమళ మిళిత కబళాహారసంతతాంగీకారభార పరిశ్రాంత కాంతా సమాలింగిత కుమార మత్తమధుకర విటసముదయ సమీపసంచార సముదంచిత శకుంత కలహంస కారండవ జలకుక్కుట చక్రవాక బక బలాక కోయష్టిక ముఖర జలవిహంగవిసర వివిధ కోలాహల బధిరీభూత భూనభోఽ ంతరాళంబును దుహినకరకాంత మరకత కమలరాగ వజ్ర వైదూర్య నీల గోమేధిక పుష్యరాగ మనోహర కనక కలధౌతమయానేక శిఖరతట దరీ విహరమాణ విద్యాధర విబుధ సిద్ధ చారణ గరుడ గంధర్వ కిన్నర కింపురుష మిథున సంతత సరససల్లాప సంగీత ప్రసంగ మంగళాయతనంబును గంధగజ గవయ గండభేరుండ ఖడ్గ కంఠరవ శరభ శార్దూల శశ చమర శల్య భల్ల సారంగ సాలావృక వరాహ మహిష మర్కట మహోరగ మార్జాలాది నిఖిలమృగనాథసమూహ సమర సన్నాహ సంరంభ సంచకిత శరణాగత శమనకింకరంబునై యొప్పు నప్పర్వత సమీపంబు నందు. 24

క. భిల్లీ భల్ల లులాయక
భల్లుక ఫణి ఖడ్గ గవయ వలిముఖ చమరీ
ఝిల్లీ హరి శరభక కిటి
మల్లాద్భుత కాక ఘూక మయమగు నడవిన్. 25

శా. అన్యాలోకనభీకరంబులు జితాశానేకపానీకముల్
వన్యేభంబులు గొన్ని మత్తతనులై వజ్యా విహారాగతో
దన్యత్వంబున భూరిభూధరదరీ ద్వారంబులందుండి సౌ
జన్యక్రీడల నీరుగాలివడి కాసారావగాహార్థమై. 26

ఆ. అంధకారమెల్ల నద్రిగుహాంతర
వీథులందుఁ బగలు వెఱచి డాఁగి
యెడరువేచి సంధ్య నినుఁడు వృద్ధతనున్న,
వెడలె ననఁగ గుహలు వెడలెఁ గరులు. 27

క. తలఁగవు కొండలకైనను
మలఁగవు సింగములకైన మార్కొనుకడిమిం
గలఁగవు పిడుగులకైనను,
నిల బలసంపన్నవృత్తి నేనుఁగుగున్నల్. 28

సీ. పులుల మొత్తంబులు పొదరిండ్లలోఁ దూఱు
ఘోరభల్లూకముల్ గుహలు సొచ్చు
భూదారములు నేలబొఱియలలో డాఁగు
హరిదంతముల కేఁగు హరిణచయము
మడువులఁ జొరఁబాఱు మహిషసంఘంబులు
గండశైలంబులఁ గపులు ప్రాఁకు
వల్మీకములు సొచ్చు వనభుజంగంబులు
నీలకంఠంబులు నింగి కెగయు

తే. వెఱచి చమరీమృగంబులు విసరు వాల
చామరంబుల విహరణశ్రమము వాయ
భయదపరిహేల విహరించు భద్రకరుల
గాలి వాఱినమాత్రన జాలిఁ బొంది. 29

క. మదగజదానామోదముఁ
గదలనితమకములఁ ద్రావి కడుపులు నిండం
బొదలును దుమ్మెద కొదమల
కదుపులు జుంజు మ్మటంచు గానము సేసెన్. 30

క. తేఁటి యొకటి యొరుప్రియకును
మాటికి మాటికిని నాగ మదజలగంధం

బేటికని తన్నుఁ బొందెడి
బోటికి నందిచ్చు నిండుబోటుఁదనమునన్. 31

క. అంగీకృతరంగన్మా
తంగీమదగంధమగుచుఁ దద్దయు వేడ్కన్
సంగీతవిశేషంబుల
భృంగీగణ మొప్పె వ్రాను పెట్టెడిమాడ్కిన్. 32

క. వల్లభలు వాఱి మునుపడ
వల్లభ మని మునరినేని వారణదానం
బొల్లక మధుకరవల్లభు
లుల్లంబులఁ బొందిరెల్ల యుల్లాసంబుల్. 33

వ. అప్పుడు. 34

మ. కలభంబుల్ నెరలాడుఁ బల్వలము లాఘ్రాణించి మట్టాడుచున్
ఫలభూజంబులు రాయుచుం జివురుజొంపంబుల్ వడిన్ మేయుచుం
బులులం గాఱెనుపోతులన్ మృగములం బోనీక శిక్షించుచుం
గొలఁకుల్ సొచ్చి కలంచుచున్ గిరులపై గొబ్బిళ్ళు గోరాడుచున్. 35

క. తొండంబుల మదజలవృత
గండంబులఁ గుంభములను ఘట్టన సేయం
గొండలు దలక్రిందై పడు
బెండుపడున్ దిశలు సూచి బెగడున్ జగముల్. 36

క. ఎక్కడఁ జూచిన లెక్కకు
నెక్కువయై యడవి నడచు నిభయూథములో
నొక్కకరినాథుఁ డెడతెగి
చిక్కె నొక కరేణుకోటి సేవింపంగన్. 37

వ. ఇట్లు వెనుక ముందట నుభయపార్శ్వంబులఁ దృషార్దితంబులై యరుగు
దెంచు నేనుంగుగములం గానక తెఱంగు దప్పి తొలంగుడుపడి

యీశ్వరాయత్తంబైన చిత్తంబు సంవిత్తంబు గాకుండుటంజేసి తానును
దన కరేణుసముదయంబును నొక్క తెరువై పోవుచు. 38

సీ. పల్వలంబుల లేఁత పచ్చిక మచ్చికఁ
జెలుల కందిచ్చు నచ్చికము లేక
నివురుజొంపములఁ గ్రొవ్వేలయు పూఁగొమ్మలఁ
బ్రాణవల్లభలకుఁ బాలువెట్టు
ఘనదానశీతల కర్ణతాళంబుల
దయితల చెమటార్చుఁ దనువు లరసి
మృదువుగాఁ గొమ్ముల మెల్లన గళములు
నివురుచుఁ బ్రేమతో నెఱపు వలపు

తే. పిఱుఁదు చక్కట్ల డగ్గఱి ప్రేమతోడ
డాసి మూర్కొని దివికిఁ దొండంబు సాఁచు
వెద వివేకించుఁ గ్రీడించు విశ్రమించు
మత్తమాతంగమల్లంబు మహిమతోడ. 39

సీ. తన కుంభముల పూర్ణతకు డిగ్గి యువతుల
కుచములు పయ్యెదకొంగు లీఁగఁ
దనయానగంభీరతకుఁ జాల కబలల
యానంబు లందెల నండగొనఁగఁ
దనకరశ్రీఁ గని తలఁగి బాలల చిఱు
దొడలు మేఖలదీప్తిఁ దోడు పిలువఁ
దనదంతరుచికోటి తరుణుల నగవులు
ముఖచంద్రదీప్తుల ముసుఁగు దిగువఁ

తే. దనదు లావణ్యరూపంబుఁ దలఁచి చూడ
నంజనాభ్రము కపిలాది హరిదిభేంద్ర
దయితలందఱుఁ దనవెంటఁ దగిలి నడవఁ
గుంభివిభుఁ డొప్పె నొప్పులకుప్పవోలె. 40

వ. మఱియు నానాగహనవిహరణమహిమతో మదగజేంద్రంబు మార్గంబుఁ దప్పి పిపాసాపరాయత్తచిత్తంబున మత్తకరేణువుల మొత్తంబునుం దానునుం జనిచని. 41

మ. అటఁగాంచెం గరిణీవిభుండు నవపుల్లాంభోజకల్హారమున్
నటదిందీవరవారముం గమఠమీనగ్రాహదుర్వారమున్
వట హింతాల రసాల సాల సుమనోవల్లీ కుటీతీరముం
జటులోద్ధూత మరాళ చక్ర బకసంచారంబుఁ గాసారమున్. 42

వ. ఇ ట్లనన్య పురుషసంచారంబై నిష్కళంకంబైన యప్పంకజాకరంబుఁ బొడగని. 43

సీ. తోయజగంధంబు దోఁగిన చల్లని
మెల్లనిగాడ్పుల మేను లలరఁ
గమలనాళాహార విమలవాక్కలహంస
రవములు సెవులపండువులు సేయ
ఫుల్ల దిందీవరాంభోరుహామోదంబు
ఘ్రాణరంధ్రంబుల గారవింప
నిర్మలకల్లోలనిర్గతాసారంబు
వదనగహ్వరముల వాడు దేర్పఁ

తే. ద్రిజగదభినవసౌభాగ్య దీప్తమైన
విభవ మీక్షణములకును విందు సేయ
నరిగి పంచేంద్రియ వ్యవహారములను
మఱచి మత్తేభయూథంబు మడుఁగు సొచ్చె 44

క. తొండంబులఁ బూరించుచు
గండంబులఁ జల్లుకొనుచు గళగళరవముల్
మెండుకొన వలుఁదకడుపులు
నిండన్ వేదండకోటి నీటిం ద్రావెన్. 45

వ. అప్పుడు. 46

మ. ఇభలోకేంద్రుఁడు హస్తరంధ్రముల నీ రెక్కించి పూరించి చం
డభమార్గంబున కెత్తి నిక్కి వడి నుడ్డాడించి పింజింప నా
రభటుల్ నీరములోనఁ బెల్లెగసె నక్రగ్రాహపాఠీనముల్
నభమం దాడెడు మీనకర్కటముల న్బట్టెన్ సురల్ ప్రాన్పడన్. 47

వ. మఱియు నగ్గజేంద్రంబు నిరర్గళవిహారంబున. 48

సీ. కరిణీకరోజ్ఝిత కంకణచ్ఛటఁ దోఁగి
సెలయేటి నీలాద్రి చెలువుఁ దెగడు
హస్తినీ హస్త విన్యస్తపద్మంబుల
వేయిగన్నులవాని వెరవు సూపుఁ
గలభీసముత్కీర్ణ కహ్లారరజమునఁ
గనకాచలేంద్రంబు ఘనతఁ దాల్చుఁ
గుంజరీ పరిచిత కుముదకాండంబుల
ఫణిరాజమండనప్రభ వహించు

ఆ. మదక రేణుముక్త మౌక్తికశుక్తుల
మెఱుఁగు మొగిలుతోడ మేలమాడు
నెదురు లేనిగరిమ నిభరాజమల్లంబు
వనజగేహకేళి వ్రాలునపుడు. 49

వ. మఱియు నా సరోవరలక్ష్మి మదగజేంద్ర వివిధవిహారవ్యాకులిత నూతన లక్ష్మీవిభవయై యనంగవిద్యానిరూఢ మల్లవప్రబంధపరికంపిత శరీరాలంకార యగు కుసుమకోమలియునుంబోలె వ్యాకీర్ణచికురమత్త మధుకర నికరయు విగతరసవదన కమలయు నిజస్థానచలిత కుచరథాంగ యుగలయు లంపటితజఘనపులినతలయునైయుండె నంత. 50

సీ. భుగభుగాయితభూరి బుద్బుదచ్ఛటలతోఁ
గదలుచు దివికి భంగంబు లెగయ

భువనభయంకర ఫూత్కారరవమున
ఘోరనక్రగ్రాహ కోటి బెగడ
వాలవిక్షేపదు ర్వారఝుంఝూనిల
వశమున ఘుమఘుమావర్త మడరఁ
గల్లోలజాలసం ఘట్టనంబులఁ దటీ
తరు లమూలంబులై ధరణిఁ గూల

తే. సరసిలోనుండి పొడగని సంభ్రమించి
యుదరి కుప్పించి లంఘించి హుంకరించి
భానుఁ గబళించి పట్టు స్వర్భానుపగిది
నొక్క మకరేంద్రుఁ డిభరాజు నొడిసిపట్టె. 51

క. వడిఁ దప్పించి కరీంద్రుఁడు
నిడుదకరం బెత్తి వ్రేయ నీరాటంబుం
బొడ వడఁగినట్లు జలములఁ
బడి కడువడిఁ బట్టెఁ బూర్వ పదయుగళంబున్. 52

చ. పదములఁ బట్టినం దలఁకుఁబా టొకయింతయు లేక శూరతన్
మదగజవల్లభుండు ధృతిమంతుఁడు దంతయుగాంతఘట్టనం
జెదరఁగఁ జిమ్మె నమ్మకరిచిప్పలు పాదులు దప్ప నొప్పఱన్
వదలి జలగ్రహంబు కరివాలముమూలముఁ జీరె గోరులన్. 53

క. కరిఁ దిగుచు మకరి సరసికిఁ
గరి దరికిని మకరిఁ దిగుచుఁ గరకరిబెరయన్
గరికి మకరి మకరికిఁ గరి
భర మనుచును నతలకుతల భటు లరుదుపడన్. 54

వ. ఇట్లు కరిమకరంబులు రెండును నొండొండ సముద్దండదండంబులై తలపడి నిఖిలలోకాలోకనభీకరంబులై యన్యోన్యవిజయశ్రీవశీకరంబులై సంక్షోభిత కమలాకరంబులై హరి హరియును గిరి గిరియునుం దాఁకి

పిఱుతివియక పెనంగు తెఱంగున నీరాటంబయిన పోరాటంబునం బట్టుచు వెలికి లోనికిం దిగుచుచుఁ గొలంకు గలంకం బొందఁ గడువడి నిట్టట్టుఁ బడి తడఁబడి బుడబుడానుకారంబులై బుగులుబుగుల్లను చప్పుళ్లతో నురువులు గట్టుచు జలంబు లుప్పరం బెగయం జప్పరించుచుఁ దప్పక వదనగహ్వరంబుల నప్పళించుచు నిశితనితాంత దురంతదంత కుంతంబుల నింతింతలు దనియలయి నెప్పళంబునం బునుకచిప్పలు గుదుళ్ళుదప్పి రక్తంబులు గ్రమ్ముదేర హుమ్మని యొక్కుమ్మడిం జిమ్ముచు నితరేతరసమాకర్షణంబులం గదలక పదంబుల మొదలిపట్టు వదలక కుదురై వర్తించుచుఁ బరిభ్రమణ వేగంబున జలంబులం దిరుగుచు మకరకమఠకర్కట గండకమండూకాది సలిలనిలయంబుల ప్రాణంబులు క్షీణంబులుగా నొండొంటిం దాఁకు రభసంబున నిక్కలువడ మ్రక్కంద్రొక్కుచు మెండుచెడి బెండువడి నాఁచుగుల్ల చిప్పతండంబులఁ బరస్పరతాడనంబులకు నడ్డంబుగా నొడ్డుచు నోల మాసగొనక గెలుపుఁ దలంపులు బెట్టిదంబులై రెట్టింప నహోరాత్రంబులుం బోలెఁ గ్రమక్రమ విజృంభమాణంబులై బహుకాల కలహవిహారంబులై నిర్గతనిద్రాహారంబులై యవక్రపరాక్రమ ఘోరంబులై పోరుచున్న సమయంబున. 55

క. జవమును జలమును బలమును
వివిధములుగఁ బోరు కరటివీరతకు భువిన్
దివి మకరమీనకర్కట
నివహము లొక్కటన మిత్రనిలయముఁ బొందెన్. 56

శా. ఆటోపంబునఁ జిమ్ము ఝొమ్మగల వజ్రాభీలదంతంబులం
దాఁటించున్ మెడఁ జుట్టిపట్టి హరిదోర్దండాభశుండాహతిన్
నీటన్ మాటికి మాటికిఁ దిగువఁగా నీరాటమున్ నీటిపో
రాట న్నోటమిపాటుఁ జూపుట కరణ్యాటంబు వాచాటమై. 57

వ. అప్పుడు. 58

ఆ. మకరితోఁడఁ బోరు మాతంగవిభుని నొ
క్కరుని డించి పోవఁ గాళ్ళురాక
కోరి చూచుచుండెఁ గుంజరీయూథంబు
మగలు దగులు గారె మగువలకును. 59

వ. అంత. 60

ఆ. జీవనంబు దనకు జీవనంబై యుంట
నలవుఁ జలము నంతకంత కెక్కి
మకర మొప్పె డస్సె మత్తేభమల్లంబు
బహుళపక్షశీత భాను పగిది. 61

ఉ. ఉఱుకుం గుంభయుగంబుపై హరిక్రియన్ హుమ్మంచుఁ బాదంబులన్
నెఱయం గంతము వెన్ను దన్ను నెగయున్ హేలాగతిన్ వాలముం
జఱచున్ నుగ్గుగఁ దాఁకు ముంచు మునుఁగున్ శల్యంబులున్ దంతముల్
విఱుగన్ వ్రేయుచుఁ బొంచి పొంచి కదియున్ వేదండయూథోత్తమున్.

మ. పొడ గానంబడకుండ డాఁగు వెలికిం బోవంగఁ దా నడ్డమై
పొడచూపుం జరణంబులం బెనఁగొనుం బోరాక రారాక బు
గ్గడిలం గూలఁగఁ దాఁచు లేచుతఱి నుద్ఘాటించు లంఘించు బ
ల్విడిఁ జీరుం దలఁగున్ మలంగు నొడియన్ వేధించుఁ గ్రోధించుచున్.

వ. ఇట్లు విస్మితనక్రచక్రంబయి నిర్వక్రవిక్రమంబున నల్పహృదయ జ్ఞాన దీపంబు నతిక్రమించు మహామాయాంధకారంబునుం బోలె నంతకంతకు నుత్సాహకలహసన్నాహబహువిధజలావగాహం బయిన గ్రాహంబు మహాసాహసంబున. 64

శా. పాదద్వంద్వము నేల మోపి పవనున్ బంధించి పంచేంద్రి యో
న్మాదంబుం బరిమార్చి బుద్ధిలతకున్ మాఱాకు హత్తించి ని

ష్ఠేదబ్రహ్మపదావలంబనరతిం గ్రీడించు యోగీంద్రుమ
ర్యాదన్ నక్రము విక్రమించెఁ గరిపాదాక్రాంతినిర్వక్రమై. 65

ఆ. వనగజంబు నెగచు వనచారిఁ బొడగని
వనగజంబ కాన వజ్రిగజము
వెల్లనై సురేంద్రు వేచి సుధాంధులు
పట్టఁ బట్టనీక బయలు ప్రాఁకె. 66

ఉ. ఊహగలంగి జీవనపుటోలమునం బడి పోరుచున్ మహా
మోహలతానిబద్ధపదమున్ విడిపించుకొనంగ లేక సం
దేహముఁ బొందు దేహిక్రియ దీనదశన్ గజ ముండె భీషణ
గ్రాహదురంతదంతపరిఘట్టితపాదఖురాగ్రశల్యమై. 67

వ. ఇవ్విధంబున 68

క. అలయక సొలయక వేసట
నొలయక కరి మకరితోడ నుద్దండత రా
త్రులు సంధ్యలు దివసంబులు
సలిపెం బో రొక్క వేయి సంవత్సరముల్. 69

మ. పృథుశక్తిన్ గజ మా జలగ్రహముతోఁ బెక్కేండ్లు పోరాడి సం
శిథిలంబై తనలావు వైరిబలముం జింతించి మిథ్యామనో
రథ మింకేటికి దీని గెల్వ సరి పోరం జాలరా దంచు స
వ్యథమై యిట్లనుఁ బూర్వపుణ్యఫలదివ్యజ్ఞానసంపత్తితోన్. 70

శా. ఏ రూపంబున దీని గెల్తు నిట మీఁ దేవెంటఁ జింతింతు నె
వ్వారిం జీరుదు నెవ్వ రడ్డ మిఁక నివ్వారిప్రచారోత్తమున్
వారింపం దగువార లెవ్వ రఖిలవ్యాపారపారాయణుల్
లేరే మ్రొక్కెద దిక్కుమాలిన మొఱాలింపం బ్రపుణ్యాత్మకుల్. 71

శా. నానానేకపయూథముల్ వనములోనం బెద్దకాలంబు స
న్మానింపన్ దశలక్షకోటికరిణీనాథుండనై యుండి మ

ద్దానాంభఃపరిపుష్టచందనలతాంతచ్ఛాయలందుండ లే
కీ నీరాస ని టేల వచ్చితి భయం బెట్లో కదే యీశ్వరా. 72

ఉ. ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరు డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్. 73

క. ఒకపరి జగములు వెలి నిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయముఁ దానై
సకలార్థసాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థిఁ దలంతున్. 74

క. లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁ దుది నలోకం బగుపెం
జీఁకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్. 75

క. నర్తకునిభంగిఁ బెక్కగు
మూర్తులతో నెవ్వఁ డాడు మునులు దివిజులుం
గీర్తింప నేర రెవ్వని
వర్తన మొరు లెఱుఁగ రట్టివాని నుతింతున్. 76

ఆ. ముక్తసంగులైన మునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధుచిత్తు
లసదృశవ్రతాఢ్యు లై కొల్తు రెవ్వని
దివ్యపదము వాఁడు దిక్కు నాకు. 77

సీ. భవము దోషంబు రూపంబుఁ గర్మంబు నా
హ్వయములు గుణము నెవ్వనికి లేక

జగములఁ గలిగించు సమయించుకొఱకు నై
నిజమాయ నెవ్వఁ డిన్నియును దాల్చు
నా పరేశునకు ననంతశక్తికి బ్రహ్మ
కిద్ధరూపికి రూపహీనునకును
జిత్రచారునికి సాక్షికి నాత్మరుచికిని
బరమాత్మునకుఁ బరబ్రహ్మమునకు

ఆ. మాటలను నెఱుకల మనములఁ జేరంగఁ
గాని శుచికి సత్యగమ్యుఁ డనుచు
నిపుణుఁ డైనవాని నిష్కర్మతకు మెచ్చు
వాని కే నొనర్తు వందనములు. 78

సీ. శాంతున కపవర్గ సౌఖ్యసంవేదికి
నిర్వాణభర్తకు నిర్విశేషు
నకు ఘోరునకు గూఢునకు గుణధర్మికి
సౌమ్యున కధిక విజ్ఞానమయున
కఖిలేంద్రియద్రష్ట కధ్యక్షునకు బహు
క్షేత్రజ్ఞునకు దయాసింధుమతికి
మూలప్రకృతి కాత్మమూలున కఖిలేంద్రి
యజ్ఞాపకునకు దుఃఖాంతకృతికి

ఆ. నెఱి నసత్య మనెడి నీడతో వెలుఁగుచు
నుండు నెక్కటికి మహోత్తరునకు
నిఖిలకారణునకు నిష్కారణునకు న
మస్కరింతు నన్ను మనుచుకొఱకు. 79

క. యోగాగ్ని దగ్ధకర్ములు
యోగీశ్వరు లే మహాత్ము నొండెఱుఁగక స
ద్యోగవిభావిత మనముల
బాగుగ వీక్షింతు రట్టి పరము భజింతున్. 80

సీ. సర్వాగమామ్నాయజలధికి నపవర్గ
మయునికి నుత్తమమందిరునకు
సకలగుణారణిచ్ఛన్నబోధాగ్నికిఁ
దనయంత రాజిల్లు ధన్యమతికి
గుణలయోద్దీపిత గురుమానసునకు సం
వర్తితకర్మనిర్వర్తితునకు
దిశ లేని నాబోఁటి పశువులపాపంబు
లడఁచువానికి సమస్తాంతరాత్ముఁ

ఆ. డై వెలుంగువాని కచ్ఛిన్నునకు భగ
వంతునకుఁ దనూజ పశునివేశ
దారసక్తు లయినవారి కందఁగ రాని
వాని కాచరింతు వందనములు. 81

వ. మఱియును. 82

సీ. వరధర్మ కామార్థవర్జితకాములై
విబుధు లెవ్వాని సేవించి యిష్ట
గతిఁ బొందుదురు చేరి కాంక్షించువారి క
వ్యయదేహ మిచ్చు నెవ్వాఁడు కరుణ
ముక్తాత్ము లెవ్వని మునుకొని చింతింతు
రానందవార్ధిమగ్నాంతరంగు
లేకాంతు లెవ్వని నేమియుఁ గోరక
భద్రచరిత్రంబుఁ బాడుచుందు

ఆ. రా మహేశు నాద్యు నవ్యక్తు నధ్యాత్మ
యోగగమ్యుఁ బూర్ణు నున్నతాత్ము
బ్రహ్మ మయినవానిఁ బరుని నతీంద్రియు
నీశు దూరు సూక్ష్ము నే భజింతు. 83

వ. అని మఱియు ని ట్లని వితర్కించె. 84

సీ. పావకుం డర్చుల భానుండు దీప్తుల
నెబ్భంగి నిగిడింతు రె ట్లడంతు
రాక్రియ నాత్మకరావళిచేత బ్ర
హ్మాదుల వేల్పుల నఖిలజంతు
గణముల జగముల ఘననామరూపభే
దములతో మెఱయించి తగ నడంచు
నెవ్వఁడు మనము బుద్ధీంద్రియములుఁ దాన
యై గుణసంప్రవాహంబులు నెఱపు

ఆ. స్త్రీనపుంసకపురుషమూర్తి యునుగాక
తిర్యగమరనరాది మూర్తియునుగాక
కర్మగుణభేద సదసత్ప్రకాశిగాక
వెనుక నన్నియుఁ దా నగు విభుఁ దలంతు. 85

క. కలఁ డందురు దీనులయెడఁ
గలఁ డందురు పరమయోగిగణముల పాలం
గలఁ డందు రన్ని దిశలను
గలఁడు కలం డనెడువాఁడు గలఁడో లేఁడో. 86

సీ. కలుఁగడే నాపాలి కలిమి సందేహింపఁ
గలిమిలేములు లేక కలుగువాఁడు
నా కడ్డపడ రాఁడె నలి నసాధువులచేఁ
బడిన సాధుల కడ్డపడెడువాఁడు
చూడఁడే నా పాటుఁ జూపులఁ జూడక
చూచువారలఁ గృపఁ జూచువాఁడు
లీలతో నామొఱాలింపఁడే మొఱఁగుల
మొఱలెఱుంగుచుఁ దన్ను మొఱఁగువాఁడు

తే. అఖిలరూపముల్ దనరూప మైనవాఁడు
ఆదిమధ్యాంతములు లేక యడరువాఁడు
భక్తజనముల దీనుల పాలివాఁడు
వినఁడె చూడఁడె తలఁపడె వేగ రాఁడె. 87

క. విశ్వకరు విశ్వదూరుని
విశ్వాత్ముని విశ్వవేద్యు విశ్వు నవిశ్వున్
శాశ్వతు నజు బ్రహ్మప్రభు
నీశ్వరునిం బరమపురుషు నే భజియింతున్. 88

వ. అని పలికి తన మనంబున నగ్గజేంద్రుం డీశ్వరసన్నిధానంబు కల్పించు
కొని యి ట్లనియె. 89

శా. లా వొక్కింతయులేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా! 90

క. విను దఁట జీవులమాటలు
చను దఁట చనరానిచోట్ల శరణార్థుల కో
యను దఁట పిలిచిన సర్వముఁ
గను దఁట సందేహమయ్యెఁ గరుణావార్ధీ! 91

ఉ. ఓ కమలాప్త! యో వరద! యో ప్రతిపక్షవిపక్షదూర! కు
య్యో కవియోగివంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా
నోకహ! యో మునీశ్వరమనోహర! యో విమలప్రభావ! రా
వే కరుణింపవే తలఁపవే శరణార్థిని నన్నుఁ గావవే. 92

వ. అని పలికి మఱియు నరక్షితరక్షకుండైన యీశ్వరుం డాపన్నుండైన నన్నుం గాంచుఁగాక యని నింగి నిక్కి చూచుచు నిట్టూర్పులు నిగిడించుచు బయలాలకించుచు నగ్గజేంద్రుండు మొఱ సేయుచున్న సమయంబున.

ఆ. విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డపడక
విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డపడఁ దలంచె. 94

మ. అలవైకుంఠపురంబులో నగరిలో నా మూలసౌధంబుదా
పల మందారవనాంతరామృతసరఃప్రాంతేందుకాంతోపలో
త్పలపర్యంకరమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వలనాగేంద్రము పాహి పాహి యనఁ గుయ్యాలించి సంరంభియై. 95

మ. సిరికిం జెప్పఁడు శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ డే
పరివారంబును జీరఁ డభ్రగపతిం బన్నింపఁ డాకర్ణికాం
తరధమ్మిల్లముఁ జక్క నొత్తఁడు వివాదప్రోత్థితశ్రీకుచో
పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై. 96

వ. ఇట్లు భక్తజనపాలనపరాయణుండును నిఖిలజంతుహృదయారవింద సదనసంస్థితుండును నగు నారాయణుండు కరికులేంద్రవిజ్ఞాపిత నానావిధదీనాలాపంబు లాకర్ణించి లక్ష్మీకాంతావినోదంబులం దగులు సాలించి సంభ్రమించి దిశలు నిరీక్షించి గజేంద్రరక్షాపరత్వంబు నంగీకరించి నిజ పరికరంబు మరల నవధరించి గగనంబున కుద్గమించి వేంచేయునప్పుడు. 97

మ. తనవెంటన్ సిరి లచ్చి వెంట నవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుఁడు వానిపొంతను ధనుఃకౌమోదకీశంఖచ
క్రనికాయంబును నారదుండు ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునం గలుగువా రాబాలగోపాలమున్. 98

వ. తదనంతరంబ ముఖారవిందమకరందబిందుసందోహపరిష్యందనానంద దిందిందిర యగు నయ్యిందిరాదేవి గోవిందకరారవింద సమాకృష్యమాణ సంవ్యానచేలాంచల యయి పోవుచు. 99

మ. తన వేంచేయుపదంబుఁ బేర్కొనఁ డనాథస్త్రీజనాలాపముల్
వినెనో మ్రుచ్చులు మ్రుచ్చిలించిరొ ఖలుల్ వేదప్రపంచంబులన్
దనుజానీకము దేవతానగరిపై దండెత్తెనో భక్తులం
గని చక్రాయుధుఁ డేఁడి చూపుఁ డని ధిక్కారించిరో దుర్జనుల్. 100

వ. అని వితర్కించుచు. 101

శా. తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్లబంధంబుతో
శాటీముక్తకుచంబుతో నదృఢచంచత్కాంచితో శీర్ణలా
లాటాలేపముతో మనోహరకరాలగ్నోత్తరీయంబుతోఁ
గోటీందుప్రభతో నురోజభరసంకోచద్విలగ్నంబుతోన్. 102

క. అడిగెద నని కడు వడిఁ జను
నడిగినఁ దను మగుడ నుడుగఁ డని నెడ నుడుగున్
వెడవెడ చిడిముడి తడఁబడ
నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్. 103

సీ. నిటలాలకము లంట నివుర జుంజు మ్మని
ముఖసరోజము నిండ ముసరుఁ దేంట్లు
నళులఁ జోఁపఁగ జిల్క లల్లనల్లన చేరి
యోష్ఠబింబద్యుతు లొడియ నుఱుకు
శుకములఁ దోలఁ జక్షుర్మీనములకు మం
దాకినీపాఠీనలోక మెసఁగు
మీనపంక్తుల దాఁట మెయిదీగతో రాయ
శంపాలతలు మింట సరణిగట్టు

ఆ. శంపలను జయింపఁ జక్రవాకంబులు
కచయుగంబుఁ దాఁకి క్రొవ్వు సూపు
మెలఁత మొగిలుపిఱిఁది మెఱుఁగుఁదీగయుఁ బోలె
జలదవర్ణు వెనుకఁ జనెడు నపుడు. 104

మ. వినువీథిం జనుదేరఁ గాంచి రమరుల్ విష్ణున్ సురారాతిజీ
వనసంపత్తిని రాకరిష్ణుఁ గరుణావర్ధిష్ణు యోగీంద్రహృ
ద్వనవ ర్తిష్ణు సహిష్ణు భ క్తజనబృందప్రాభవాలంకరి
ష్ణు నవోఢోల్లసదిందిరాపరిచరిష్ణున్ జిష్ణు రోచిష్ణునిన్. 105

వ. ఇట్లు పొడగని. 106

మ. చనుదెంచెన్ ఘనుఁ డల్లవాఁడె హరిపజ్జం గంటిరే లక్ష్మి శం
ఖనినాదం బదె చక్ర మల్లదె భుజంగధ్వంసియున్ వాఁడె క్ర
న్నన యేతెంచె నటంచు వేల్పులు నమో నారాయణాయేతి ని
స్వనులై మ్రొక్కిరి మింట హస్తిదురవస్థావక్రికిం జక్రికిన్. 107

వ. అయ్యవసరంబున గుంజరేంద్రపాలన పారవశ్యంబున దేవతా నమస్కారంబు లంగీకరింపక మనస్సమానసంచారుండై పోయి పోయి కొంతదూరంబు శింశుమారచక్రంబునుం బోలె గురుమకరకుళీరమీన మిథునంబై కిన్నరేంద్రుని భాండాగారంబునుంబోలె స్వచ్ఛవరకచ్ఛపంబై భాగ్యవంతుని భాగధేయంబునుంబోలె సరాగజీవనంబై వైకుంఠంబునుం బోలె శంఖచక్రకమలాలంకృతంబై సంసారచక్రంబునుంబోలె ద్వంద్వ సంకులపంకసంకీర్ణంబై యొప్పు నప్పంకజాకరంబుఁ బొడగని. 108

మ. **కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగా బంపె స**
**త్వరితాకంపితభూమిచక్రము మహోద్యద్విస్ఫులింగచ్ఛటా**
**పరిభూతాంబరశుక్రమున్ బహువిధబ్రహ్మాండభాండచ్ఛటాం**
**తరనిర్వక్రముఁ బాలితాఖిలసుధాంధశ్చక్రముం జక్రమున్.** 109

వ. ఇట్లు పంచిన. 110

శా. అంభోజాకరమధ్యనూతననలిన్యాలింగనక్రీడనా
రంభుండైన వెలుంగుటేనిచెలు వారన్ వచ్చి నీటన్ గుభుల్
గుంభధ్వానముతోఁ గొలంకువు గలంకం బొందఁగాఁ జొచ్చి దు
ష్టాంభోవర్తి వసించుచక్కటికి డాయంబోయి హృద్వేగమై. 111

శా. భీమంబై తలఁ ద్రుంచి ప్రాణములఁ బాపెం జక్ర మాశుక్రియన్
హేమక్ష్మాధరదేహముం జకితవన్యేభేంద్రసందోహముం
గామక్రోధనగేహమున్ గరటిరక్తస్రావగాహంబు ని
స్సీమోత్సాహము వీతదాహము జయశ్రీమోహమున్ గ్రాహమున్. 112

వ. ఇట్లు నిమిషస్పర్శనంబున సుదర్శనంబు మకరితలఁ ద్రుంచు నవసరంబున. 113

క. మకర మొకటి రవిఁ జొచ్చెను
మకరము మఱియొకటి ధనదుమాటున డాఁగెన్
మకరాలయమునఁ దిరిగెడు
మకరంబులు కూర్మరాజు మఱువున కరిగెన్. 114

మ. తమముం బాసినరోహిణీవిభుక్రియన్ దర్పించి సంసారదుః
ఖము వీడ్కొన్నవిరక్తచిత్తునిగతిన్ గ్రాహంబుప ట్టూడ్చి పా
దము లల్లార్చి కరేణుకావిభుఁడు సౌందర్యంబుతో నొప్పె సం
భ్రమదాశాకరిణీకరోజ్ఝితసుధాంభస్స్నానవిశ్రాంతుఁడై. 115

శా. పూరించెన్ హరి పాంచజన్యముఁ గృపాంభోరాశిసౌజన్యమున్
భూరిధ్వానచలాచలీకృతమహాభూతప్రచైతన్యమున్
సారోదారసితప్రభాచకితపర్జన్యాదిరాజన్యమున్
దూరీభూతవిపన్న దైన్యమును నిర్ధూతద్విషత్సైన్యమున్. 116

మ. మొరసెన్ నిర్జరదుందుభుల్ జలరుహామోదంబులై వాయువుల్
దిరిగెం బువ్వులవానజల్లు గురిసెన్ దేవాంగనాలాస్యముల్
పరఁగెన్ దిక్కులయందు జీవజయశబ్దధ్వానముల్ నిండె సా
గర ముప్పొంగెఁ దరంగచుంచితనభోగంగాముఖాంభోజమై. 117

క. నిడుద యగుకేల గజమును
మడుపున వెడలంగఁ దిగిచి మదజల రేఖల్

దుడుచుచు మెల్లన పుడుకుచు,
నుడిపెన్ విష్ణుండు దుఃఖ ముర్వీనాథా! 118

క. శ్రీహరి కరసంస్పర్శను
దేహము దాహంబు మాని ధృతిఁ గరిణీసం
దోహంబుఁ దాను గజపతి
మోహనఘీంకారశబ్దములతో నొప్పెన్. 119

క. కరమున మెల్లన నివురుచు
గర మనురాగమున మెఱసి కలయం బడుచుం
గరి హరికతమున బ్రదుకుచుఁ
గరపీడన మాచరించెఁ గరిణుల మరలన్. 120

సీ. జననాథ ! దేవల శాపవిముక్తుఁడై
పటుతరగ్రాహరూపంబు మాని
ఘనుఁడు హూహూనామ గంధర్వుఁ డప్పుడు
దనతొంటి నిర్మల తనువుఁ దాల్చి
హరికి నవ్యయునకు నతిభక్తితో మ్రొక్కి
తవిలి కీర్తించి గీతములు వాడి
యా దేవు కృపనొంది యందంద మఱియును
వినతశిరస్కుఁడై వేడ్కతోడ

ఆ. దళితపాపుఁ డగుచుఁ దనలోకమున కేఁగె
నపుడు శౌరి గేల నంటి నడవ
హస్తిలోకనాథుఁ డజ్ఞానరహితుఁడై
విష్ణురూపుఁడగుచు వెలుఁగుచుండె. 121

మ. అవనీనాథ ! గజేంద్రుఁడై మకరితో నాలంబు గావించె మున్
ద్రవిళాధీశుఁ డతండు పుణ్యతముఁ డింద్రద్యుమ్ననాముండు వై
ష్ణవముఖ్యుండు గృహీతమౌననియతిన్ సర్వాత్ము నారాయణున్
సవిశేషంబుగఁ బూజ సేసెను మహాశైలాగ్రభాగంబునన్. 122

మ. ఒకనాఁ డా నృపుఁ డచ్యుతున్ మనములో నూహించుచున్ మౌనియై
యకలంకస్థితి నున్నచోఁ గలశజుం డచ్చోటికిన్ వచ్చి లే
వక పూజింపక యున్న మౌనిఁ గని నవ్యక్రోధుఁడై మూఢ! లు
బ్ధ! కరీంద్రోత్తమయోనిఁ బుట్టు మని శాపం బిచ్చె భూవల్లభా! 123

క. మునిపతి నవమానించిన
ఘనుఁ డింద్రద్యుమ్నవిభుఁడు గౌంజరయోనిం
జననం బందెను విప్రులఁ
గని యవమానింపఁ దగదు ఘనపుణ్యులకున్. 124

క. కరినాథుఁ డయ్యె నాతఁడు
కరులైరి భటాదు లెల్ల గజముగ నయ్యున్
హరిచరణసేవకతమునఁ
గరివరునకు నధికముక్తి గలిగె మహాత్మా! 125

ఆ. కర్మతంత్రుఁడగుచు కమలాక్షుఁ గొల్చుచు
నుభయనియతవృత్తి నుండెనేనిఁ
జెడును గర్మ మెల్ల శిథిలమై మెల్లన
ప్రబలమైన విష్ణుభక్తి సెడదు. 126

ఆ. చెడుఁ గరులు హరులు ధనములుఁ
జెడుదురు నిజసతులు సుతులుఁ జెడు చెనఁటులకుం
జెడక మను నట్టి గుణులకుఁ
జెడని పదార్థములు విష్ణు సేవానిరతుల్. 127

వ. అప్పుడు జగజ్జనకుండగు నప్పరమేశ్వరుండు దరహసితముఖకమలయగు
నక్కమల కి ట్లనియె. 128

క. బాలా! నావెనువెంటను
హేలన్ వినువీథి నుండి యేతెంచుచు నీ

చేలాంచలంబుఁ బట్టుట
కాలో నే మంటి నన్ను నంభోజముఖీ! 129

క. ఎఱుఁగుదు తెఱవా! యెప్పుడు
మఱవను సకలంబు నన్ను మఱచినయెడలన్
మఱతునని యెఱిఁగి మొఱఁగక
మఱవక మొఱ యిడిరయేని మఱి యన్యములన్. 130

వ. అని పలికిన నరవిందమందిరయగు నయ్యిందిరాదేవి మందస్మిత చంద్రికాసుందర వదనారవింద యగుచు ముకుందున కి ట్లనియె.131

క. దేవా! దేవరయడుగులు
భావంబున నిలిపి కొలుచుపని నాపనిగా
కోవల్లభ! యే మనియెద
నీ వెంటను వచ్చుచుంటి నిఖిలాధిపతీ! 132

క. దీనుల కుయ్యాలింపను
దీనుల రక్షింప మేలు దీవనఁ బొందన్
దీనావన నీ కొప్పును
దీనపరాధీన! దేవదేవ! మహేశా! 133

వ. అని మఱియును సముచితసంభాషణంబుల నంకించుచున్న యప్పరమ వైష్ణవీరత్నంబును సాదర సరససల్లాప మందహాసపూర్వకంబుగా నాలింగనంబు గావించి సపరివారుండై గరుడగంధర్వసిద్ధ విబుధగణ జేగీయమానుండై గరుడారూఢుండగుచు నిజసదనంబునకుం జనియె నని చెప్పి శుక యోగీంద్రుం డి ట్లనియె. 134

సీ. **నరనాథ ! నీకును నాచేత వివరింపఁ**
**బడిన యీ కృష్ణాను భావమైన**
**గజరాజమోక్షణకథ వినువారికి**
**యశము లిచ్చును గల్మషాపహంబు**

దుస్స్వప్ననాశంబు దుఃఖసంహారంబుఁ
బ్రొద్దున మేల్కాంచి పూతవృత్తి
నిత్యంబుఁ బఠియించు నిర్మలాత్మకులైన
విప్రులకును బహువిభవ మమరు

తే. సంపదలు గల్గుఁ బీడలు శాంతిఁ బొందు
సుఖము సిద్ధించు వర్ధిల్లు శోభనములు
మోక్ష మఱచేతిదై యుండు ముదము సేరు
ననుచు విష్ణుండు ప్రీతుఁడై యానతిచ్చె. 135

వ. అని మఱియు నప్పరమేశ్వరుం డి ట్లని యానతిచ్చె. నెవ్వరేని నపర రాత్రాంతంబున మేల్కాంచి సమాహిత మనస్కులయి నన్నును నిన్నును నీ సరోవరంబును శ్వేతద్వీపంబును నాకుం బ్రియంబైన సుధా సాగరంబును హేమనగంబును నిగ్గిరికందరకాననంబులను వేత్రకీచక వేణులతాగుల్మ సురపాదపంబులను నేనును బ్రహ్మయు ఫాల లోచనుండును నివసించియుండు నక్కొండశిఖరంబులను గౌమోదకీ కౌస్తుభ సుదర్శన పాంచజన్యంబులను శ్రీదేవిని శేష గరుడ వాసుకి ప్రహ్లాద నారదులను మత్స్యకూర్మవరాహా ద్యవతారంబులను దదవతారకృతకార్యంబులను సూర్య సోమ పావకులను బ్రణవంబును ధర్మతపస్సత్యంబులను వేదంబును వేదాంగంబులను శాస్త్రంబులను గో భూసుర సాధు పతివ్రతా జనంబులను జంద్రకశ్యపజాయా సముదయంబును గౌరీ గంగా సరస్వతీ కాళిందీ సునందా ప్రముఖ పుణ్యతరంగిణీనిచయంబును నమరులను నమరతరువులను నైరావతంబును నమృతంబును ధ్రువుని బ్రహ్మర్షినివహంబును బుణ్య శ్లోకులయిన మానవులను సమాహితచిత్తులై తలంతురు, వారలకుఁ బ్రాణావసాన కాలంబున మదీయంబగు విమలగతి నిత్తునని హృషీకేశుండు నిర్దేశించి శంఖంబు పూరించి సకలామరవందితచరణార

విందుండై విహగపరివృఢవాహనుండై వేంచేసె విబుధానీకంబు సంతోషించె
నని చెప్పి శుకుండు రాజున కి ట్లనియె. 136

క. గజరాజమోక్షణంబును
నిజముగఁ బఠియించునట్టి నియతాత్ములకున్
గజరాజవరదుఁ డిచ్చును
గజతురగస్యందనములుఁ గైవల్యంబున్. 137

# గజేంద్ర మోక్షణము

**(వివరణము)**

17,18. అటుపైన శుకయోగీంద్రుడు తరువాతి కథ నిట్లు చెప్పసాగెను. ఉత్తముని మన్వంతరము తరువాత, అతని సోదరుడగు తామసుడు నాలుగవ మనువయ్యెను. కేతువు, పృథుడు, నరుడు, ఖ్యాతుడు మొదలైన పదిమంది అతని కుమారులై భూమిని పరిపాలించిరి. వారందరును మహాబలవంతులు. సత్యకుడు, హరివీరుడు అను పేర్లుగలవారు దేవతాగణముల కధిపతులు కాగా, త్రిశిఖు డనువాడు ఇంద్రుడుగా నుండెను. జ్యోతిస్సు, వ్యోముడు మొదలైనవారు సప్తమహర్షులుగా నుండిరి. హరిమేధు డనువానికి హరిణియను భార్యయందు విష్ణువు ఆ కాలమున జన్మించెను. ఈ మన్వంతరములోనే దయాసముద్రుడగు విష్ణువు మొసలినోట చిక్కిన గజేంద్రుని విడిపించి ప్రాణభయము పొందకుండ రక్షించెను అని శుకమహర్షి చెప్పగా పరీక్షిత్తు ఇట్లనెను:

19,20. "భూమిపై చరించు గజేంద్రునకు, నీటిలోనుండు మొసలికి పోరాటమెట్లు సంభవించెను? ఆ గజేంద్రుని విష్ణువు రక్షించుట యెట్లు సాధ్యమయ్యెను? భీకరారణ్యములో చరించు మదపుటేనుగు విష్ణువు నెట్లు శరణు జొచ్చెను? శుకయోగీంద్రా! ఈ కథాపద్ధతి యంతయు సవిస్తరముగా వినవలెనని కోరిక పుట్టినది. కనుక వివరింపవలసినదిగా ప్రార్థించుచున్నాను.

**21. జ్ఞానులైనవారు పుణ్యశ్లోకుడైన విష్ణువును ముఖ్యపాత్రగా చేసి కథలు చెప్పుచుందురు. అట్టి కథల వలననే పుణ్యము లభించునని సజ్జనులైనవారు ఆసక్తితో వినుచుందురు గదా!"**

22. ప్రాయోపవేశము చేసియున్న పరీక్షిత్తు వ్యాస పుత్రుడగు శుకమహర్షి

నిట్లు ప్రశ్నించెను - అని సూతమహర్షి యింతవరకు చెప్పి, సాభిప్రాయముగా తనను పరివేష్టించియున్న మునులను జూచి పరమ హర్షము నిండినవాడై, "శుక మహర్షి యిట్లు చెప్పసాగెను." అని తన కథనము కొనసాగించెను.

(మూడు మన్వంతరముల తరువాత, నాలుగవ మన్వంతరమున జరిగిన ఈ గజేంద్ర మోక్షణ కథ పరమ భక్తి భావముతోను, ఎన్నో రహస్యములతోను నిండియున్నది. కనుక సూతమహర్షి మౌనముద్రలో కొంత విరామ మిచ్చెను. తాను పరమ సంతోష పరిపూర్ణుడై, మిగిలిన ఋషులకు కూడ అట్టి స్థితిని కల్పించి తన కథనమును కొనసాగించెను.)

23. "పరీక్షిన్మహారాజా! నీ వడిగిన పుణ్యకథను చెప్పుచున్నాను, శ్రద్ధగా వినుము. పాల సముద్రములో త్రికూటమను పేరుగల పర్వతమొకటి ప్రకాశించు చుండును. అది పదివేల యోజనముల ఎత్తు, అంతే వెడల్పు కలిగియుండును. బంగారము, వెండి, ఇనుములతో నిండిన మూడు శిఖరములు ఆ పర్వతముపై నిలబడి యుండును. ఆ కొండ కొమ్ములపైనను, కొండచరియలపైనను వివిధ నవరత్నములు, గైరికము మొదలగు ధాతువులు నిండియుండి, వాని కాంతులతో భూమి-ఆకాశములు ప్రకాశించుచుండును. మహా వృక్షములు, పెద్ద పెద్ద పూల తీగెలు ఆ పర్వతమునందు అల్లుకొని నిండియుండును. జలజలా ప్రవహించు ఎన్నో సెలయేళ్ళు ఆ పర్వతము నందున్నవి. దేవతల విమానములు ఆ త్రికూట పర్వతము చుట్టును తిరుగాడు చుండును. కిన్నరు లనబడు దేవతాగణములు ముచ్చటపడి ఆ కొండచరియలపై క్రీడించుచుండును

(అచ్ఛమైన చైతన్యమును పాలసముద్రమని పురాణములు సంకేతించును. దానిలో కదలిక కలిగి అలలు లేచినపుడు పైకిలేచిన ప్రతి ఒక్క అల ఒక కల్పముగా సృష్టులు వచ్చి పోవుచుండును. ఇట్లు సముద్రము నుండి ఒక అల సృష్టిగా లేచి బయలుదేరునప్పుడు ఈశ్వరుని మాయాశక్తి వెలువడి సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములను స్వీకరించును. అప్పుడది మూల ప్రకృతి (Primordial Nature) అనబడును. అవియే మూడుశిఖరముల

పర్వతముగా ఇందు వర్ణింపబడినది. ఇక ముందున్న వర్ణన అంతయు భౌతిక సృష్టియందలి క్రమ విశేషములు. అంతకు ముందువరకు తనలో తానుగా ఇమిడియుండిన వర్ణరహితమైన (Transparent) తేజస్సు ఒక వర్ణమై, మూడు గుణముల వర్ణములను స్వీకరించును. వాని లేత ముదుళ్ళ సమ్మేళనముచే వేరు వేరు వర్ణములు రూపొంది వెలువడును. సృష్టి మొదలైనప్పుడు పైన - క్రింద (ఆకాశము-భూమి) అను విభాగమేర్పడి, వివిధ వర్ణముల మేళనము వాని నడుమ ప్రసరించి, వాని చిక్కదనము (Precipitation) వలన సృష్టి రూపొందును. ఇట్లు రూపొందుటకు వివిధ ప్రజ్ఞా ప్రవాహములు పనిచేయుట యారంభమగును. అవియే సెలయేళ్ళుగా వర్ణింపబడినవి. కిన్నరులు అను దేవతాగణము తంత్రీలయ నాదమునకు అధిపతులుగా నుందురనియు వారు అశ్వముఖు లనియు పురాణములు సంకేతించును. అశ్వము అనగా కిరణ మనియు, శక్తియనియు సంకేతము. అనగా వేర్వేరు స్థాయులలో, ఛందస్సులలో (wave-lengths) ప్రజ్ఞా-శక్తుల ప్రవాహములు ప్రవర్తించు చుండును. ఈ వర్ణనముల సంపూర్ణ సమన్వయమును మన్వంతరముల సమన్వయములో చెప్పుకొనగలము.)

24. ఆ పర్వతము నందున్న అరణ్య భాగమంతయు ఎన్నో రకముల మహావృక్షములతోను, తీగెలతోను, పూల జొంపములతోను శోభిల్లుచుండును. మాదీఫలము, మామిడి, జీడి, దేవదారు, రేగు, మఱ్ఱి, అవిసె, గోరింట, కాంచనము, వావిలి, నేరేడు, వేప, నిమ్మ, విప్ప, తాడి, నల్లచంద్ర, వెలగ మొదలైన వృక్షజాతులు; మొగలి, మొల్ల, చేమంతి, గన్నేరు, మల్లె మొదలైన పుష్పజాతుల నికుంజములు; లవంగము మొదలైన తీగెలజాతులు విస్తారముగా క్రిక్కిరిసి యున్నవి. వసంతకాలమున వృక్షజాతులు విరగబూచి యుండును. అట్టి సౌభాగ్యసంపద ఆ అరణ్యాము నందు నిరంతరము ప్రవర్తించు చుండును. ఆయా వృక్షజాతు లన్నియు మొక్క మొలచినవి, చిగురు తొడిగినవి, మొగ్గ తొడిగినవి, విరగ బూచినవి, పండ్లతో నిండినవి మొదలైన వేర్వేరు స్థితులలో ఆహ్లాదము కలిగించు చుండును.

(ఈ వర్ణన భౌతిక సృష్టికి సంబంధించినది కాక, ప్రాథమిక (Primary) సృష్టికి సంబంధించినది. కనుక సృష్టి ప్రారంభమునకు సంకేతమగు వసంత కాలము మాత్రమే ఇందు నిరంతరము ఉండును. అట్లే అన్ని స్థాయులలోని సృష్టియు ప్రాథమిక సృష్టిలో ముద్రలుగా నుండును. ఒక నాటకమును సంకల్పించిన కవి మనస్సులో కథా భాగములన్నియు ఏక కాలమున ముద్రితమై యుండును. వేర్వేరు సృష్టి స్థాయుల ఏకకాల ముద్ర (Simultaneous co - existence of all phases of creation) ప్రాథమిక సృష్టిలో నుండును.)

ఆ వనమందలి చెట్ల కొమ్మలలో మిగల పండిన పండ్లకు రాచిలుకలు కన్నము పెట్టగా, అందుండి పండ్లరసములు ధారలుగా కారుచున్నవి. కలువలు, సంపెంగలు మొదలైన పూలవాసనలతో కలసిన తేనెలను కడుపార గ్రోలి, బరువెక్కియున్న ఆడు తుమ్మెదలను, కోడెవయస్సు తుమ్మెదలు కౌగలించుకొని ఉపచరించు చున్నవి. అట్టి తుమ్మెదల ఝుంకారములతో కలహంసలు, నీటికోళ్లు, జక్కవ పక్షులు, కొంగలు మొదలైన జలపక్షులు చేయు కలరవములు కలసి భూమ్యాకాశములు నిండిపోవుచున్నవి. చంద్రకాంతము, మరకతము, పద్మరాగము, వజ్ర, వైడూర్య, నీల, గోమేధిక, పుష్యరాగాది అమూల్య ధాతువు లతో నిండిన ఆ పర్వత శిఖరములపైనను కొండ చరియలపైనను గరుడ గంధర్వ కిన్నెర కింపురుషాది దేవతా గణములు జంటలు జంటలుగా విహ రించు చుండును. వారి సరస సల్లాప సంగీత గోష్ఠులతో పర్వతము శోభస్క రముగా నుండును.

ఆ పర్వతముపైనను చుట్టు ప్రక్కలను గల అరణ్యములలో మదపు టేనుగులు, ఖడ్గ మృగములు, శరభములు, శార్దూలములు, సింహములు, చమరీ మృగములు, ఏదు పందులు మొదలగు జంతువులు, గండ భేరుండములు మున్నగు పక్షిజాతులు, మహాసర్పములు మొదలగు ఎన్నో జీవరాశులు కోలాహలముగా జీవించు చుండెను. అవి పరస్పరము పోరాడుకొనుచుండగా పుట్టిన భీకర ధ్వనులకు యమకింకరులు సైతము భయకంపితులై సాగిలపడి నమస్కరించు చుందురు.

(వేరు వేరు వేగముల శక్తి - ప్రజ్ఞా ప్రవాహములు ఘర్షణ చెంది, పరిణామము చెందుట వలననే సృష్టిలోని వేర్వేరు స్థితులు రూపొందు చుండును. వేర్వేరు రసాయనముల సమ్మేళన సూత్రములను గమనించినచో ఈ సత్యము తెలియ గలదు.)

**25.** అట్టి అడవిలో అడవియావులు, ఎద్దులు, భల్లూకములు, ఖడ్గ మృగములు, కోతులు, అడవి కాకులు, గ్రుడ్లగూబలు మొదలగు జంతువులు క్రిక్కిరిసి యుండును.

**26.** ఆ అరణ్యములో ఒక మదపుటేనుగుల గుంపు కలదు. అది చూచు టకే భయంకరముగా నుండును. ఆ యేనుగులు దిగ్గజములను, వాని సైన్యము లను కూడ జయించు నంతటి బలమైనవి. ఆహార సంపాదనకు, విలాసమునకు అరణ్యములలో మదమెక్కిన దేహములతో విహారములు చేయుచున్న ఆ యేనుగుల గుంపు ఎండలలో అలసిపోయి, దప్పికతో బాధపడు చుండెను. కాని ఆ యెండలలో బయటికి రాలేక పర్వత గుహలలో సాయంత్రము వరకు దాగియుండెను. సాయంకాల మగుసరికి దప్పికతో తల్లడిల్లుచు, కోనేటిలో స్నాన మాడుటకై గుహలలో నుండి వెలువడి వచ్చెను.

**27, 28.** సూర్యునికి భయపడిన కటిక చీకటి పగలంతయు గుహలలో దాగియుండి, సాయం సమయమున సూర్యుడు ముసలి వాడగుటచే అలుసు తీసుకొని, గుహలలో నుండి బయటికి వచ్చినట్లు, నల్లని మత్తేభములు గుంపులు గుంపులుగా బయటకు వచ్చెను. ఆ మదపు టేనుగులు కొండ లెదురైనను లెక్కచేయవు; సింహములకైనను జంకవు; పిడుగులు పడినను భయపడవు.

**29.** యథేచ్ఛగా విహరించుచున్న ఆ అడవి ఏనుగుల గుంపుయొక్క మదపువాసన గాలి వాలున సోకినంతనే పెద్దపులులు గుంపులు గుంపులుగా పొదరిండ్లలో దూరిపోవును; భల్లూకములు గుహలలో దాగును; అడవి పందులు నేల బొరియలలో దూరును; లేడి గుంపులు గడ్డి జొంపములలో నక్కును; అడవి దున్నలు నీటి మడుగులలో దాగును; కోతుల గుంపులు కొండలపైకి ఎగబ్రాకును; చమరీ మృగములు భయపడి కుచ్చుతోకలు విదలించగా అవి

వింజామరముల వలె ఏనుగులకు గాలి విసరుచుండును. అడవిపాములు పుట్టలలో దూరును. నెమళ్లు ఆకాశమున కెగురును.

**30, 31.** కొదమ తుమ్మెదలు ఆ యేనుగుల మదజల ధారలను కడుపార గ్రోలి, మత్తిల్లి, ఝుమ్మని గానము చేయుచుండెను. మదపు ధారలకు మొగము మొత్తిన ఒక ఆడు తుమ్మెద కొదమ తుమ్మెదను చేరగా, అది తన పురుషత్వ స్పర్శతో ప్రియురాలిని లాలించెను.

**32, 33.** ఏనుగులు మదజల వాసనలు దట్టముగా ప్రసరించు చుండగా, వాని నాస్వాదించు చున్న తుమ్మెదల గుంపు ప్రకృతిని పరవశింప జేయునట్లు సంగీతము పాడుచుండెను. మదజల ధారలను కొదమ తుమ్మెదలు ఆస్వాదించ బోవుచుండగా, అప్పటికే మత్తెక్కిన ఆడు తుమ్మెదలు వాని చుట్టును మూగెను. దానితో కొదమ తుమ్మెదలు తమ ప్రియురాండ్రతో విహరింపసాగెను.

**34-36.** ఆ సమయమున ఏనుగుల గుంపు చెర్లాటలాడుచు చిన్న చిన్న నీటి మడుగులను వాసన చూచి, కాళ్ళతో మట్టగించి వేసెను. పండ్ల చెట్లకు దేహములు రాచుకొనుచు, చిగురులతో నిండిన తీగెల పొదలను భక్షించుచు, పులులు, ఎనుబోతులు మొదలైనవి యెదురైనచో హింసించుచు, చిన్న చెరువులను కలచి వేయుచు, కొండలపైనున్న బొట్టుగు చెట్లను పెళ్ళగించి వేయుచు విహరించు చుండెను. ఆ యేనుగులు తొండములెత్తి చెక్కిళ్ళపైనను కుంభ స్థలముల పైనను కొట్టుకొను ధ్వనికి కొండలైనను తలక్రిందులై పడు నట్లుండును. లోకములన్నియు బెంబేలుపడి దిక్కులు చూచుచుండును.

**37, 38.** ఆ అడవిలోని ఏనుగుల గుంపు లెక్కల కందనంత పెద్దది. ఎక్కడ చూచినను ఏనుగులే కనుపించును. వానిలో ఒక ఏనుగుల రాజు మందనుండి విడివడి దారి తప్పెను. తన ప్రియురాండ్రగు ఆడు ఏనుగులు తనను సేవించుచుండగా, వారితో బాటు వేరొకదారి పట్టి పోవుచుండెను. తన వలెనే దాహముతో తపించి పోవుచున్న ఏనుగుల గుంపులు (తాను దారి తప్పుటచే) కనిపించలేదు. భగవదర్పితమైన మనస్సు యొక్క స్పర్శ తన కింకను

లభింపకుండుటచే ఆ గజేంద్రుడు తన భార్యలతో బాటు తన దారిన తాను పోవసాగెను.

**39.** తాను దారి తప్పితి నను సంకోచ మావంతయును లేక, ఆ గజేంద్రుడు తన ప్రియురాండ్రతో విహరింపసాగెను. చిన్నమడుగుల ప్రక్కల నున్న లేత పచ్చికను భార్యలకు ప్రేమతో నందించు చుండెను. పొదరిండ్లను తొండముతో పీకి వానితో భార్యల కుపచారము చేసెను. బలిష్ఠమైన పూలచెట్ల కొమ్మలను విరచి వారి కందించెను. చెవులతో చల్లనిగాలి విసరుచు భార్యలకు చెమటలు ఆరునట్లు ఉపచరించెను. చెట్ల కొమ్మలతో వాని మెడలను చక్కగా నిమురుచు ప్రేమతో పరిచర్యలు చేసెను. (మానవులు పూలచెండ్లతో పరిచర్యలు చేయగా, ఏనుగులు కొమ్మలతో పరిచర్యలు చేయును.) ఆ గజేంద్రుడు భార్యల పిరుదుల వద్ద జేరి వాసనచూచి, గర్భధారణ కనువగు ఋతుకాలమని నిర్ధారించుకొని, వారితో కామక్రీడ లాచరించి, అలసిపోయెను.

**40, 41.** ఆ గజరాజు కుంభములను చూచి యువతుల కుచములు సిగ్గుపడి పయ్యెద కప్పుకొనును. దాని నడకలోని గాంభీర్యమును చూచి సిగ్గుపడిన వనితలు అందెల రవళులను తమకు సహాయముగా తీసికొనును. ఆ ఏనుగు తొండపు సొరు తమకు లేదని లేత వయస్సులోని కన్యలు తమ కలంకారముగా బంగారు మొలనూలి కాంతులను చేర్చుకొందురు. వారి నవ్వులకన్న కరిరాజు దంత కాంతులు మిన్నయగుటచే చంద్రబింబము వంటి ముఖము యొక్క కాంతులు తోడు కావలసివచ్చెను. ఆ మద కరీంద్రుని అందము చూచి, అంజనము, కపిలము మొదలగు దిగ్గజముల భార్యలు కూడ అతని వెంటపడు నట్లుండెను. అందముల కుప్పయగు ఆ కరిరాజు ఎన్నో అడవులలో విహరించుచు దారితప్పి, దాహముతో తపించిపోవుచు తన భార్యలతో కలిసి, నీటికై వెదకుచు ముందుకు సాగెను.

**42.** అట్లు సాగిన గజేంద్రుడు ఒక అద్భుతమైన సరస్సును చూచెను. అప్పుడే వికసించిన రంగు రంగుల కలువపూలతో, వానిపై నాట్యమాడుచున్న తుమ్మెదల గుంపులతో ఆ సరస్సు మనోహరముగా నుండెను. దాని యొడ్డున

మఱ్ఱి, మామిడి, మద్ది మున్నగు వృక్షరాజములు, పూల తీగెలు, పొదరిండ్లు దట్టముగా అలముకొని యుండెను. అయినను ఆ సరస్సులో నున్న తాబేళ్ళు, పెద్దచేపలు, మొసళ్ళు మొదలగు జంతువుల వలన దానిలో దిగుటకు ఏ జంతు వైనను సాహసింపదు. అయినను హంసలు, కొంగలు మున్నగు జలపక్షులు మాత్రము పైన సంచరించు చున్నవి.

(సరస్సులో మొసలి వంటి క్రూరజంతువు లున్నప్పుడు మిగిలిన జంతువులు దానిలోనికి దిగవు. సరస్సులలో జంతువులు దాహము తీర్చుకొను రేవున వాని రాకపోకల వలన కాలిబాట యేర్పడును. 'గ్రాహదుర్వారమున్' అనుటచేత ఆ సరస్సులోనికి జంతువు లేవియు దిగుట లేదని సూచింపబడినది. ఈ గజేంద్రుడు మదించి యున్నవాడు; పైగా భార్యలతో కలసి యున్నవాడు కనుక దానిని గమనింపలేదు. అట్లే జలపక్షులు కూడ సరస్సుపైనే తిరుగుచున్నవి గాని నీటిలో దిగుటలేదు. ఈ ప్రమాద సూచనలను గజరాజు గమనింప లేదు.)

**43, 44.** ఇతర మానవు లెవ్వరును లేని ఆ సరస్సు స్వచ్ఛమైన జలము లతో కనిపించు చుండగా, ఆ ఏనుగుల గుంపు పరవశించెను. కలువపూల వాసనలతో నిండిన చల్లనిగాలి సోకగా వాని దేహములు పులకరించెను. తామర తూండ్లను భుజించుచున్న రాజహంసలు చేయు కలరావములు చెవుల పండువుగా నుండెను. విచ్చిన కలువల సువాసనలు ముక్కులకు విందు చేసెను. స్వచ్ఛమైన, మధురమైన నీటి తుంపరలు పైకెగసి, దాహముతో తపించిపోవుచున్న జిహ్వలకు ఉపశాంతి కలిగించెను. మూడు లోకములయందును అంతకు ముందెరుగని క్రొత్తవైభవము కన్నులకు విందు చేసెను. ఇట్లు పంచేంద్రియ ములు పరితృప్తి పొందగా, ఆ ఏనుగుల కుటుంబము ఇంద్రియ వ్యాపారము లను మరచిపోయి మడుగులో జొరబడెను.

**జీవసృష్టి - మానవ వ్యూహము :**

(ఇంతవరకు కథ చెప్పుకొన్న తరువాత కొన్ని రహస్యములను సమన్వయము చేసికొనుట అనుకూలముగా నుండును. పైన జెప్పిన త్రికూట పర్వత వర్ణన మంతయు ప్రాథమిక సృష్టిలోనిదని చెప్పుకొంటిమి గదా! ఈ

ప్రాథమిక మూలసృష్టిలో నుండి అనంతర సృష్టి బయలుదేరును. దీనిని భూత సృష్టి, జీవజాల సృష్టి (Secondary and tertiary creation) అందురు. దేవుని చైతన్యము జీవచైతన్యముగా రూపొంది భౌతిక సృష్టిలోనికి దిగివచ్చును. అది ఒక్క జీవుడుగా నుండక, అసంఖ్యాక జీవుల సమాహార చైతన్యము (Un-differentiated group consciousness)గా ముద్దగట్టి యుండును. క్రమముగా అది దిగివచ్చి వేర్వేరు జీవులుగా రూపొందును. ఈ సమాహార చైతన్యము అవ్యక్తముగా నుండును. కనుక ఏనుగు లన్నియు గుహలో దాగియున్న వని వర్ణింపబడెను. ఆ సమాహార చైతన్యము అవ్యక్తములో నుండి వ్యక్తము అగు స్థితిలోనికి వచ్చుట యనగా, జీవరాశులుగా రూపొందుట. అట్లు రూపొంద వలెనను ఇచ్ఛయే ఏనుగుల దాహముగా వర్ణింపబడినది.

దేవుని చైతన్యము తేజోరూపమైనది. అది సూర్యుని వెలుగు వంటిది. దైవప్రజ్ఞ జీవప్రజ్ఞగా దిగివచ్చుట ఒక అద్భుతమైన ప్రక్రియ. వెలుగు అంత రించినపుడు చీకటి యుండును. దైవప్రజ్ఞ అంతరించి జీవప్రజ్ఞ రూపొందును. అనగా వెలుగు చీకటిగా మారును. కనుకనే సూర్యుడు ముసలి వాడైనందువలన, ఆ అలుసు తీసికొని ఏనుగుల గుంపు గుహలోనుండి రాత్రివేళ బయటికి వచ్చెనని వర్ణింపబడినది.

సమాహార జీవ చైతన్యము జీవప్రజ్ఞలుగా విడిపోయి దిగివచ్చును. అన్ని జీవప్రజ్ఞలును ఒకే దారిలో పయనించవు. దేని దారి దానిదే! కనుకనే ఒక ఏనుగు మందనుండి విడివడి దారి తప్పినదని వర్ణించబడినది. అట్లు బయలుదేరిన జీవ చైతన్యము తనకొక ప్రత్యేకమైన అస్తిత్వము నాపాదించుకొని, జీవుడుగా గట్టిపడును. దాని చుట్టును తన చైతన్యముచే ప్రభావితమై, శక్తి భావితమైన చోటు (Charged Space) ఏర్పడును, దానినే 'మహత్తు' అందురు. దానిలో నొక ఆవరణ మేర్పడి బిగిసిపోవును. దానిని అహంకారమను గోళమందురు. అక్కడి నుండి బుద్ధి, చిత్తము, మనస్సు, ఇంద్రియములు మున్నగునవి బీజము లుగా రూపొందును. ఇవి యన్నియు తన స్వభావములోని భాగములు లేక ప్రకృతులు. 'తాను' పురుషుడనియు, ప్రకృతి 'తన భార్య' అనియు సంకే

తించుట భారతీయ తత్త్వ సంప్రదాయము. తన స్వభావము నందలి వేరు వేరు అంశములు తన భార్యలై తనతో కదలివత్తురు. మందనుండి విడివడి దారితప్పిన ఏనుగుతో బాటు అతని భార్యలుగా ఆడ ఏనుగులు కూడ వచ్చెనని చెప్పుటలోని అంతరార్థ మిదియే!

మునుముందు రాబోవు భూతసృష్టిలోనికి జీవుడు, అతని ప్రకృతులు దిగివచ్చుట యను ప్రక్రియ ఇందు వర్ణింపబడినది. రాబోవు భూత సృష్టికి ఇది ప్రక్రియా మూలకము (Mould of process) మాత్రమే! దీని ననుసరించి మరల మరల పునః సృష్టి (Reproduction) నడచు చుండును.

ఇట్లు బయలుదేరిన జీవప్రజ్ఞకు ఒక అద్భుతమైన సరస్సు కనిపించెను. భూతసృష్టికి (Physical creation) ఆధారమైన దేహము అను వ్యూహమే అది. ఇంకను శరీరముగా ధరించబడలేదు. గనుక ప్రాణమయ స్థితిలో నున్నది. మూడు లోకములలోను అంతవరకు అట్టి అద్భుతము లేదట! అంతవరకును మూడు లోకములు విడివిడిగా తమ తమ ధర్మములతో నిండియున్నవి గాని, ఒక సంపూర్ణ వ్యవస్థ (Unified unit)గా రూపొందుట లేదు. శరీర వ్యూహమును చక్కగా అర్థము చేసికొన్నచో అంతకన్న అద్భుతము లేనేలేదు! అంతకన్న అద్భుతమైనది బ్రహ్మాండములో నిండియున్న విరాట్‌పురుషుని దేహ వ్యూహము మాత్రమే!

మానవ వ్యూహములో వేరు వేరు ప్రజ్ఞాకేంద్రములు, శక్తి కేంద్రములు నున్నవి. ఇట్టి కేంద్రములను పద్మములు లేక కలువలని శాస్త్రములు సంకే తించును. అట్టి కేంద్రములు ప్రాణశక్తికి స్థానములుగా నుండును. ఆ ప్రాణశక్తి తరంగములుగా నుండును. అది తుమ్మెదల ఝుంకారముగా సంకేతించ బడినది. ఒక శరీర వ్యూహములో ఒక్క జీవునకే అవకాశముండును. అంతవరకు ఏ పురుషుడును ప్రవేశింపని కొలను అనుటలోని అర్థమిదియే!

అంతవరకును జీవచైతన్యముతో బాటు అతని ప్రకృతులు కూడ నున్నవి. ఇంద్రియముల ధర్మములున్నవి గాని, అనుభవించుట కింద్రియములు లేవు. మనస్సు అను ధర్మమున్నది గాని, ఇంకను మనస్సున కొక అస్తిత్వము లేదు.

తన స్వభావములోని వేర్వేరు ప్రకృతి ధర్మములకు ఆధారమైన స్థానములు కావలెను. అవి యన్నియు శరీర వ్యూహములో నున్నవి. వానితోబాటు జీవుడు శరీర వ్యూహములో ప్రవేశించి సంతృప్తి పొందెను. ఏ వ్యక్తియైనను సంతోషించుట యనగా తన స్వభావము తృప్తి పరచుటయే! కనుకనే గజేంద్రుడు తన భార్యలను సంతోషపెట్టుచు తాను సుఖించుచుండెనని చెప్పబడెను. ఇంద్రియము లన్నియు తృప్తి పొందెను. అట్లే మనస్సు మున్నగునవి కూడ తృప్తిపొందెను. అనగా వానికి స్థానములు చిక్కెను.

ఇక్కడ గ్రంథములో ఒక చిత్రమైన ప్రయోగ మున్నది. అన్ని ఇంద్రియ ములును తృప్తి పొందగా, "ఇంద్రియ వ్యవహారములను మరచి" ఏనుగుల గుంపు మడుగులో ప్రవేశించెనని చెప్పబడినది. శరీర వ్యూహములో ప్రవేశించిన తరువాత ఇంద్రియముల ప్రవర్తనయే యుండును గాని, ఇంద్రియ వ్యవహార ములను మరచుట యెట్లుండును? జీవుడు యజమానిగా నుండి, తన స్వభావమును, అందలి భాగములను నియంత్రించు చుండవలెను. కాని శరీరములోనికి దిగివచ్చినపుడు తాను వేరుగా యజమానిగా నుండుట మాని, మనస్సు మొదలైన వానితో తాదాత్మ్యము చెందును. అప్పుడు ఇంద్రియములచే తాను వ్యవహరింపజేయుట మరచిపోవును. అనగా తానే మనస్సు, ఇంద్రియ ములుగా ప్రవర్తించును. దీనిని సూచించుటకే గజేంద్రుడు మడుగులో జొచ్చెనని చెప్పకుండ, మత్తేభ యూథంబు మడుగు జొచ్చెనని చెప్పబడెను. తాను తన స్వభావముతో తాదాత్మ్యము (Identification) చెంది, శరీర వ్యూహములో ప్రవేశించును. ఇట్లు ప్రవేశించిన వానికి శరీర వ్యూహములో మహత్తరమైన ఆకర్షణ, పట్టు ఉండును. అదే వ్యామోహమను మొసలి!)

**45-47.** ఆ యేనుగు లన్నియు తొండములతో నీళ్ళు పీల్చి, గల గల శబ్దములతో చెక్కిళ్ళపై చిమ్ముకొనుచు, పెద్దకడుపుల నిండుగా నీరు త్రాగెను. ఆ గజరాజు నీటిని తొండము నిండుగా పీల్చి, తొండము పైకెత్తి ఆకాశముపైకి తీవ్రవేగముతో చిమ్మెను. ఆ నీటితో పాటు సరస్సులోని చిన్న చిన్న మొసలి పిల్లలు, చేపలు, ఎండ్రకాయలు పైకెగిరి, రాశిచక్రములో నున్న కర్కాటకమును,

మీనమును పట్టుకొనునట్లుండెను. ఆ గజరాజు ఔద్ధత్యమునకు దేవతలు కూడ నిశ్చేష్టులైరి.

**48, 49.** అట్లు అడ్డులేని స్వేచ్ఛతో గజేంద్రుడు విహరించుచుండగా ఆడు ఏనుగులు అతనిపై చిమ్మిన నీటితో అతడు తడిసిన నల్లని పర్వతము వలె నుండెను. ఆడు ఏనుగులు తొండములతో పద్మములనెత్తి వాని నలంక రింపగా వేయి కన్నుల యింద్రునివలె ప్రకాశించెను. అతని భార్యలు కలువల పుప్పొడులను తొండములతో వానిపై విరజిమ్మగా, బంగారు రంగులో అతడు మేరుపర్వతమువలె వెలిగిపోయెను. అతని ప్రియురాండ్రు తామర తూండ్లను పెరికి గజరాజు నలంకరింపగా అతడు సర్పములనే ఆభరణములుగా ధరించినట్లు ప్రకాశించెను. తన రాణులు ముత్యములను, ముత్యపు చిప్పలను తనపై చల్లగా, అతడు మెఱపులతో కూడిన మేఘమువలె ఒప్పారెను.

**50.** ఆ సరోవర వైభవకన్య ఆ గజేంద్రుని విహారములచే చెదరి, చెదరిన అలంకారములే తన క్రొత్త అలంకారములుగా నొప్పారెను. కామకళాకుశలుడైన ప్రియుని వలన అలంకారములు చెదరిన సుకుమార కన్యకవలె ఆ సరోవర లక్ష్మి కనిపించెను. అందమైన కేశపాశముల వంటి తుమ్మెదల గుంపు చెదరి పోయెను. రసములను పీల్చివేసిన కమలమువలె ముఖము వాడిపోయెను. రతిక్రీడా నంతరము ఆమె వక్షోజములు కుదురు తప్పినట్లు, జక్కవ పక్షులు మూల మూలలకు సర్దుకొనెను. ఆమె పిరుదుల వంటి యిసుక తిన్నెలు బురదతో నిండిపోయెను.

**51.** అప్పుడు అకస్మాత్తుగా సరస్సులో భుగ భుగ లాడుచున్న పెద్ద బుడగలతో అలలు ఆకాశముపైకి ఎగసెను. లోక భయంకరమైన ఫూత్కార శబ్దమునకు సరస్సులోని చిన్న చిన్న మొసళ్ళు, చేపలు మున్నగునవి భయపడి పోయెను. సరస్సులో లేచిన అలల తాకిడికి ఒడ్డున నున్న చెట్లు మొదలంట పెళ్ళగించుకొని పోయెను. ఆ సరస్సులో నున్న భయంకరమైన మొసలి తీవ్ర వేగముతో తోకను త్రిప్పగా, సరస్సులోని నీరు సుడిగుండములై గిరగిర తిరిగెను. ఆ మొసలి తల పైకిపెట్టి చూచి, తీవ్ర వేగముతో పైకెగిరి ఒక్క

దూకు దూకెను. సూర్యుని కబళించు రాహువువలె ఆ మొసలి ఒక్క హుంకారముతో గజరాజును ఒడిసిపట్టెను.

(గ్రహణము నాడు సూర్యుని కబళించిన రాహువు పట్టు ఎక్కువ కాలముండదు. త్వరలోనే సూర్యునకు విముక్తి కలుగును. దేవతల వరుసలో రహస్యముగా చేరిన రాహువును విష్ణుచక్రము ఖండించెను. అట్లే ఈ గజరాజును పట్టబోవు మకరము కూడ విష్ణుచక్రము చేతనే ఖండింపబడును. ఉపమానమును ప్రయోగించునప్పుడు ఇన్ని అంశములు సమన్వయ మగునట్లు ప్రయోగించుట మహా ప్రతిభావంతుడగు కవి లక్షణము.)

**52, 53.** కాని ఆ గజరాజు మకరేంద్రుని పట్టునుండి చటుక్కున తప్పించుకొని తొండముతో నొక్క దెబ్బ కొట్టగా, మొసలి పట్టుతప్పి నీటిలో పడెను. అయినను అతివేగముగా వెనుదిరిగి గజేంద్రుని ముందరి కాళ్ళు రెంటిని నోటితో కరచి పట్టుకొనెను. ఆ మదగజేంద్రుడు ధైర్యవంతుడు గనుక కొంచమైనను భయపడలేదు. కరిరాజు దంతముల పోటులచే మకరరాజు వీపుపైనున్న పొలుసులు కుదుళ్ళతో ఊడిపోయెను. దానితో ఆ మొసలి తన ముందు పట్టు వదలి, ఏనుగు వెనుకకు చేరి, దాని అపాన స్థానమున కోరలతో చీల్చివేసెను.

**54.** ఆ తరువాత జరిగిన యుద్ధములో మొసలి ఏనుగును సరస్సులోనికి లాగుచుండగా, ఏనుగు మొసలిని ఒడ్డుపైకి లాగుచుండెను. ఇట్లు ఆ రెండును తీవ్రమైన పట్టుదలతో పోరాడుచుండగా ఇద్దరి బలములు సమానముగా నుండెను. ఒకరి తాకిడి నింకొకరు తట్టుకొనుట కష్టమయ్యెను. ఇట్లు వారి యుద్ధము భూమి లోపలను, భూమి పైనను గల జీవరాశు లన్నియు భయపడు నట్లు సాగెను.

**55.** ఈ విధముగా కరి మకరములు ఒక దానిని మించి మరియొకటి పట్టుదలగా పోరాడుచుండగా అన్ని లోకముల వారికిని భయంకరముగా నుండెను. ఒకరినొకరు జయించవలెనను పట్టుదలతో సరస్సును అల్లకల్లోలము చేయుచు అవి పోరాడుచుండగా, రెండు సింహములు, రెండు పర్వతములు పోరాడు చున్నట్లుండెను. ఒకదాని నొకటి సరస్సులోనికి, వెలుపలికి ఈడ్చు

కొనుచు పోరాడుచుండగా, సరస్సు అల్లకల్లోలమై నురగలు దేలుచుండెను. ఒకరి నొకరు చీల్చుకొనుచు లాగుచుండగా సంధిబంధముల నుండి యెముకలు కదులుచుండెను. ఆ రెండింటి వేగమునకు నీటిలో నివసించు తాబేళ్ళు, చేపలు, కప్పలు మొదలగు జీవరాశులు చనిపోవు చుండెను. ఒకదాని నొకటి పడద్రోసి కొనుచు, మట్టగించుచు, దెబ్బల కడ్డముగా నాచు మొదలైన వానిని విసరి కాచుకొనుచు అవి పోరాడుచుండెను. రాత్రింబవళ్ళవలె ఒకదాని తరువాత నొకటి బలము పుంజుకొనుచు చేయుచున్న ఆ యుద్ధము చాలకాలము సాగెను. నిద్రాహారములు లేకున్నను అవక్ర పరాక్రమముతో కరి - మకరములు ఘోరముగా పోరాటము కొనసాగించెను.

**56, 57.** ఇట్లు గజేంద్రుడు ఒడుపు, బలము, నైపుణ్యము చూపుచు పోరాడుచున్న పద్ధతికి భయపడి, రాశి చక్రములోని మకరము, మీనము, కర్కాటకము ఒక్కటై తమ మిత్రునకు సహాయముగా వచ్చునా అన్నట్లుండెను. వానికి కూడ ధైర్యము చాలక, మిత్రుడను పేరుగల సూర్యుని ఆశ్రయించు చున్నట్లు, ఆ మకర మీనాదులు ముఖము చాటు చేసెను. ఆ గజరాజు వజ్రాయుధము వంటి భయంకర దంతములతో తీవ్రవేగమున మొసలి రొమ్ము పగులునట్లు క్రుమ్మెను. తొండముతో మొసలి మెడను పట్టి పైకి విసరెను. కాని ఆ మకరరాజు తనను మాటిమాటికి నీటిలోనికి లాగుచుండగా నీటిలోని ఆ పోరాటములో గజరాజునకు నెమ్మదిగా బలము తగ్గుచున్నట్లు కనుపించెను.

**58, 59.** అట్లు మొసలితో పోరాడుచున్న గజరాజును ఒంటరిగా వదలి పోవుటకు కాళ్ళు రాక, అతని భార్యలు అచ్చటనే నిలబడి కల్లోలపడుచుండిరి. మరి భార్య-భర్తల మధ్య బంధము చాల గట్టిగా నుండును గదా!

**60, 61.** జలములే తనకు నివాసముగా, జీవనాధారముగా జీవించు మొసలికి, ఆ నీటిలోని యుద్ధములో వేగము, విజృంభణము క్రమముగా నెక్కువగుచుండగా, గజరాజు కృష్ణపక్ష చంద్రుని వలె డస్సిపోవు చుండెను.

**62.** అప్పుడు మకరేంద్రుడు విజృంభించి గజేంద్రుని ఎన్నో విధముల హింసింపసాగెను. హుంకారముతో సింహము వలెనే లంఘించి, మత్తేభ

కుంభములపై దూకి చీల్చెను. పాదముల మధ్యలో దూరి, కంఠము క్రింది భాగమున యెగిరి తన్నెను. లీలగా ఎగిరి, తోకతో ఏనుగు వీపు చిట్లునట్లు చరచెను. తీవ్రముగా తాకి, ఏనుగును నీటిలో ముంచుచు తాను కూడ మునిగెను. ఏనుగు దంతములు, ఎముకలు విరుగునట్లు దెబ్బలు కొట్టెను. పొంచి పొంచి, మూల మూలల నుండి గజరాజుపై దాడి చేసెను.

**63.** ఆ మకరము ఒకమారు జాడ కనబడకుండ నీటిలో దాగును. ఆ సందు చూచుకొని ఏనుగు బయటకు రాబోవగా దాని కాళ్ళను పెనవేయును. దాని నెట్లును కదలనీయక భయంకరముగా తాకి కూలద్రోయును. తట్టుకొని లేచుచుండగా మరల దాడి చేయును. తప్పుకొనుచు, వెనుకకు తగ్గుచు, ప్రక్కలకు ఒదుగుచు, మహాక్రోధముతో ఆ మకరేంద్రుడు గజేంద్రుని వేధించెను.

**64.** ఉన్నది ఒక్క మొసలియైనను ఎన్నో మొసళ్ళు చుట్టును చేరి వేధించు చున్నట్లు భ్రాంతి కలిగించుచు మకరేంద్రుడు మహావేగముతో కరీంద్రుని ఆక్రమించెను. అల్పుని హృదయములో స్వల్పముగా నుండు జ్ఞానజ్యోతిని గొప్ప మాయ యను చీకటి మ్రింగివేయునట్లు సమరోత్సాహముతో అంత కంతకు విజృంభించిన మకరము మహా సాహసముతో గజరాజు నాక్రమించెను.

**65.** యోగీశ్వరులు తపస్సు చేయునప్పుడు, రెండుకాళ్ళపై నిలబడి, పంచ విధ వాయువుల సంచారమును సమత్వముతో నిరోధించి, ఐదు ఇంద్రియముల ఉన్మాద ప్రవృత్తిని అణచి వేయుదురు. ఆ సాధనలో వారి బుద్ధియను తీగెకు క్రొత్త చిగురు తొడుగును. దుఃఖమునకు స్థానములేని బ్రహ్మపదము నందుకొను దారిలో అతడు చేయు ప్రయాణము ఒక క్రీడగా సాగును. అట్టి తదేక దీక్షతో మకరేంద్రుడు పరాక్రమించి, గజేంద్రుని పాదమును పట్టి నిలబడిపోయెను.

(మానవ శరీర వ్యూహము ఎన్నో పొరలతో కూర్పుచేయబడి యుండును. అవి యన్నియు తమ తమ ధర్మముల ననుసరించి, గట్టి పట్టుదలతో ఆయా కోశముల వ్యవస్థను పరిరక్షించు చుండును. ఈ ప్రవృత్తికి 'అభ్యాసము' అను సృష్టి మూల ధర్మము ఆధారము. అసలు ఒక కల్పమే బ్రహ్మదేవుని అభ్యాస బలము ననుసరించి సృష్టింపబడు చుండును. జీవప్రజ్ఞ దేహ వ్యూహములోనికి

దిగివచ్చినప్పుడు సృష్టిలో నున్న అభ్యాసబలమే పనిచేయును; కనుకనే 'ఈ దేహమే తాను' అనుకొనుట అభ్యాసమగును. ఆ అభ్యాసబలమే మిగిలిన కోశముల వ్యూహములకు కూడ ప్రసరించును. దీనిని మాయ అందురు. మాయ లేనిదే సృష్టియే లేదు. అభ్యాసమను శక్తియే మాయాశక్తి యందలి కేంద్రబిందువు. అభ్యాసబలము వలననే జీవుడు తాను వేరుగా నున్నానని భావించుట, లోకము తనకన్న వేరుగా నున్నదని భావించుట జరుగుచున్నది.

జీవుడు మాయలోనికి దిగివచ్చి బంధితుడై వర్తించు చుండుట కెంతటి అభ్యాసబలము కావలెనో, అంతకన్న గొప్ప అభ్యాసబలము విముక్తి చెందుటకు కావలసి యుండును. జీవుల ఊర్ధ్వముఖ, అధోముఖ ప్రవృత్తులు రెండింటికిని ప్రకృతిలోని అభ్యాసశక్తియే కారణ మగుచున్నది. నడుమ నెక్కడో దేవుని అనుగ్రహము గురువు ద్వారా ప్రసరించి వచ్చును. అప్పటినుండియు అంతర్ముఖమైన సాధన తపస్సుగా సాగును. అప్పుడైనను అభ్యాసబలమే పనిచేయును.

దీనిని సూచించుటకే జీవప్రజ్ఞను బంధించు వ్యామోహము కూడా యోగసాధన వంటి పట్టుదలతో పట్టుబట్టెనని వర్ణింపబడినది.)

**66.** ఇట్లు మద కరీంద్రుని వేధించుచున్న మకరేంద్రుని జూచి అరణ్యము లోని ఏనుగు లన్నియు బెదరిపోయెను. వనగజములే గాక ఇంద్రుని వాహనమగు ఐరావతము కూడ బెదరి, ఇంద్రుని క్రిందికి పడద్రోసెను. తనను పట్టవచ్చిన దేవతా భటులకు కూడ అందకుండ, ఆ ఐరావత మెటో పారిపోయెను.

**67.** సంసారబద్ధుడైన జీవుడు, తన ప్రజ్ఞ కలుషితము కాగా, సంసార జంజాటములో పడి దానితో పెనగులాడు చుండును. మహా మోహము అను తీగెలు వలవలె అల్లుకొనియుండగా, వానిలో కాళ్ళు చిక్కిపోవ, విడిపించు కొనలేక భయభ్రాంతులకులోనై దీనుడై పోవును. అట్లే గజరాజు భయంకరమైన మొసలిపట్టులో తన పాదముల ఎముకలు చిట్లిపోవుచుండగా విడిపించుకొనలేక దీనదశకు చేరుకొనెను.

**68, 69.** అయినను మహా శక్తిమంతుడు గనుక, గజేంద్రుడెంతో కాలము కూడ గట్టుకొని, రాత్రింబవళ్లు సంధ్యాకాలములు నిరంతరముగా మొసలితో పోరుచు వేయి సంవత్సరముల పాటు యుద్ధము కొనసాగించెను.

**70.** గజేంద్రు డిట్లు మహాశక్తితో ఎన్నో యేండ్లు మొసలితో పోరాడి పూర్తిగా నీరసించెను. అప్పుడు తన బలము, శత్రువు బలము ఆలోచించు కొనెను. మొసలిని గెలువ వలెనను తన కోరిక సాధ్యము కానిదనియు, దానికి తన బలము చాలదనియు నిశ్చయించుకొని దుఃఖపడెను. పూర్వజన్మలో తాను చేసిన పుణ్యమునకు ఫలితముగా తనలోని దివ్యలోకముల జ్ఞానము మొలకెత్తెను. అప్పుడత డిట్లు తలచెను.

**71.** "అయ్యో! ఈ మొసలిని నే నెట్లు జయింపగలను? నా కడ్డు పడుడని యెవ్వరిని పిలువవలెను? ఏ దేవతలను ప్రార్థింప వలెను? మహా బలిష్ఠమైన యీ మొసలిని గెలువగలవా రెవరున్నారు? అట్టివా రెవ్వరును లేనేలేరా? దిక్కుమాలిన నా మొర లాలింపగల పుణ్యాత్ములెవరైన నున్నచో వారికిదే మ్రొక్కుచున్నాను."

(తన శక్తిని మాత్రమే తాను నమ్ముకొని గజరాజు పోరాడెను. తన శక్తి చాలదని తెలిసినప్పుడు మాత్రమే ఎవరినైన శరణు కోరవలెనను సంకల్పము కలుగును. ఎందరో దేవతలున్నారు. వారిలో తనను రక్షించగలవా డెవడు? అను యోచన ప్రారంభమగును. తాను కట్టుకొన్న అహంకారపు పెంకునకు దెబ్బ తగులుట, ఏ దేవతనైన శరణు కోరవలె ననిపించుట సాధనలోని మొదటి మెట్టు. ఇట్లు ప్రారంభమైన అన్వేషణ దేవతల కందరికిని మూలమగు ఒకే దేవుని వద్దకు చేరి నిలబడుట క్రమ పరిణామము. అది విష్ణువు, శివుడు, దేవి యెవరైనను కావచ్చును. అక్కడి వరకు చేరినను పూర్తిగా నమ్మకము చిక్కదు. కలడో లేడో అను సంశయము వదలదు. ఆ స్థితిలో నుండగా - తన సమస్య తనకు తెలిసిన రీతిలో పరిష్కారమైనచో, ఆ ప్రజ్ఞ మరల పతనమై, అన్వేషణ మరల ప్రారంభము కావలసి వచ్చును.)

**72.** "మహారణ్యములలో అనేక గజయూథములకు నాయకుడనై, లెక్కకు మించిన ఆడు ఏనుగులు సేవించు చుండగా విరాజిల్లుచుంటిని. నా మదజల ధారలచే పుష్టిగా పెరిగిన చందన వృక్షముల నీడలలోను, పూలచెట్ల నీడలలోను హాయిగా నుండక, నీటిపై ఆశతో ఈ మార్గమున నేల వచ్చితిని? ఈశ్వరా! ఈ భయము తీరుట యెట్లో తెలియకున్నది గదా!"

('దానాంభస్సులు' అనగా ఏనుగుల మదజలము లనియు, దానము చేసినపుడు విడచిన జలము లనియు అర్థము లున్నవి. ఏనుగుల రాజు గనుక, మదజలము లను అర్థము సరిపోవును. ఈ గజరాజు, శాపము పొందిన ఇంద్రద్యుమ్నుడను మహారాజు, అత డెన్నో యజ్ఞములు చేసి, అసంఖ్యాక దానములు చేసినవాడు. ఆ కథ ముందు చెప్పబడును. ఆ జన్మలో అతడు మహాతపస్సు చేసిన విష్ణుభక్తుడు. ఇప్పు డాపదలో నున్నపుడు ఆ జన్మలో తాను చేసిన పుణ్యకార్యములు లీలగా గుర్తుకు వచ్చుట చాల సహజమైన విషయము. ఈ 'అభిజ్ఞ' లేక జ్ఞప్తి కూడ తెలిసీ తెలియక, లోపలి పొరలలో దాగియున్నది గనుక, ఈ రెండవ అర్థము తనకు కూడ పూర్తిగా తెలియకుండగనే శ్లేషార్థముగా దాగియున్నది.)

**73.** ఈ సృష్టి యంతయు ఒకే ఒక దేవుని వలన పుట్టుచున్నది. ప్రళయ కాలమున వానియందే లీనమైయుండి, మరల సృష్టికాలము వరకు వానియందే నిద్రించు చుండును. కనుక అన్ని సృష్టులకును పరమేశ్వరుడైనవా డొక్కడే! అతడే కారణముల కన్నింటికిని మూలకారణమైనవాడు. వానికి మొదలు, ఉండుట, అంతరించుట యనునవి లేవు. అతడు తనంతట తానే ఉండును గనుక, అన్నిటి యందును, అన్ని స్థితులలోను తానే వ్యాపించి యుండును. అట్టి ఒకేఒక్క ఈశ్వరుని నేను శరణు వేడుచున్నాను.

**74.** తనకు తానే మూలమైన ఆ పరమేశ్వరుడు ఒకమారు జగత్తులను సృష్టించి, మరల తనలోనికి లాగుకొను చుండును. సృష్టి యందును, లయము నందును తానే యున్నాడు. ఈ అన్నింటిలోని సారాంశమునకు సాక్షిగా తానే

నిలబడి యున్నాడు. లోపములు సృష్టిలో నుండవచ్చును గాని వానిలో నుండవు. అట్టి పరమేశ్వరుని నా ఆపద తొలగుటకై స్మరించు చున్నాను.

('ఆత్మమూలుడు' అనగా, తనకు తానే కారణమైనవాడు అని మాత్రమే అర్థము కాక, తనలోనున్న 'నేను' అను ప్రజ్ఞకు మూలమైనవాడుకూడ అతడే అని కూడ అర్థము. అహంకారపు పట్టు సడలిపోవుచున్న కొలదియు, తనలోని జీవాత్మ తత్త్వము స్ఫురించుట ప్రారంభమగును. నీటిబిందువులు సముద్రము లోని భాగములు. అట్లే తనలోని జీవాత్మ అనబడు ప్రజ్ఞాబిందువు ఏ మహా చైతన్యములోని భాగమో అను విషయము కూడ స్ఫురించుట ప్రారంభ మగును. ఈ వికాసములోని మొదటి స్థితులలో ఈ జ్ఞానము స్పష్టముగా నుండక, తెలిసీ తెలియనట్లుండును. తా నెప్పుడో విన్న భగవంతుని తత్త్వమునే స్తోత్రము చేయుచు, దానితో తనను అనుసంధానము చేసికొనుటయు అప్రయత్నముగనే ప్రారంభమగును. ఈ ప్రక్రియ యంతయు 'ఆత్మమూలున్' అను ప్రయోగము నందలి వ్యంజనా శక్తిచే పోతనగారు ప్రతిపాదించిరి.)

75. భూలోకము మొదలు పాతాళము వరకుగల అధోలోకములు, సత్య లోకము వరకుగల ఊర్ధ్వలోకములు ఈ సృష్టిలోని భాగములు. కాలగమన ములో ఆయా లోకములలోని జీవులు, ఆ లోకములు, ఆ లోకముల కధిపతులైన దేవతలు, చివరకు బ్రహ్మాదులు కూడ సృష్టి పరిణామక్రియలో అంతమై పోవుదురు. ఆ వెనుక నున్నది పెంజీకటి; అనగా దుర్భేద్యమైన చీకటి. అది మాయామయ మగు మూల ప్రకృతి. ఆ మూల ప్రకృతికి కూడ వెనుకగా ఒకే ఒక వెలుగు తనలో తాను వెలుగు చుండును. అట్టి జ్యోతి స్వరూపుడైన దేవుని నేను సేవింతును.

('లోకము' అనగా 'చూచుట యను లక్షణము గలది' అని మూలార్థము. ఏ లోకములో నైనను చూచుట యను లక్షణముతో బాటు, చూచువాడు, చూడ బడునది అను నంశములు (Phenomena) కూడ నుండును. ఈ మూడును కలసి యేర్పడిన త్రిభుజమే ఒక ఆవరణము నేర్పరచి, ఒక లోకమును రూపొందించును. ఆ త్రిభుజమునందలి కేంద్రబిందువు నందు లోకములు,

లోకస్థులు, లోకేశులైన దేవతలు లీనమగుదురు. అట్టి బిందువు ఒక లోకమునకు మూలము. అట్టి త్రిభుజములు, బిందువులు నిలబడి మాయమగుచుండు కాగితము వంటి నేపథ్యము (Background) మూలప్రకృతి యనబడును. చూచుట యను లక్షణము గల లోకములకు వెనుక నున్నది గనుక అది పెద్ద చీకటి. ఆ కాగితము కూడ ఏ చోటులో నుండునో అట్టి నేపథ్యమైన చోటువంటిది నారాయణుని తత్త్వము. కాగితము లెన్నియున్నను చోటు ఒక్కటే యుండును. అట్లే నారాయణుడు తనకు తాను ఒక్కడే యుండును.)

76. ఆ నారాయణుడు నర్తకునివలె ఎన్నో రూపములతో క్రీడించు చుండును. (రూపములే వేరుగాని, ఉన్నవా డొక్కడే! అది నేను అను ప్రజ్ఞ.) దేవతలుగాని, మునులు గాని వానిని కీర్తింపలేరు. అతని ప్రవర్తన మెప్పు డెట్లుండునో తెలియుట వారి కెవ్వరికిని సాధ్యము కాదు. అట్టి మహానుభావుని నేను స్తోత్రము చేయుచున్నాను.

(ఈ సృష్టి నిత్య నూతనమైనది. ఒక మనిషి వంటి మరియొక మనిషి సృష్టిలో నుండడు. వ్యక్తుల స్వభావములు కూడ నిత్య నూతనములుగా నుండును. ఇట్లు నిత్యనూతన స్వభావములు గల వ్యక్తుల మధ్య పుట్టుకొని వచ్చు సన్నివేశములు కూడ నిత్య నూతనములుగా, ఆశ్చర్యకరములుగా నుండును. ముందేమి జరుగనున్నదో తెలిసికొనుట ఋషులకైనను, దేవతలకై నను కొంతవరకే సాధ్యము.

ఇందు ఒక విశేషమున్నది. జగత్ప్రణాళికను ఎంతో కొంతవరకు తమకు అందినంత వరకు గ్రహించి, దాని ప్రకారము వర్తించువారు దేవతలు. వారికి సహకరించువారు ఋషులు. మరి ముందేమి జరుగనున్నదో వారికి తెలియ దనుట సత్యమా? అను ప్రశ్న రావచ్చును. జగత్ప్రణాళికను నిర్వహించునది కాలము. దానినే దైవము అందురు. దేవుడు వేరు. కాలము ప్రకృతిలోని భాగము. దానికి ప్రచోదకమైన పురుషుడు దేవుడు. వేర్వేరు జీవుల పరిణామక్రమము కాలము యొక్క నియంత్రణలో కొంతవరకు నడచును. తరువాతి స్థాయులలో జీవులకు పరిణామ గతులు కల్పించుట దేవుని యనుగ్రహము. ఈ అను

గ్రహము జీవునకు దేవునకు మాత్రమే సంబంధించి యుండునుగాని, దేవతలకు ఋషులకు సంబంధించినది కాదు. ఈ పద్యములో చెప్పబడినది ఇట్టి అనుగ్రహమే! కనుకనే 'వాని ప్రవర్తన మెట్లుండునో తెలియదు' అని మాత్రమే చెప్పబడినది.)

77. కోరికల జంజాటమును వదిలించుకొనిన ఋషులు కూడ ఆ నారాయణుని చూడవలెనని కోరుచుందురు. దానికై వారు సర్వజీవరాశుల హితమును కోరుచు, ప్రశాంతి చెందిన మనస్సు కలవారై జీవింతురు. ఈ వ్రతము సాటిలేనిది. దీక్షతో ఈ వ్రతమును నిర్వర్తించుచు నారాయణుని దివ్యపదమును సేవించు చుందురు. అట్టి నారాయణుడే నాకిప్పుడు దిక్కు!

(కోరికల యెడ అంటుకొని యుండుటను ఋషులు వదలించుకొన్నారు. అసలు కోరికలే లేకుండు స్థితి సృష్టిలోని జీవులకు దుస్సాధ్యము. కోరికలలో తగులుకొనకుండుట సాధ్యము. దానికి సాధన మార్గము ఈ పద్యమున చెప్పబడినది. అది 'దిదృక్ష'. అనగా చూడవలెనను కోరిక; దిదృక్ష కలవారు 'దిదృక్షులు'. ఈ చూచుట దేనిని? తామిప్పుడు చూచుచున్న స్థాయికన్న దివ్యమైన దానిని చూడవలెనని కోరుట సాధకుల లక్షణము. పైనున్న దివ్యకక్ష్యను చూడగోరిన వానికి క్రింది కక్ష్య యెడల ఆసక్తి లేక సంగము క్రమముగా సడలిపోవును. ఇట్లు కక్ష్యలను విడదీసి చూచుకొనువాడు యోగమును శాస్త్రముగా విశ్లేషించి, కష్టపడి సాధించుకొనును. నారాయణునకు సమర్పణ చెంది సాధన చేయువానికి ఈ స్థాయీ భేదములన్నియు క్రమముగా విప్పారు చుండును. క్రింది స్థాయిలో గల సంగములు తమంత తాముగా దోసపండు తొడిమ నుండి తనంత తాను విడిపోయినట్లు- విడిపోవును.

ఇట్టి వారిని ప్రపన్నులు అందురు. ఇట్టి వారికి ఒకే కోరిక యుండును. అది దేవుని చూడవలెనను కోరిక! ఈ కోరిక వలన మనస్సు భగవంతునితో నిండియుండును; అనగా తానే దేవుడుగా నుండును. ఈ కోరిక యిట్లే నిలబడి యుండుట యెట్లు? దేవుని చూడవలెనను కోరికతో లోకమును మరచినవాడు జీవులలోని దేవుని మరచిన వాడగును. కనుక సర్వజీవుల యెడల, సర్వభూత

ముల యెడల ప్రేమ కలిగియుండి వారి హితమును కోరుచుండవలెను. మనసులో కోరినంత మాత్రమున ఇతరులకు ప్రయోజన మేమున్నది? కనుక వారికేది క్షేమమో అట్టి సేవ నాచరింపవలెను. దీనివలన చిత్తము ప్రశాంతమై, సాధువుగా రూపొందును.

క్లుప్తముగా చెప్పవలెనన్నచో, సర్వజీవులకు హితము నాచరించు వానికి సాధుత్వము స్వభావముగా నేర్పడును. అట్టి సాధుచిత్తము గలవారికి భగవంతుని చూడవలెనను కోరిక స్థిరముగా నిలబడి యుండును. అట్టివారికి క్రింది లోకముల లోనికి మారుచుండుట దేవుని విలాసముగా, క్రీడగా జరుగు చుండగా, దేవుని చూడవలెనను కోరిక నిలబడి యుండును. ఆసక్తి విడిపోవును. ఒక కక్ష్యలో నుండి పై కక్ష్యలోనికి మారుచుండుట దేవుని అనుగ్రహముగా, క్రీడగా జరుగుచుండగా, దేవుని చూడవలెనను కోరిక నిలబడి యుండును. ఈ క్రమమంతయు ఈ చిన్నపద్యములో నిమిడి యున్నది.)

78. ఆ నారాయణునకు పుట్టుక, రూపము, కర్మ, దోషము, వంశము, గుణములు మొదలైనవి లేవు. అయినను ఈ జగత్తులను సృష్టించి లయించుట యను క్రీడకై, తన మాయాశక్తి చేత ఇట్టి లక్షణములు ధరించుచుండును. (వస్త్రము దేహముపై ధరింపబడు చున్నను, దానికి గల రంగు, నాణ్యత మొదలైనవి శరీరమునకు సంబంధించినవి కావు. ధరించిన వానికి సంబంధించినవి అసలే కావు. కాని ధరించిన వ్యక్తి దానిని చూచి సంతోషించును. మాయ ద్వారా రూపము, గుణములు మొదలైన వానిని ధరించుట యనగా నిట్లుండును.)

అతడు లోకేశ్వరుల కందరికిని ఈశ్వరుడు కనుక, ఉత్తముడైన ఈశ్వరుడు. సృష్టిలోగల అంతు తెలియని శక్తి అతడే. సృష్టికి కర్త యగు బ్రహ్మ అతడే. ఇట్టి అనేక కల్పముల బ్రహ్మలందరికి ఆధారమై పరబ్రహ్మము అనబడును. చక్కని రూపములు ధరించు చుండును గాని, అతనికి ప్రత్యేకమైన రూపము లేదు. అతడు చరించు మార్గము లన్నియు చిత్రములైనవి. సృష్టి యున్నప్పుడు-లేనప్పుడు, సృష్టికి లోపల-వెలుపల చూపు గలవాడై సాక్షిగా నున్నవాడు. తనయందు తానే ఆనందించుచు, తనయందు తానే వెలుగుగా నున్నవాడు.

సృష్టిలోని జీవులైన 'నేను' అనబడు ఆత్మ ప్రజ్ఞ లన్నిటికి ఆధారమై పరమాత్మ యనబడును. మాటలలో గాని, భావనచేత గాని, విజ్ఞానముచేత గాని వాని నందుకొనుట సాధ్యము కాదు. అతడు శుచి స్వరూపుడు; వానిని చేరుటకు సత్త్వగుణ మొక్కటే మార్గము. మానవుడు కర్మాచరణములో నిపుణుడై కూడ కర్మల నాచరింపని వాడైనచో అట్టి వానిని నారాయణుడు మెచ్చును. అట్టివానికి నేను నమస్కరింతును.

(కర్మాచరణములోని కౌశలమే యోగమని భగవద్గీత చెప్పును. కర్మాచరణ ములో కర్మరాహిత్యమును, కర్మను వదలివేయుటలోని కర్మను చూడగలిగిన వాడు నిజమైన చూపుగలవాడని కూడ భగవద్గీత చెప్పును. ఆ కర్మాచరణములో తనకు సంకల్పముగాని, కోరిక గాని, కారణముగాని లేనప్పుడు కర్మరాహిత్య మనబడును. ఇట్లు కర్మాచరణములో కర్మరాహిత్యమును సాధించుటయే నిజమైన ఆధ్యాత్మిక సాధన. నారాయణుడు దీనినే మెచ్చును.)

**79.** ఆ నారాయణుడు శాంతుడు. మోక్షమను స్థితికి అధిపతియై, అందలి సౌఖ్యమును జీవులకు గుర్తుచేయువా డతడే. అతడు కాని దేమియు సృష్టిలో లేదు. కనుక భయంకరత్వము కూడ అతని లక్షణమే! (ఇప్పుడు తనను పట్టిన మొసలి యొక్క భయంకరత్వము కూడ నారాయణుని లక్షణమే!) దేనియందైన నను మూల ధర్మముగా అతడే రహస్యముగా దాగియుండును. అతడు గుణములు, ధర్మములు కలవాడు. (సృష్టిలో శాశ్వతముగా ధర్మము లుండును. వానిని మానవు లాచరించినప్పుడు అవియే గుణము లనబడును. సృష్టిలోని జీవుల ప్రవర్తనలు గాను, సృష్టికి అతీతమైన ధర్మములుగాను నారాయణుడే యున్నాడు.)

ఆ నారాయణుడు ఆహ్లాదము కలిగించువాడు, అధిక విజ్ఞానమయుడు. (మనకు తెలిసిన విజ్ఞానము కన్న ఎక్కువ విజ్ఞానమయుడు. అట్టడుగు స్థితిలోని మానవుని నుండి బ్రహ్మర్షుల వరకు ఎవ్వరికైనను తనకు తెలిసిన విజ్ఞానము కన్న కొంత పైనున్న వాడు నారాయణుడు. అసలు అందుబాటులో ఉండకపోవుట

వాని లక్షణము కాదు. ఎవడెంత ఎత్తు ఎదిగినను వానికి కొంతపైగా, అందీ అందనట్లు నారాయణు డుండును. ఇది నారాయణుని దివ్యలక్షణము.)

అన్ని యింద్రియముల ద్వారా చూచువాడు, అన్ని ఇంద్రియములను చూచువాడు కూడ అతడే! కనుక అన్నిటికి పైనుండి చూచు అధ్యక్షు డతడు. అన్ని లోకముల నెరిగిన క్షేత్రజ్ఞుడు. వాని బుద్ధి దయా సముద్రము. మూల ప్రకృతిగా నున్నవాడు, తనకు తానే కారణమైనవాడు. అంతేగాక జీవులలోనున్న 'నేను' అను ప్రజ్ఞకు, నా యందున్న ఆత్మకు కూడ కారణమైన ఆధార మతడే! జితేంద్రియుడైన వానికి జ్ఞానమిచ్చి దుఃఖముల నంతము చేయును. (ఇంద్రియ ములపై అదుపులేని వానికి జ్ఞానము కలిగినచో ఉపయోగము లేకుండుటే గాక, విపత్కరము కూడ అగును. అట్లని జితేంద్రియుడైనంత మాత్రమున దుఃఖము అంతరించదు. స్వంత అభిప్రాయ మను బంధము నుండి విడవడలేని వాడు ఎంత జితేంద్రియుడైనను దుఃఖమే అనుభవించును. జితేంద్రియుడై రాజర్షియగు భీష్ముడే దీని కుదాహరణము. అట్టివారు తమ యభిప్రాయములకు బదులుగా నారాయణుని ప్రతిష్ఠించుకొన్నచో దుఃఖము అంతరించును.)

శాశ్వత సత్యముగా నున్న తాను ఒంటరిగా ప్రకాశించు చున్నను, అసత్యమను నీడను కూడ నైపుణ్యముతో ధరించు చుండును. అతడు మహోత్తముడు. అన్ని సృష్టులకును తాను కారణమై యుండి కూడ, వాని యందు తన కోరిక యను కారణము లేనివాడు. అత డుండుటకు వేరుగా కారణ మక్కరలేదు. అట్టి నారాయణుడు నన్ను రక్షింపవలెనని ప్రార్థించు చున్నాను. (నారాయణు డొక్కడే సత్యము. తనకన్న వేరు అనుభవమే మాయ; లేక అసత్యము. కాని అది లేనిది సృష్టియే లేదు! అట్లే మానవునిలో జీవప్రజ్ఞ సత్యము. అహంకారము నుండి దేహము వరకు అన్నియు అసత్యము లేక మాయ. ఇట్లు అసత్యమును తన నీడవలె ధరించికూడ, తాను సత్యముగా నిలబడి యుండుటకు ఎంతో నైపుణ్యము కావలయును.)

**80.** యోగ మను అగ్నిలో తమ కర్మ సంకల్పములను దగ్ధము చేసికొన్న యోగీశ్వరులు (వాని యనుగ్రహముచే) చక్కని యోగముచే ప్రకాశించుచున్న

బుద్ధితో పరమేశ్వరుడైన నారాయణుని దర్శింప గలుగుదురు. అట్టివానికి నమస్కరింతును.

81. సకల నదీనదములలోని జలములన్నియు సముద్రములో ప్రవేశించి నచో తమ ప్రత్యేకమైన అస్తిత్వము కోల్పోవును. అట్లే నారాయణుడు సర్వ వేద శాస్త్రములు అను జలములకు సముద్రము వంటివాడు. అతడే మోక్షస్వరూపుడు. సృష్టిలో నున్న ఉత్తమ గుణములన్నియు కలసి అతని నివాసస్థాన మగుచున్నవి. సృష్టిలో నున్న గుణము లన్నియు అరణికాగా, అందు జ్ఞానాగ్నిగా దాగియున్న వాడు నారాయణుడు. అతడు తనయంతట తానుగా ప్రకాశించుచు ధన్యమైన బుద్ధి గలవాడు. గుణము లన్నియు తనయందు లయమై, తన మనస్సుగా ప్రకాశించు చున్నవాడు. సృష్టిలో జరుగుచున్న కర్మ లన్నియు చేయువా డాతడే! దిక్కులేని నాబోటి జంతువుల పాపములు కూడ పోగొట్టువాడు. సకల సృష్టి యందును 'నేను' అను ప్రజ్ఞగా నున్నవాడు; కనుక ఆ ప్రజ్ఞకు చెదరిపోవుట యుండదు. అతడు భగవంతుడు. అనగా సృష్టిలోని చైతన్యమను వెలుగు, సృష్టి నడచుట యను గమనము తానే యైనవాడు. దారాపుత్రాదులు, చక్కని సంపదలు, నివాసము మొదలగు వానియందు తగులుకొనియున్న వానికి ఆత డందడు. (వారిని కూడ నారాయణునిగా చూచిన వారికి అత డందును.) అట్టి వానికి నమస్కరింతును.

(1. అరణి యనగా, మథనము ద్వారా అగ్నిని పుట్టించుటకు వినియోగించు రెండు కొయ్య వస్తువులు. క్రింది అరణిలో నున్న రంధ్రములో పొడవుగా నుండు పై అరణిని దూర్చి మథించినచో నిప్పు పుట్టును. చోటులో అంతర్లీనముగా నుండు అగ్ని, భౌతికమైన అగ్నిగా వెలువడుటకు అరణి నిమిత్తమైన కారణముగా నుపయోగ పడును. ఈ అరణిని యజ్ఞములలో వినియోగింతురు. సృష్టి యజ్ఞమునకు ప్రతిబింబముగా యజ్ఞములు నిర్వర్తింపబడును గనుక, ఈ అరణిని కూడ నొక ప్రతీక (Symbol) గా వినియోగింతురు. భౌతికమైన ఘర్షణము వలన భౌతికమైన అగ్ని పుట్టును. సృష్టిలోని గుణముల సంఘర్షణ ముల వలన జ్ఞానమను అగ్ని పుట్టును. సృష్టిలోను, మానవునిలోను 7 స్థాయులలో

నిట్టి యగ్ని పుట్టుచుండును. తనలోనే దాగియున్న జ్ఞానాగ్ని వెలువడుటకు గుణముల సంఘర్షణము నిమిత్తమాత్రము. కాని గుణముల సంఘర్షణము లేనిదే జ్ఞానాగ్ని పుట్టుట సాధ్యము కాదు.

ఇందు మరియొక సూక్ష్మమున్నది. అరణిని మథించునప్పుడు అగ్ని పుట్టును; దానితోబాటు అరణి కాలిపోవును. క్రింది స్థాయి గుణములు సంఘర్షణ చెందినప్పుడు జ్ఞానమను అగ్ని పుట్టును. దానితోబాటు క్రింది స్థాయి గుణములు దగ్ధమగును. సృష్టిలో గుణములు మాత్రమే యుండును. చూచువానికి మాత్రము సద్గుణములు-అసద్గుణములు అను విభాగము కనబడును. ఇది దృష్టి దోషము. "మన మెరిగిన సత్యము, మన మెరిగిన అసత్యము కలసియే సత్య" మని వేదము చెప్పును. గుణముల సంఘర్షణ వలన జ్ఞానాగ్ని పుట్టుట యనగా, ~~ఈ~~ దృష్టిదోషము తొలగుటయే గాని గుణాగుణములు అంతరించుట కాదు. దృష్టిలోని దోషము తొలగినచో గుణములకు, అవగుణములకు కూడ సృష్టిలో సముచితమైన స్థాన మున్నదని తెలియును.

ఒక స్థాయిలో సత్యముగా గ్రహింపబడినది, పై స్థాయి దృష్టిలో అసత్యముగా గోచరించును. అప్పుడు మరల ఇట్టి ప్రక్రియయే జరుగుటయు, ఇంకను పై స్థాయిలోని సత్యము దర్శన మిచ్చుటయు జరుగును.

అన్ని జీవరాశులలోను 'నే నున్నాను' అను ప్రజ్ఞ దివ్యము. అది తనయందు మాత్రమే జ్ఞప్తియం దున్నపుడు అహంకారముగా పలుకు గట్టి (Precipitated) వేరుపడును. అందరిలోను గల అదే ప్రజ్ఞయందు తన ప్రజ్ఞ కరగిపోయి నిలబడినపుడు 'నేను' అను మహాసముద్రము మాత్రమే యుండును. దానికి చెదరిపోవుట యుండదు. కెరటములు చెదరిపోవుచుండును గాని సముద్రము చెదరిపోవుట యుండదు.)

**82, 83.** ధర్మార్థ కామములు లౌకిక జీవనమున శ్రేష్ఠమైనవే! కాని వాని యెడల కోరిక విసర్జించినవారు జ్ఞానులై నారాయణుని సేవించి తమ యిష్టగతిని పొందుదురు. తనను కోరినవారికి తరిగిపోవని దివ్యదేహములను ప్రసాదించు కరుణామయు డాతడు. మోక్షము పొందిన జీవులు వానినే దృష్టియం దుంచుకొని

ధ్యానము చేయుదురు. (అట్లు ధ్యానము చేయుచున్నంత కాలమే ముక్తాత్ములుగా నిలబడి యుందురు.) ఆ పరమేశ్వరుడు ఆనంద స్వరూపుడు. ఆ ఆనంద సముద్రములో మునిగియున్నవారు భౌతిక దేహములో లౌకిక జీవితములో నున్నను ఏకాంతులుగా నుండగలరు. అట్టి ఏకాంతస్థితిలో వారు ఇతరులను దేనికొరకు అర్థించకుండ, నారాయణుని దివ్య చరిత్రములు పాడుకొను చుందురు.

అతడు మహేశ్వరుడు. ఏ స్థితికైనను, ఏ సృష్టికైనను అతడే మొదలు. లోకములు పుట్టక ముందునుండి యున్నవాడు గనుక, జీవులకు అవ్యక్తుడుగా నుండును. వానిని చేరవలె నన్నచో తనను తాను తెలిసికొను యోగ మొక్కటే మార్గము. అతడు పరిపూర్ణుడు గనుక, అన్నిటికన్న పైనున్నవాడు. బ్రహ్మ లందరిని సృష్టించు పరబ్రహ్మమైన వాడు. ఇంద్రియములతో ప్రయత్నించు వారికి అత డందడు. స్థూలమైన పదార్థముగాను, సూక్ష్మమైన తత్త్వముగాను తానే యుండి, ఈ మొత్తమునకు ఈశ్వరుడైన వానికి నమస్కరింతును.

(జ్ఞాని యైనవాడు విష్ణువును సేవించి యిష్టగతిని పొందునని చెప్పబడినది. ప్రతి వ్యక్తికి తనకు ఇష్టమైన స్థితి ఒకటి యుండును. తనలోను, ఇతరులలోను వ్యాపించియున్న విష్ణువును సేవించువాడు నైపుణ్యముతో వ్యవహరించి తాను ఇష్టపడిన స్థితిని చేరగలడు. నిరంతరము విష్ణువునే సేవించుట వలన, 'తన యిష్టము'లోని గుణ దోషములు తనకే తెలియును. కనుక అంతకుముందు కన్న తెలిసిన వాడగును. ఇప్పుడతని యిష్టము మరింత ఉత్తమముగా నుండును. ఇట్లు నిరంతరము తనలోను, ఇతరులలోను గల విష్ణువును సేవించు చుండుట వలన తన యిష్టగతియొక్క స్థాయి అంతకంతకు ఉత్తమోత్తమముగా రూపొందు చుండును.

ఇట్లు కొన్ని స్థితులు దాటిన తరువాత, 'తన యిష్టము' అనునది మెల్లగా జారిపోయి, ఇతరుల కిష్టమైన స్థాయిలో తానుండుట సాధ్యపడును. అప్పటి కతడు జగత్ కల్యాణము మాత్రమే ఆచరించు చుండును. జగద్ధితమైన కర్మ తన ద్వారా జరిగిపోవు చుండుటయు, తాను ఏ స్థితిలో నున్నను అదియే తన

కిష్టమైన స్థితిగా నుండుటయు జరుగును. ఏసుప్రభువును శిలువ వేయు చున్నప్పుడు ఆ స్థితియే ఆయన కిష్టమయ్యెను! తనకు ప్రత్యేకమైన ఇష్టస్థితి లేకుండ జారిపోవుటయే అసలైన యిష్టస్థితి యగును.)

**84, 85.** అగ్నిదేవుడు జ్వాలలను, సూర్యుడు తేజస్సును వెలువరించును. మరల తమలో లీనము చేసికొందురు. అట్లే నారాయణుడు 'తాను' అను ప్రజ్ఞామయ కిరణముల ద్వారా బ్రహ్మ మొదలుగా గల దేవతలను, అఖిల జగత్తులను, సమస్త జీవరాశులను, నామము, రూపము, పరిమాణము అను భేదములతో సృష్టించి ప్రకాశింపజేసి, మరల తనలో లీనము చేసికొనును.

('తాను' అను ప్రజ్ఞామయ కిరణముల ద్వారా జీవులను దేవుడు సృష్టించు చున్నాడు. కనుక జీవులలో 'నేను' అను ప్రజ్ఞ నిలబడి యున్నది. అది వేరుగా నున్నప్పుడు అహంకారముగా బిగిసిపోవును. కరగినప్పుడు ప్రజ్ఞామయ మగును.)

జీవుల మనస్సు, బుద్ధి, ఇంద్రియములుగా తానే యుండి, వాని వాని గుణములు చక్కగా ప్రవహించునట్లు జీవవ్యాపారములు నడుపుచుండును. స్త్రీ, పురుష, నపుంసక భేదములు, జంతు, మానవ, దేవాది భేదములు, గుణ కర్మ భేదములు, ఉండుట-లేకుండుట యను భేదములు వానికి లేవు. ఈ అన్నింటికిని వెనుక నేపథ్యముగా తానుండి, అన్నియు తానై యున్నాడు. (అవయవములు మానవుని యందున్నవి గాని ఏ ఒక్క అవయవము మానవుడు కాడు.) అట్టి ప్రభువునకు నమస్కరించు చున్నాను.

**86.** దీనులైన వారికి రక్షగా అతడున్నా డందురు. పరమ యోగి గణముల పక్షమున అతడుండునని చెప్పుదురు. అన్ని దిక్కుల యందు అతడున్నాడని పెద్ద లందురు. ఉన్నాడు-ఉన్నాడని యీ చెప్పబడిన దేవుడున్నాడో లేడో?

(ఈ సంశయములో తన ప్రయత్నము తాను చేసికొన్నంత కాలము దేవుడు రక్షింపడు. నిశ్చయముగా ఉన్నాడని నమ్మి, తనకు శక్తి లేదని నమ్మి తన ప్రయత్నమును విసర్జించినపుడు దేవుడు ప్రసన్నుడగును.)

(ఈ గజేంద్రుని స్తోత్రములో ఒక విశేష మున్నది. తనకు కలిగిన కష్టమును

తప్పించుమని దేవుని ప్రార్థించుట లౌకికుల పద్ధతి. దీనివలన తన కష్టమునే దైవభక్తితో స్మరించుట జరుగును. ఆ తరువాతి స్థితిలో భగవంతుడే ముఖ్యముగా స్మరింపబడుటయు, మధ్య మధ్య తన స్థితి స్మరింపబడుటయు జరుగును. **తన కష్టము గుర్తుండక, దేవుడు మాత్రమే గుర్తున్నచో దేవుడు తనను రక్షించును.** ఇట్టి స్తోత్రములో కూడ అప్పుడప్పుడు తన కష్టము గుర్తుకు వచ్చుచుండును. అప్పుడే కలడో - లేడో అను సంశయము కలుగును. చివరకు ఉన్నాడని పూర్తిగా నమ్మకము చిక్కిన తరువాత దేవునితోనే సూటిగా విన్నవించుకొనుట జరుగును.

కనుకనే గజేంద్రుని స్తోత్రములో చాలవరకు దేవుని 'అతడు' అని ప్రథమ పురుషలో పేర్కొనుటయు, చిట్టచివర మాత్రమే నేరుగా మధ్యమ పురుషలో 'నీవు' అని సంబోధించుటయు గమనింప వచ్చును.)

**87.** ఆ విష్ణువు ఉండుట - లేకుండుట అను పర్యాయ భేదములు లేక శాశ్వతముగా నుండును. అట్టివాడు నా పక్షమున నుండునా- అను సందేహము కలుగుచున్నది. అతడు నా పక్షమున నుండకపోవునా? దుష్టుల చేతిలో బాధపడు చున్న సజ్జనులను రక్షించువాడు, అట్టి స్థితిలోనే ఉన్న నన్ను రక్షింపరాడా! మానవులు మామూలు చూపులతో నెంతకాలము చూచినను అతడు కనిపించడు. చూపులను దాటిన అంతర్దృష్టితో తనను చూచువారిని విష్ణువు దయతో చూచును. అట్టివాడు నా యవస్థ చూచుట లేదా? ఆపన్నుల మొర లాలించినచో తనను తాను మరచిపోవు నారాయణుడు నా మొర యాలకింపడా? సృష్టిలో నున్న అన్ని రూపములు అతనివే! కనుక ఒక రూపమునకుండు పుట్టుట, పెరుగుట, చచ్చుట అను భేదము లతనికి లేవు. భక్తజనులను, దీనులను రక్షించుటకు వారి పక్షము వహించును. అట్టివాడు నా మొర యాలకింపడా? నా దీనస్థితి చూడడా? నన్ను తలచి వేగముగా రాకుండునా?

**88.** ఈ జగత్తులను సృష్టించి, తానే జగత్తుల యొక్క రూపముగా నున్న వాడును, విశ్వమునందున్న అఖండమైన ఆత్మ ప్రజ్ఞయు నతడే. ఐనను ఈ విశ్వమున కతీతుడుగా అతడున్నాడు. కనుక ఈ విశ్వము నంతటిని అత డెరుగును. ఈ విశ్వముగా నున్నవాడు, విశ్వముగా లేనివాడు కూడ అతడే!

సృష్టి లీనమైనప్పుడు కూడ, ఆ లీనమగుటగా అత డున్నాడు. కనుక వేరుగా పుట్టుట లేని శాశ్వతు డతడు. బ్రహ్మకు కూడ అధిపతియైన ఈశ్వరు డతడు. అట్టి పరమపురుషుని నేను సేవింతును.

**89.** ఇట్లు తలచిన గజేంద్రుడు తన మనస్సులో ఈశ్వరుని సన్నిధానము కల్పించుకొని, తనలో హరిని దర్శించుచు ఇట్లు స్తుతించెను.

(పైన చెప్పుకొన్నట్లు తన బలమును నమ్ముకొన్నచో రక్షణ లేదని గజేంద్రుడు గ్రహించెను. కాని కలడో లేడో యను సందేహ మింతవరకు వదలలేదు. అంతవరకు తాను వేరుగా నుండి, దేవుని వేరుగా ధ్యానము చేయుచుండెను. కనుకనే 'అతడు' అని ప్రథమ పురుషలో స్తోత్రము సాగెను. ఇట్టి ధ్యానములో ఒక రహస్యమున్నది. మానవునికన్న చాల శక్తిమంతమైన జీవకేంద్రము దేవుడు. అట్టి దేవుడు తనకన్న వేరుగా నున్నాడని గట్టిగా ధ్యానించినచో తనలో నుండి జీవశక్తులు బయటికి పోవుటకే ఎక్కువ అవకాశ మున్నది. అంతేగాని తనకు రక్షణ కలుగు నవకాశము తక్కువ.

కనుక తన హృదయములో దేవుడున్నాడని ధ్యానించుట గాని, దేవుని హృదయ గర్భములో తా నున్నానని ధ్యానించుటగాని ఉత్తమ మార్గము. పూర్వజన్మలోని తన సాధన, శాపరూపమైన గురువు అనుగ్రహము, ఇప్పటి తన కష్టము యొక్క తీవ్రత- వీని కారణముగా గజేంద్రునకు ఈ మార్గము తనకు తెలియకుండగనే స్ఫురించెను. కనుక అతడు దేవునకు తన హృదయములో సన్నిధానము కల్పించుకొనెను. ఇప్పుడతడు వేరుగా లేడు; తనలోనే యున్నాడు. కనుక ఇప్పటివరకు 'అతడు' అని వేరుగా వ్యవహరించిన దేవునితో 'నీవు' అని సూటిగానే సంబోధింపసాగెను. పై జెప్పిన సత్యము తనంత తానే స్ఫురించుట ఒక ముఖ్యమైన మెట్టు; అది దేవుని యనుగ్రహమే!)

**90.** "ఈశ్వరా! నాలో నింక యేమాత్రము శక్తి మిగులలేదు. ధైర్యము తల్లక్రిందులైనది. ప్రాణములు గూడుతప్పి యల్లాడు చున్నవి. శరీరము డస్సి పోయినది. ఈ స్థితిని తట్టుకొనుటకు చాల శ్రమ కలుగుచున్నది. స్పృహ తప్పిపోవు చున్నట్లున్నది. నీవు తప్ప మరియొక దిక్కు తెలియని వాడను. ఈ

దీనుడు చేసిన యపరాధములను మన్నించి నన్ను రక్షింపరావా? కోరినవారికి కోరిన వరము లిచ్చువాడవు. రక్షించుట యను లక్షణమే నీ యాత్మగా నున్న వాడవు. నన్ను రక్షింపుము.

(శరీరముపై నున్న ప్రజ్ఞయొక్క పట్టు సడలిపోయినపుడు మూర్ఛవంటి స్థితి కలుగును. ఇది భౌతికమైన మూర్ఛగాక, ఈశ్వర సన్నిధానము వలన కలిగిన మూర్ఛ యైనపుడు దానిని అతీత స్థితి (Transcendence) అందురు.)

**91.** "నీవు లక్ష్మీదేవికి ప్రియుడవు. వరముల నిచ్చువాడవు. నీ దృష్టిలో శత్రువులుగాని, నీ పక్షము కానివారు గాని ఉండరు. మహాకవులు, యోగులు నిన్ను దర్శింతురు. సృష్టిలోని ఉత్తమ గుణములన్నియు నీ వద్దనే యున్నవి. నిన్ను శరణుజొచ్చిన వారికి కల్పవృక్షమువంటి వాడవు. నీ యీ లక్షణమే మునీశ్వరులకు మనోహరముగా నుండును. నీ ప్రభావము చాల విశాలమైనది. కుయ్యో! అని నిన్ను శరణు వేడుచున్నాను. నన్ను స్మరించి, కరుణించి వెంటనే వచ్చి రక్షింపవా!"

**92, 93.** గజేంద్రుడిట్లు స్తోత్రము చేసి, యిక ఆపన్న రక్షకుడైన విష్ణువే తనను రక్షించుగాక! - అని తొండమునెత్తి యాకాశములోనికి నిగిడించి, నిట్టూర్పులు విడచుచు, ఆర్తనాదము చేయుచు నిలబడి పోయెను. చోటులో నుండి ఏదైన వినవచ్చు నేమో యని ఆలకించు చుండెను.

('బయలు ఆలకింపుచు' అని పోతనగారు వ్రాసిరి. ఆకాశములో నుండి విష్ణువు వచ్చుచున్న అలికిడి వినిపించు చున్నదేమో అని ఆలకించు చున్నాడని సామాన్యమైన అర్థము. చోటు సర్వ వ్యాపకత్వ మను లక్షణము కలది. మనలో ఉన్న దివ్యప్రజ్ఞ హృదయములో నున్న చోటులో దాగియున్నది. దివ్యప్రజ్ఞతో మన కనుసంధానము కావలె నన్నచో చోటు (Space) నే వాహిక (Medium)గా మలచుకొనవలెను. మన హృదయములో నున్న చోటులో ప్రజ్ఞ నిలబడినచో, చోటును వాహికగా స్వీకరించుట సాధ్యపడును. అప్పుడు మన చిత్తశుద్ధి ననుసరించి, అంతవరకూ సాధించిన జీవ పరిపాకమును బట్టి, భగవంతుని యనుగ్రహము ఆయా స్థాయులలో లభించును. భగవంతుని యనుగ్రహము

మన మెరిగిన సూత్రముల పడికట్టులో ఇముడదు. అది సత్యమేగాని, దాని కొక పద్ధతి యుండదనుట సత్యము కాదు. పూర్వజన్మమున మహా తపః సంపన్నుడై భక్తుడైన గజేంద్రుడు ఆపత్సమయములో చోటులో ప్రజ్ఞను నిలబెట్టి దానినే వాహికగా చేసికొనగలిగెను. వెనువెంటనే అతని ఆర్తనాదము దేవలోకము ద్వారా విష్ణువుకు అందెను.)

(ఇంతకు ముందు తన మనస్సులో దేవునకు సన్నిధానము కల్పించు కొనెననియు, అది సాధనలో ఒక ముఖ్యమైన మెట్టు అనియు చెప్పుకొంటిమి. ఆ తరువాత సాధన యెట్లు సాధ్యమగునో ఇందు చెప్పబడినది. తన మనస్సులో దేవునకు సన్నిధానము కల్పించుకొనగానే, మనస్సు మనస్సుగా నుండక, 'తాను' అను ప్రజ్ఞగా మారెను. తరువాతి స్థితిలో చోటులో తన ప్రజ్ఞ నిలబడుటయు, ఆ చోటునే వాహికగా చేసికొని విష్ణువుకు మొరపెట్టుకొను చుండెను.

అంతవరకు దేవునకు తన కబురు చేరవేయు వాహిక (Medium of communication) ఏర్పడలేదు గనుక, దేవునికి గజేంద్రుని పిలుపు వినబడలేదు. ఇప్పుడు వినబడినది. వెంటనే విష్ణువు ఉన్నవాడు ఉన్నట్లుగా లేచి నిలబడెను. అతడు 'గగనంబున కుద్గమించి' ప్రయాణించెనని 97-వ పద్యములో చెప్పబడినది. భూత సృష్టిలోని ఒక భాగము ఆకాశము. పంచభూతములలోని ఒక స్థితి ఆకాశము. ఈ సృష్టి కతీతముగా, చాలా లోకములకు పైగా నున్నది వైకుంఠము. అనగా వైకుంఠములో ఆకాశముండదు. ఈ యంశమును, పైన చెప్పుకొన్న విషయమును గుర్తుంచుకొన్నచో, 'గగనంబున కుద్గమించి' విష్ణువు ప్రయాణమైనా డనుటలోని రహస్యము తెలియును. గజేంద్రు డే వాహికద్వారా మొరపెట్టుకొనెనో, ఆ వాహికలోనికి విష్ణువు దిగివచ్చి, భక్తుని రక్షించుటకు పరుగిడి వచ్చెను. దేవుని 'ఫ్రీక్వెన్సీ'లో భక్తుడు పిలచుటయు, ఆ 'ఫ్రీక్వెన్సీ'లో దేవుడు ప్రతిస్పందించుటయు జరిగెను. ఈ 'ఫ్రీక్వెన్సీ' కలియుట దేవుని యనుగ్రహమే!)

**94**. బ్రహ్మాది దేవత లందరును విశ్వములో నున్నవారే గాని, ఎవరి పరిధులు వారి కున్నవి. తమ పరిధులను వారు దాటిపోలేదు. కనుక గజరాజు

ఆర్తనాదము విన్నను రక్షింపలేక ఊరకుండిరి. మొత్తము విశ్వముగా, దాని యధిపతిగా వ్యాపించి యున్నవాడు గనుక, విష్ణువు భక్తున కడ్డపడ దలచెను. జయించుటే తన స్వభావముగా గలవాడు గనుక (తన భక్తుని గెలిపించుట) అతనికి కష్టము కాదు.

(బ్రహ్మాది దేవతలు చేతకాని వారని యర్థము కాదు. తమ లోకములకు మాత్రమే తాము అధిపతులు గనుక ప్రకృతిలో తమ పరిధులను దాటిపోలేరు. ఇంతకును మొసలి చేసిన నేరమేమి? దాని నేల శిక్షింపవలెను? మొసలి నివాసము లోనికి ఏనుగు చొరబడి అల్లకల్లోలము చేసెను. మొసలి దానికి ప్రతీకారము తీర్చుకొన యత్నించెను. మొసలి ఏనుగును ఆహారముగా తినివేసినను అది ప్రకృతి విరుద్ధము కాదు గదా! దీనికి వ్యతిరేకముగా పరిమితాధికారములు గల బ్రహ్మాదు లెట్లు ప్రవర్తింప గలరు. గజేంద్రుడు విష్ణువునకు శరణాగతుడు గనుక, అతనికి వినబడునట్లు పిలువ గలిగెను గనుక, అతడు తన విశేషాధికారము నుపయోగించి గజేంద్రుని రక్షించెను.)

**95.** ఎక్కడో వైకుంఠపురములోని అంతఃపురములో, ఏకాంత గృహము వెనుక, మందార వృక్షముల వన మొకటి యున్నది. (మందార మనగా కల్ప వృక్షములలో నొకటి.) ఆ వనము మధ్యలో, అమృతసరస్సు ప్రక్కన, చంద్రకాంత శిలలతో నిర్మింపబడిన పర్యంకమున్నది. ఒత్తుగా కలువపూవులు పరువబడి యున్న ఆ పర్యంకముపై విష్ణువు శ్రీదేవితో నేకాంత గోష్ఠిలో నుండెను. అయినను అత డాపన్నులను రక్షించువాడు గనుక, గజేంద్రుడు 'రక్షింపు' మని చేసిన ఆర్తనాదము విని, వెంటనే లేచి నిలబడెను.

**96.** తా నెటు పోవుచున్నాడో లక్ష్మీదేవికి మాట మాత్రమైనను చెప్పలేదు. చేతులలో శంఖచక్రములు ధరింపలేదు. తనవెంట పరిజనులను రమ్మని పిలువలేదు. దూర ప్రయాణమని గరుత్మంతునైన సిద్ధము కమ్మనలేదు. చెవులవరకు వ్రేలాడుచున్న ముంగురుల పాయలనైన సరిజేసికొనలేదు. ప్రణయ కలహములో చేజిక్కించుకొన్న లక్ష్మీదేవి వక్షోజములపైని పైటకొంగునైన విడువ

వలెనని ఆయనకు స్ఫురింపనే లేదు. గజేంద్రుని ప్రాణమును రక్షింపవలెనను తొందరలో ఆయనకే విషయము లేవియు గుర్తుకు రాలేదు.

(ఆంధ్ర దేశములో ఒక కథ ప్రచారములో నున్నది. ఏ పరికరములు లేకుండగనే గజేంద్రుని రక్షించుటకు విష్ణువెట్లు బయలుదేరెనని శ్రీనాథుడు తన బావమరదియగు పోతనను అధిక్షేపించెనట. ఆ మరునాడు శ్రీనాథుని బిడ్డడు నూతిలో పడెనని పోతన కుమారుడు కేకలు పెట్టగా శ్రీనాథుడు కంగారుగా వట్టిచేతులతో నూతివద్దకు పరిగెత్తి నూతిచుట్టును గంతులు పెట్టుచుండెనట! అప్పుడు పోతన నవ్వుచు, "ఏమండీ బావగారు! బిడ్డ నూతిలో పడినప్పుడు నూతిలో దిగుటకు కావలసిన మోకులు, పగ్గములు మొదలైన పరికరములు లేకుండ పరుగెత్తి వచ్చితిరేమి?" అని పరాచకమాడి, "కన్నబిడ్డ ఆపదలో నున్నాడనగానే తల్లిదండ్రులకు ఒళ్ళు తెలియదు. ఈ జగత్తులకు తండ్రియగు నారాయణుడు తన బిడ్డ ఆపదలో నున్నాడనగానే ఒళ్లు తెలియక పరుగెత్తుటలో నాశ్చర్యమేమి?" అని ప్రశ్నించెనట! ఈ కట్టు కథకు కాళ్ళు చేతులు లేవు. కాని హృదయమున్నది. పోతనామాత్యుడు శ్రీనాథుని బావమరిది కానేకాడు. కాని విష్ణువు కరుణామయత్వమును, ఆర్తరక్షణ శీలమును వివరించు ఈ కథ చాలా సార్థకమైనది.)

**97.** భక్తజనులను రక్షించుటలో తనను తాను మరచిపోవు వాడును, సకల జీవుల హృదయ పద్మములలో నిల్లు కట్టుకొని యున్నవాడును అయిన నారాయణుడు గజేంద్రుని ఆర్తనాదముల నాలకించి సంభ్రమముతో లేచి నిలబడెను. లక్ష్మీదేవితో సల్లాపముల యెడ ఆయన కాసక్తి పోయెను. దిక్కులు చూచి, గజేంద్రుని రక్షింప వలెనను సంకల్పమును మనస్సులో నిలుపుకొని ఒక్కసారిగా ఆకాశములోని కెగిరి త్రికూట పర్వతము వైపునకు ప్రయాణించెను.

(ఈ వర్ణన లేవియు సంస్కృత మూలమున లేవు. ఈ పద్యము లన్నియు పోతనగారి ప్రతిభలో భాసించినవి. ఈ పద్యముల వలననే తెలుగుదేశములో గజేంద్ర మోక్షణమున కొక రససిద్ధి వచ్చినది. ఈ వర్ణనలోనే ఆధ్యాత్మిక రహస్యములను కూడ చెప్పగలుగుట పోతనగారి ప్రత్యేకత. "గగనంబున

కుద్గమించి'' విష్ణుమూర్తి ప్రయాణమైనాడని పోతనగారి వాక్కు. 'బయలు ఆలింపుచు' అను ప్రయోగమునకు నిది చక్కగా సరిపోవుచున్నది. భగవంతు నకు, సాధకునకు మధ్య వాహికగా ఆకాశము పనిచేయునని ఇంతకు ముందు చెప్పుకొంటిమి. విష్ణుమూర్తి ఆకాశములోనికి ప్రవేశించెనను మాట కూడ దీనికి సరిపోవు చున్నది.)

**98.** ఇట్లు విష్ణువు ప్రయాణమై వేంచేయు చుండగా, ఆయన వెనుకనే లక్ష్మీదేవి బయలుదేరెను. ఆమె వెంట అంతఃపుర నివాసులగు చెలికత్తెలు బయలుదేరిరి. వారి వెనుకనే గరుత్మంతుడు సాగెను. అతని ప్రక్కగా ధనుస్సు, గద, శంఖము, చక్రము మున్నగు ఆయుధము లన్నియు కదలివచ్చెను. వారి వెనుకనే నారద మహర్షియు, విష్వక్సేనుడును సాగివచ్చిరి. ఆ వెనుక వైకుంఠ పురములో గలవారు ఆబాలగోపాలము 'హెలో' మని బయలుదేరిరి.

**99.** విష్ణువు చేతిలో పైటకొంగు చిక్కిపోవగా లక్ష్మీదేవి కూడ వెనుకనే వెళ్ళక తప్పలేదు. పద్మము వంటి ముఖముపై మూగుచున్న తుమ్మెదలను తోలుకొనుచు ఆమె కూడ వెళ్ళుచుండెను.

**100.** ఇట్లు సాగిపోవుచు శ్రీదేవి యిట్లని ఆలోచింపసాగెను. "ఈయన ఎటుపోవుచున్నారో చెప్పలేదు. దిక్కులేని ఆడువారి మొరలేమైన వినిపించెనా? వేద సంహితలను దుష్ట రాక్షసు లెవరైన దొంగిలించిరా? రాక్షసు లెవరైన దేవలోకముపై దండెత్తిరా? లేక ఏ దుర్మార్గులైనను భక్తులను పట్టుకొని విష్ణు వెక్కడున్నాడు చూపుడని బెదరించిరా?''

**101, 102.** ఇట్లు తనలో తా నాలోచించుకొనుచు పోవుచున్న శ్రీదేవి దివ్య మనోహరముగా నుండెను. చెవుల రవ్వల కమ్మలు సంచలించు చుండెను. జుట్టుముడి చెదరి భుజములపై నాట్యమాడుచుండెను. వేగముగా పోవుచుండుట వలన ఆమె శరీరకాంతులు కదలుచుండెను. నుదుటిపై నున్న కస్తూరి తిలకము చెదరియుండెను. ప్రియుని చేతిలో చిక్కిన పయ్యెద కొంగుతోపాటు తాను పోవుచుండగా పయ్యెదలేని ఆమె వక్షస్థలము ప్రకాశించు చుండెను. వక్షోజముల

బరువునకు బెదరి సన్నబడినట్లున్న ఆమె నడుము రమ్యముగా నుండెను. కోటి చంద్రుల కాంతితో ఆమె ప్రకాశించు చుండెను.

(ప్రణయలీల మధ్యలో ఆగిపోయిన లక్ష్మీదేవి రూపమును పోతనామాత్యులు ఔచిత్యము చెడకుండ చక్కగా వర్ణించిరి. 'ఎవని బొమ్మలు మాటలో వాడు చిత్రకారు డగునట్లే, ఎవని మాటలు బొమ్మలో వాడు కవి' అని పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు అద్భుతముగా నిర్వచించిరి. సుందరమైన రూపములను కన్నులకు కట్టినట్లు వర్ణింపగలవాడు చక్కని కవి యగును. చలచ్చిత్రములను (కదలుచున్న అందములను) వర్ణింప గలుగుట మరింత కష్టము. కవి ప్రతిభ కది గీటురాయి. అట్టి చలత్సౌందర్యము శృంగార సంబంధమైనచో ఔచిత్యము చెడకుండ వర్ణించుట కత్తిమీద సాము వంటిదే యగును. ఇన్ని విధముల వర్ణనలను సహజ ప్రతిభతో నిర్వహించిన పోతనామాత్యులు 'సహజ పాండిత్యు' డనుటలో అతిశయోక్తి యేమున్నది?)

**103.** వివరము లడుగవలెనని ఒకసారి ఆమె చక చక పోవును. అడిగినను సమాధానము చెప్పడేమో యని జంకుతో వెనుకంజ వేయును. నివ్వెరపోవుచు, చీకాకుపడుచు, అడుగులు తడబడుచుండగా, ఆమె ముందు వెనుకలకు తటపటాయించు చుండెను.

**104.** నుదుటిపై వ్రాలిన ముంగురులను సరిజేసికొనుచుండగా నామె ముఖపద్మము నిండుగా ఝుంఝుమ్మని తేనెటీగలు ముసురుకొనుచుండెను. ఆ తుమ్మెదలను తోలుకొనుచుండగా దొండపండ్ల వంటి ఆమె పెదవులకై రామచిలుకలు మూగి వచ్చుచుండెను. ఆ చిలుకలను తోలుకొనుచుండగా ఆకాశ గంగానదిలోని పెద్ద చేపలు- చేపల వంటి ఆమె కన్నులకొరకై వరుసలలో వచ్చుచున్నట్లుండెను. మెఱపు తీగెలను కూడ నెట్లో దాటిపోవుచుండగా జక్కవ పక్షుల వంటి ఆమె కుచములకై జక్కవ పక్షు లెగిరివచ్చి పొగరు చూపు చుండెను. నీలమేఘ శ్యాముడగు విష్ణువు వెనుక వచ్చుచున్న లక్ష్మీదేవి- మబ్బుల వెనుక మెఱయుచున్న తీగెవలె ప్రకాశించుచుండెను.

(రూపకాలంకారముతో కూడిన ఉత్ప్రేక్షలతో పోతనామాత్యులు చేసిన యీ వర్ణనము రమ్యముగా నున్నది. కవి సమయములు, అలంకారములే గాక ఇందొక విశేషమున్నది. ముంగురులను తుమ్మెదలతోను, పెదవులను దొండ పండ్లతోను, కన్నులను చేపలతోను, శరీరమును మెఱపు తీగెలతోను, వక్షోజము లను జక్కవ పక్షులతోను పోల్చుట కవి సమయము. తుమ్మెదలు మొదలైనవి అందమును వర్ణించుటకు ప్రమాణముగా కవులంగీకరించిరి. ఈ ప్రమాణము లన్నియు విధేయములై జగన్మాతయగు లక్ష్మీదేవి యవయవములను సేవించుట ఈ వర్ణనములోని విశేషము.)

**105.** అట్లు విష్ణువు వేంచేయు చుండగా దేవలోకములోని అమరు లందరును ఆయనను దర్శించిరి. ఆయన దేవ శత్రువులగు రాక్షసుల జీవితము లను, సంపదలను పెరుగనీయుడు. అతడు లోకములో కరుణయను రూపమున వర్ధిల్లుచుండును. యోగీంద్రుల హృదయములనెడి ఉద్యానవనములలో వర్తించువా డాయన! ఓర్పు ఆయన ముఖ్యగుణములలో నొకటి. భక్త జనములు బృందములుగా జేరినపుడు వారిని తన ప్రాభవముతో ప్రకాశింపజేయును. క్రొత్త యౌవనములో నున్న శ్రీదేవిని ఆయన ఉపచరించు చుండును. దివ్య కాంతులతో వెలుగుచున్న ఆ విష్ణువు జయించుటయేగాని ఓడిపోవు టెరుగనివాడు.

(భక్తజనులు బృందములుగా జేరినపుడు ప్రత్యేకముగా నారాయణుని అనుగ్రహము వారిపై వర్షించుట ఒక విశేషము.)

**106, 107.** విష్ణువు రాకను అల్లంత దూరముననే గుర్తుపట్టిన దేవతలు “అడుగో! మహానుభావుడైన విష్ణుమూర్తి వేంచేయుచున్నాడు! ఆయన ప్రక్కనే లక్ష్మీదేవి కూడ వచ్చుచున్నది. అదిగో! పాంచజన్య శంఖనాదము. అదిగో, అదే సుదర్శన చక్రము. ఆ వెనుకనే గరుత్మంతుడు కూడ మహావేగముగా వచ్చు చున్నాడు'' అనుచు భక్తితో “నమో నారాయణాయ'' అని ఎలుగెత్తి స్తోత్రము చేయుచు గజేంద్రుని రక్షింపబోవుచున్న విష్ణువునకు శిరస్సు వంచి నమస్కరించిరి.

108. విష్ణువు గజేంద్రుని రక్షింపవలె నను సంకల్పముతో పరవశుడై యుండుట వలన దేవతల నమస్కారములను శ్రద్ధగా స్వీకరింపలేదు. అట్లు మనోవేగమున పోయి సరస్సు వద్దకు చేరెను. శింశుమార చక్రములో గొప్పవైన మకర, కర్కాటక, మీన, మిథునము లను రాశు లున్నట్లు, ఆ సరస్సులో పెద్ద పెద్ద మొసళ్ళు, ఎండ్రకాయలు, చేపలు జంటలుగా విహరించు చుండెను. కిన్నరుల రాజైన కుబేరుని భాండాగారమున కచ్ఛపము, వరము, స్ఫటికము మొదలగు నిధు లున్నట్లు ఆ సరస్సులో చక్కని తాబేళ్ళు తిరుగుచుండెను. భాగ్యవంతుడైన వానికి యదృష్టము వలన ప్రేమలతో నిండిన జీవితము లభించును. అట్లే ఆ సరస్సులోని జలములు సారవంతమైన మట్టితో కలసి ఎర్రబడి యుండెను.

(ఆ కొలనులోని మట్టి వలనను, మకర గజేంద్రుల రక్తము వలనను కొలనులోని నీరు ఎర్రబడెను.) వైకుంఠపురము శంఖచక్రములతోను, కమల అను పేరుగల లక్ష్మీదేవితోను విరాజిల్లు చుండును. అట్లే ఆ సరస్సు శంఖముల తోను, చక్రవాక పక్షులతోను, తామర పూవులతోను ప్రకాశించు చుండెను. సంసార చక్రములో సుఖ దుఃఖములు, కామక్రోధములు మొదలగు ద్వంద్వ ములు, సంఘర్షణలు, అంటుకొను స్వభావముండును. అట్లే కొలనులో మకర గజేంద్రుల ద్వంద్వ యుద్ధముచే త్రొక్కివేయబడిన బురద నిండి యుండెను.

('మనస్సమాన సంచారుండై విష్ణువు' వచ్చెనని యున్నది. మనస్సు భక్తుల కుండును గాని దేవున కుండదు. భక్తుని మనస్సు ఎంత వేగముగా పయ నించునో అదే వేగముతో దేవుడు భక్తుని రక్షించుటకు వచ్చును. దేవుని ఫ్రీక్వెన్సీలో భక్తుని మనస్సు ప్రసరించినప్పుడు అదే ఫ్రీక్వెన్సీలో దేవుడు భక్తుని వద్దకు వచ్చును.)

**(పదములకు గల శ్లేషార్థముల నాధారము చేసికొని ఇట్టి వర్ణన చేయుట బాణభట్టు నుండి ప్రారంభమై ఒక సంప్రదాయముగా మారినది. చిత్ర కవిత్వము వంటి యీ వర్ణన కవి తన ప్రతిభను ప్రదర్శించి సరదా తీర్చుకొనుట కుపయోగపడును. అర్థము వివరించి చూచుకొన్నచో ఉపమానమునకు,**

వర్ణించబడు వస్తువునకు సంబంధ మేమియు నుండదు. అర్థ సమన్వయమున పేలవముగా నుండు ఇట్టి వర్ణనలను చిత్రకవిత్వముగా మాత్రము గౌరవింప దగును.)

**109.** కరుణా సముద్రుడగు విష్ణువు మొసలిని నరికివేయుటకు సుదర్శన చక్రమును పంపెను. దాని వేగమునకు భూచక్రమంతయు కంపించిపోయెను. దానినుండి వెలువడిన మహాగ్ని గోళముల కాంతులచే ఆకాశము నందలి కాంతులన్నియు మాసిపోయెను. బ్రహ్మాండ భాండములోని కాంతుల మధ్య అడ్డులేక పరిభ్రమించు చుండు ఆ చక్రమే దేవతా సమూహమును పలుమార్లు రక్షించెను.

**110, 111.** విష్ణు విట్లు పంపగా ఆ సుదర్శన చక్రము మనోవేగముతో ప్రసరించి వచ్చెను. సరస్సు మధ్యలో నున్న క్రొత్త తామర పూవును కౌగలించు కొనుటకై దిగివచ్చు సూర్యదేవునివలె ఆ చక్రము గుభిల్లు మను శబ్దముతో నీటిలోనికి ప్రవేశించెను. సరస్సులోని నీరు కల్లోలమయ్యెను. అట్లు ప్రవేశించిన చక్రము దుష్ట మకరమున్న చోటికి పోయెను.

**112.** ఆ మొసలి మేరు పర్వతము వంటి శరీరము గలది. అడవి యేనుగు లన్నియును దాని ధాటికి భయకంపితమై పోయెను. అంతవరకు లభించిన విజయముచే దాని ఉత్సాహమునకు పట్టపగ్గములు లేకున్నవి. కామక్రోధముల కది నివాసస్థానము. కనుకనే ఏనుగు రక్తప్రవాహములలో మునిగి తేలుచున్నను దాని దాహము తీరలేదు. అట్టి మొసలిని సుదర్శన చక్రము భీకరముగా తాకి, అవలీలగా తల నరకి సంహరించెను.

**113, 114.** సుదర్శన చక్రమిట్లు మకరమును చంపుచుండగా, రాశి చక్రములోని మకరము భయముతో సూర్యుని వెనుక దాగెను. నిధులలో నొకటి యగు మకరము కుబేరుని చాటున, సాగరములోని మకరము లన్నియు విష్ణు వవతారమగు కూర్మరాజు చాటున దాగెను. (మకరమను పేరున్నంత మాత్రము ననే చక్రము తమను కూడ చంపునని భయపడెనని చమత్కారము.)

**115.** గ్రహణము వదలిన చంద్రునివలె మొసలి పట్టు వదలిన గజేంద్రుడు ప్రాణములు కుదుటపడగా మరల ఉత్సాహము పొందెను. సంసార దుఃఖములు వదలిన వైరాగ్య సంపన్నుని వలె అతని దుఃఖము వదలిపోయెను. ఒక్కసారి పాదములు విదలించి చూచుకొనెను. ఈ సన్నివేశముతో ఆశ్చర్యచకితమైన దిగ్గజముల భార్యలు తమ తొండములతో గజేంద్రునిపై అమృతధారలు కురిపించిరి. ఆ స్నానముతో గజేంద్రుని అలసట తీరిపోయెను.

**116.** విష్ణువు ఉత్సాహముతో పాంచజన్యమను శంఖమును పూరించెను. విష్ణువు కరుణయను సముద్రము నుండి పుట్టిన శంఖమది. పంచ మహా భూతములలోని చైతన్యము కూడ ఆ శంఖధ్వానము విని భయముతో గడ్డ కట్టిపోవును. దాని తెల్లని కాంతులు చూచి పర్జన్యుడు మొదలగు దేవతాధీశ్వరులు కూడ ఆశ్చర్యచకితు లగుచుందురు. ఆపదలో నున్నవారి దుఃఖము లన్నియు శంఖధ్వానము వినగానే తొలగిపోవును. శత్రుసైన్యములు ఆ శంఖ ధ్వానము విన్నంతనే పారిపోవు చుండును.

**117.** విష్ణువు దయవలన గజేంద్రుడు రక్షింపబడుటతో దేవతల భేరీ ధ్వనులు మ్రోగెను. పద్మగంధములతో కూడిన వాయువులు వీచెను. పూవులే వానజల్లులుగా దేవలోకము నుండి వర్షించెను. దేవతా యువతులు ఆనందముతో లాస్యము చేసిరి. జీవజాలము చేయు జయ జయ ధ్వనులు దిక్కులలో నిండి పోయెను. ఆకాశ గంగలోని పద్మముల ముఖములను ముద్దుగొనుచున్నట్లు సముద్రము ఉప్పొంగెను.

**118.** శ్రీహరి పొడవైన తన చేతిని చాచి గజేంద్రుని సరస్సులో నుండి యీవలకు లాగెను. కన్నీరు తుడుచు చున్నట్లు మదజల ధారలు తుడిచి, మెల్లగా గండస్థలమును ప్రేమగా స్పృశించుచు గజేంద్రుని దుఃఖమును పోగొట్టెను. (ఆపదనుండి బయటపడిన పుత్రుని తండ్రి యెట్లు ప్రేమతో లాలించునో అట్లే ప్రేమతో విష్ణువు గజేంద్రుని లాలించెను.)

**119, 120.** శ్రీహరి కరస్పర్శ వలన గజేంద్రునకు దేహ బాధ లన్నియు మాయమయ్యెను. తన భార్యలతో కలసి గజేంద్రుడు మధురముగా

ఘీంకారములు చేయసాగెను. భార్యలను తొండముతో మెల్లగా నిమురుచు, అనురాగముతో దేహముతో దేహములను రాచుకొను చుండెను. విష్ణువు దయ వలన మరల బ్రతికితి నని భార్యలతో చెప్పుచు తొండముతో తొండములను ప్రేమగా ఒత్తెను.

(కరము అనగా చేయి, తొండము అని అర్థము లున్నవి. కొన్ని ప్రాంతము లలో వివాహములలో వధూవరులు ఒకరి చేతి నొకరు నొక్కుట యను ఆచారమున్నది. దానిని కరపడీన మందురు. తాను పునర్జన్మ నెత్తితి నని సంతోషించిన గజరాజు తన భార్యలను మరల వివాహ మాడినట్లు తొండముతో 'కరపీడనము' చేసెనని ఇందలి చమత్కారము.)

**121.** పరీక్షిన్మహారాజా! 'హూహూ' అను పేరుగల గంధర్వుడు పూర్వ మొకప్పుడు దేవల మహర్షి శాపముచే మొసలిగా మారి ఆ సరస్సులో నివసించు చుండెను. సుదర్శన చక్ర స్పర్శచే అతడికి శాపవిమోచన మయ్యెను. పాపరహిత మైన తన గంధర్వ దేహమును ధరించి విష్ణువుకు భక్తితో నమస్కరించెను. ఆయనను కీర్తించి, ఆ దేవుని అనుగ్రహమునకు పాత్రుడై నమస్కరించి తన లోకమును చేరుకొనెను. గజేంద్రుడు విష్ణు కరస్పర్శచేత అజ్ఞానము తొలగినవాడై, విష్ణు రూపమును పొంది తేజోమయుడై ప్రకాశించు చుండెను. (అనగా 'సారూప్య ముక్తి' అను స్థితిని పొందెను.)

**122.** మహారాజా! మొసలితో ఇంతటి పోరాటము సాగించిన ఆ గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్రద్యుమ్నుడను పేరుగల రాజు. ద్రవిడ దేశమున కధీశ్వరుడు. మహా విష్ణు భక్తుడై పుణ్యాత్ముడైన వాడు. ఒక మహా పర్వత శిఖరముపై నారాయణప్రీతిగా ప్రత్యేకమైన పూజ చేయుచుండెను. ఆ సమయమున అతడు మౌనవ్రతమును స్వీకరించి యుండెను.

**123.** అట్టి దీక్షలో నున్న ఇంద్రద్యుమ్ను డొకనాడు మనసులో నారాయణుని ధ్యానించుచు మౌనదీక్షలో నుండగా, అగస్త్య మహర్షి యచ్చటికి వచ్చెను. కాని రాజు మాత్రము లేచి ఆ మహర్షిని పూజింపలేదు. దానితో అగస్త్యున కప్పటి

కప్పుడు కోపము పుట్టుకొని వచ్చెను. "మూఢుడా! లోభీ! నీవు ఏనుగు గర్భమున పుట్టెదవు గాక!'' అని శపించెను.

**(సర్వ జీవులలోను నారాయణుని చూడవలసిన విష్ణుభక్తుడు తన మనసులో మాత్రమే నారాయణుని ధ్యానించుచు, మహర్షిని గౌరవింప లేదు. కనుక అతడు మోహము చెందినవాడు లేక మూఢుడు. తనలో నిలబడియున్న నారాయణ ధ్యానముద్ర చెదరిపోవునని లోభించినవాడు గనుక లోభియని అగస్త్యుడు సంబోధించెను.)**

**124.** ఎంత పుణ్యము చేసినవాడైనను బ్రాహ్మణోత్తములను చూచినప్పుడు అగౌరవము చేయరాదు. అగస్త్య మహర్షి నవమానించిన ఇంద్రద్యుమ్నుడు ఏనుగుగా పుట్టవలసి వచ్చెను.

(ఇందు చెప్పబడిన గజేంద్రుడు పూర్వజన్మలో ఇంద్రద్యుమ్నుడను రాజు. శాపవశమున నతడు గజరాజుగా జన్మించి, విష్ణుస్పర్శచే శాపవిమోచనము పొంది, వైకుంఠము చేరెను. ఆ కథ యిట్లున్నది: పూర్వకాలమున ద్రవిడ దేశమును పాలించిన ఇంద్రద్యుమ్ను డను రాజు ధర్మాత్ముడు; మహా విష్ణు భక్తుడు. అతడు మలయ పర్వతముపై మౌనవ్రతము స్వీకరించి, విష్ణువు నుద్దేశించి ఒక మహా యాగమును చేయ సంకల్పించెను. అతడా యజ్ఞదీక్షలో నుండగా, అగస్త్య మహర్షి వేంచేసెను. కాని మౌనదీక్షలో నున్న ఇంద్రద్యుమ్నుడు మహర్షిని ఆహ్వానించి పూజింపలేదు. అగస్త్యుడు కోపించి, ఏనుగుగా పుట్టుమని శపించెను. ఆ శాపము కారణముగా మహారాజు ఇంద్రద్యుమ్నుడు గజేంద్రుడై జన్మించెను. కాని పూర్వజన్మలోని విష్ణుభక్తి ఈ జన్మలో ఆపదలో ఆదుకొని రక్షించెను.

అట్లే గజేంద్రుని పట్టిన మొసలికూడ పూర్వజన్మలో 'హూహూ' అను పేరుగల గంధర్వుడు. త్రికూట పర్వత ప్రాంతమున దేవలుడను దేవర్షి తపస్సు చేసికొనుచుండగా, ఈ గంధర్వుడు భార్యలతో బాటు ఆ పర్వతముపై విహరింప నేగెను. భార్యలతో కలసి ఆ మహర్షి సమీపముననే నిర్లజ్జగా కామక్రీడ లతో చరింపసాగెను. దేవలుడు కోపించి, మొసలిగా మారి ఆ సరస్సులో

పడియుండుమని శపించెను. ఆ గంధర్వుడే సుదర్శన చక్ర స్పర్శచే శాప విమోచనము పొందెను.

ఈ కథలో కొన్ని చిత్రమైన విషయము లున్నవి. మహర్షుల శాపములు, దేవతల శాపములు జాగ్రత్తగా గమనించినచో చిత్రముగా నుండును. వారి కోపము వెనుక అపారమైన కరుణ దాగియుండును. గంధర్వుడు కామ మోహితుడై లజ్జారహితముగా పెద్దల ముందు ప్రవర్తించెను. కామము కన్నులు గప్పినవా డిట్లు ప్రవర్తించుట వింతకాదు. దానికితోడు ప్రియురాండ్రతో విహరించుచున్నవాడు, వారియెదుట తన గొప్పదనమును చాటుకొనవలెనని తాపత్రయపడుట కూడ నుండును. అట్టి రోగము మామూలు ఔషధములకు లొంగదు. హీనమైన జన్మ యెత్తినచో, ఆ జీవుడు సుదీర్ఘ కాలము అవ్యక్తమైన బాధతో కుమిలిపోవుటయు, ఆ ప్రక్రియలో అతనియందలి పాపబుద్ధి క్షాళన మగుటయు జరుగును. ఇది ఒక మహర్షి శాపవాక్కు వలన జరిగినచో ఆయన ఆగ్రహమే పరిణామములో అనుగ్రహముగా పరిణమించును. ఒక సామాన్య గంధర్వునకు సుదర్శన చక్ర స్పర్శ కలుగుట, విష్ణువు దర్శనము లభించుట సామాన్యమైన అనుగ్రహము కాదు. అట్టి అసామాన్యమగు అనుగ్రహము దేవల మహర్షి శాపస్పర్శచే లభించినది.

ఇంద్రద్యుమ్నుని కథలో మరింత చిత్రమగు సమన్వయ మున్నది. ఇంద్రద్యుమ్ను డెంత విష్ణు భక్తుడైనను క్షత్రియ సహజమగు రజోగుణ మతనిలో మిగిలియున్నది. మౌనదీక్షలో నున్నను మహర్షులు వచ్చినప్పుడు లేచి నమస్కరించుట, అర్ఘ్యపాద్యాదులతో గౌరవించుట చేయవచ్చును. దానికి మౌనదీక్ష అడ్డు కానక్కరలేదు. యజ్ఞదీక్ష పట్టినప్పుడు అదియే ముఖ్యమని భావించి రజోగుణ దోష మతనిలో మిగిలియున్నది. ఆ దోషమును క్షాళన చేయుటయే అగస్త్యుని కోపమునకు ఫలితాంశము. ఆయన కోపమే శాపరూపమైన అనుగ్రహముగా ఇంద్రద్యుమ్నుని దోషమును క్షాళన చేసి, విష్ణు సాక్షాత్కారము నకు అర్హత కలిగించెను. ఇది యంతయు అగస్త్యుడు ముందుగా తెలిసియే

చేయనక్కరలేదు. ఆద్యులైన ఋషుల వాక్కుల ననుసరించి పరమార్థము నడచి వచ్చునని భవభూతి మహాకవి నిర్వచించెను.

ఒక జీవుని పరిణామ ప్రక్రియలో కలుగు అడ్డంకులు తొలగుచున్న కొలదియు సాధకుని అర్హత పెరుగుచుండును. అర్హత పెరిగిన కొలదియు దేవుని అనుగ్రహము చేరువ యగుచుండును. దానికి తగిన సన్నివేశములను కల్పించు వాడు గురువు. ఆ సన్నివేశములలో ప్రవర్తించునప్పుడు సాధకుడు పొందు పరిణతియే ఉపదేశమై సాధకుని నడిపించు చుండును. ఇట్లు గురువు సాధకుని శిష్యునిగా స్వీకరించి నడిపించుట కొన్ని జన్మల తరబడి జరుగు చుండును. చాలకాలము వరకు శిష్యునకు తెలియకుండగనే గురువు వానిని నడిపించు చుండును. అనగా గురువు తన ఎదుటనే యున్నను సాధకు డాయనను గురువుగా గుర్తింపలేడు. అవసరమైన పరిణతి పొందిన తరువాత గురువే శిష్యుని వద్దకు నడచివచ్చును. అయినను గురువు అనుమతి లేనిదే సాధకు డాయనను గుర్తింపలేడు. ఈ సత్యమే ఇంద్రద్యుమ్నుడు అగస్త్యుని గౌరవింప లేదనుటలో సూచింపబడినది.

గురువు శిష్యుని వద్దకు నడచివచ్చుట యనగా, అది ఒక ముఖ్యమైన సన్నివేశమునకు, ఒక ముఖ్యమైన ఉపదేశమునకు ప్రారంభ మగును. అది కోపమైనను, శాపమైనను, అనుగ్రహమే గాని ఆగ్రహము కాదు. అదియే ఇంద్రద్యుమ్నుని విషయములో జరిగెను.

ఇంద్రద్యుమ్నుడు ద్రవిళ దేశమునకు రాజు. అనగా నేటి తమిళనాడు ప్రాంతము. తమిళనాడులోనే యున్న నీలగిరులలోనే అగస్త్యుడు నివసించు చుండును. ఇంద్రద్యుమ్నుడు యజ్ఞము చేసిన మలయ పర్వతము కూడ ఆ ప్రాంతములోనే యున్నది. గురువు సాధకునకు సన్నిహితుడుగానే యుండును. ఈ సాన్నిహిత్యము భౌతికమే కానక్కరలేదు. హృదయమునకు సన్నిహితుడుగా నుండును. సన్నిహితుడుగా నుండుట మాత్రము జరుగును. ఈ సాన్నిహిత్యము అను అంశమును వ్యంగ్యముగా సూచించుటకే అగస్త్యుని ఆశ్రమమునకు సమీపములోనే ఇంద్రద్యుమ్నుని రాజ్యమున్నదని వర్ణించబడినది.

ఇది ఒక శిష్యుడు - ఒక గురువునకు సంబంధించిన కథ కాదు. ఇది పాల సముద్రములోని త్రికూట పర్వతముపై జరుగుచున్న దనియు, అప్పటి కింకను మానవ శరీరము, ఆయుర్దాయము అనునవి యేర్పడలే దనియు గమనింపవలెను. నరజాతి యొక్క గాథ యంతయు ఒక వ్యూహము (Formula)గా రూపొందుచున్న ఘట్టమిది. నరుల ఆవిర్భావము, అందు జీవుని పరిణామ విధానము, గురుశిష్యుల అనుబంధము, జీవ-ఈశ్వరుల బాంధవ్యము, నర-నారాయణుల క్రీడావినోదము మున్నగున వన్నియు ఒక వ్యూహముగా, అర్థవాదముగా ఈ కథలో నీయబడినవి. అనగా ఇది నరజాతి యొక్క శాశ్వత గాథయేగాని ఏ ఒక్క గజేంద్రునకో, మొసలికో చెందిన కథ కాదు.)

**125.** మహారాజా! ఆ విధముగా ఇంద్రద్యుమ్నుడను రాజు అగస్త్యుని శాపముచే ఏనుగుల రాజుగా జన్మించగా, భటులు మున్నగు వారు కూడ ఏనుగులై జన్మించిరి. అయినను విష్ణు పాదసేవనము వలన గజేంద్రునకు ఎక్కువ మోక్షము లభించెను.

(మోక్షములో ఎక్కువ తక్కువ లుండవు. రాజసికమైన యజ్ఞయాగాది విధానములలో ఎంతోకాలమునకు గాని లభింపని ముక్తి, స్వల్పకాలమునకే ఏనుగు శరీరములో నుండగా లభించెను. అదియు దేవతాధీశ్వరులు కూడ ఆశ్చర్యపడు పద్ధతిలో జగత్ప్రసిద్ధముగా లభించెను. 'అధికముక్తి' అను ప్రయోగముచే పోతన ఇది యంతయు ధ్వనింపజేసెను.)

**126. మానవు లెవ్వరైనను తమ కర్మలను తాము అల్లుకొనుచు, చిత్త శుద్ధితో విష్ణువును సేవించుచు జీవింపవచ్చును. ఇట్లు లౌకిక-భక్తిమయ జీవితము లను రెండింటిని నియమముతో నిష్ఠగా నాచరించు వారికి, నెమ్మదిగా కర్మ బంధము సడలిపోయి శిథిలము కాగా, విష్ణుభక్తి బలవత్తరమై క్రమముగా పాదుకొను చుండును.**

**127.** దుష్టబుద్ధితో జీవించువారికి దారాపుత్రాదులు, గజాశ్వాది వాహన ములు, ఐశ్వర్యము నశించిపోవును. సద్గుణములతో జీవించువారికి ఇవి

యన్నియు నాశనము గాక నిలబడి యుండును. అసలు విష్ణుసేవా నిరతులగు సజ్జనులకు తాము చెడిపోవుటయే ఉండదు.

(ఇది యొక చిత్రమైన సాధన విధానము. భగవద్గీతలో గాని, మరి యెక్కడ గాని భక్తి, జ్ఞాన, కర్మ యోగములు వేరుగా నుండునని చెప్పబడలేదు. ఏ యోగము నందైనను కర్మాచరణము ఉండితీరును. సాధనలో పురోగతి సాధించుచున్న కొలదియు కర్మల సంకల్పములను, ఫలితములపై ఆసక్తిని వదలివేయుట నుండును. కర్మల ఆచరణమును, భక్తిని జోడించి దేవునకు సమర్పితముగా ఆచరించినచో, జ్ఞానము వికసించును. లౌకిక జీవితములో కర్మ లాచరించుట తప్పనిసరి. దానిని నిష్ఠగా నాచరించుచు, దైవభక్తితో శ్రద్ధగా పూజాదులు చేయుచున్నచో, క్రమముగా కర్మలయెడల తనకు గల బంధము సడలి, దైవభక్తి బలీయమై నిలబడును. కొబ్బరికాయలోని కొబ్బరి పెంకునకు అంటుకొని యుండును. కొబ్బరి ముదిరిన కొద్దీ, పెంకుతోగల పట్టు సడలిపోయి చివరకు కొబ్బరి కురిడీగా విడిపోవును. అట్లే సడలి, తొలగిపోవునది కర్మ-ఫలితముల యందు తనకు గల బంధమే గాని కర్మలు నశించుట యుండదు.

దుష్టబుద్ధి గలవానికి సంపదలతోబాటు దారాపుత్రాదులు కూడ నశించు నని చెప్పబడినది. తాను దుష్టుడైనచో కుటుంబము నశింపవలెనా? అసలు సంపదలు గాని, భార్యాపుత్రాదులు గాని తన కుండుట, లేకుండుట అను విభాగము ఎట్లు చేయవలెను? ఉన్న ధనము వలన సుఖపడినప్పుడే వానికా ధనము ఉన్నట్లు పరిగణింపవలెను. జైలులో నున్న ధనవంతునకు ధనము లేనట్లే గదా! అట్లే భార్యాపుత్రాదులవలన సుఖపడిన వానికే వారు ఉన్నారని యర్థము. దుష్టుడైనవాడు తన భావనలోని దోషము వలన, భార్యా పుత్రాదుల వలన కలుగుచున్న సుఖమును గుర్తింపడు; పైగా వాని ప్రవర్తన కారణముగా భార్యాపుత్రులు విసుగు చెంది యుందురు. ఈ రెండు కారణముల వలన దుష్టునకు సంపదలు, భార్యాపుత్రాదులు ఉండియు లేనట్లే యగును. సద్గుణములు కలవాడు పై రెండు విధములుగాను సుఖపడును.

కనుక వానికి సంపద లన్నియు నుండును. విష్ణుభక్తి యున్నవాని ప్రజ్ఞ శిథిలము కాదు గనుక సద్గుణములు కూడా శిథిలము కావు.)

**128, 129.** ఈ సన్నివేశమును చూచిన లక్ష్మీదేవి ముఖము విరిసిన పద్మమువలె చిరునవ్వులతో ప్రకాశించెను. విష్ణు వామెతో నిట్లనెను : "దేవీ! నా వెంట వినువీధిలో అనుసరించి వచ్చుచుండగా ఏమనుకొంటివి? నీ పయ్యెద కొంగు విడువలేదని ఏమేమో అనుకొంటివి గదా!''

**130. "నా తత్త్వమును నీ వెరుగుదువు. జీవరాశులు నన్ను మరచినను నేను వారిని మరువను. నేను తమను మరచిపోయితినని భావించువారు మాయలో పడినవారు. మాయలో నుండి బయటపడి, నన్ను మరువక మొరపెట్టు కొన్నచో, నాకిక వారి క్షేమమేగాని మరియేమియు గుర్తుండదు."**

(జీవులను దేవుడు మరచుట యుండదు. కాని తనంత తానుగా వారిని రక్షించుట కూడ ఉండదు. దేవుడు తమను మరచిపోయెనని తమను తాము మోసగించుకొను వారిని కూడ అతడు చూచుచునే యుండును. తనను స్మరించి రక్షించునని గ్రహించిన వాని మనస్సులో దేవుడే నిండి యుండును. కనుక దేవునికి కూడ అతడు తప్ప మరి యొకటి జ్ఞప్తి యుండదు.)

**131.** విష్ణు దేవుడిట్లు సెలవీయగా, పద్మాలయ అగు ఇందిరాదేవి ముఖము మందహాసపు వెన్నెలతో నిండిపోవుచుండగా నిట్లనెను :

**132, 133. "దేవా! తమ పాదములనే ధ్యానించుచు, సేవించుటయే నా పనిగదా! అంతకన్న నేను వేరే చెప్పున దేముండును? నీ వెనువెంటనే రాక నేను చేయగలుగునది కూడ ఏమున్నది? దీనజనుల ఆర్తనాదములు వినుట లోను, వారిని రక్షించి వారి దీవెనలు పొందుటలోను నీకు సాటి మరి యెవరున్నారు. నీవు దీనుల యధీనములోని వాడవు కావా?"**

(గంభీరమైన ఈ సన్నివేశమును తేలిక పరచుటకై విష్ణువు సరసాలాపము లతో సంభాషణ మారంభించి పరమార్థముతో ముగించెను. పయ్యెద కొంగు తనచేత చిక్కించుకొని పరుగులు పెట్టుచుండగా, శ్రీదేవి కూడ పరుగులు

పెట్టక చేయునదేమి? అప్పుడామె మనోభావము లెట్లుండెను? కొంగు వదల వలెనని తనకు తోచకుండుటకు సంజాయిషీ యిచ్చుచున్న వానివలె అతడు సంభాషణ ప్రారంభించెను. విష్ణువు రసజ్ఞత కిదియొక ఉదాహరణము. శ్రీదేవి కూడ అంత సరసముగాను సంభాషణ ప్రారంభించి పరమార్థముతో ముగించెను. కొంగు ఆయన చేత చిక్కియుండగా, ఆయన అడుగులను గమనించుచు పరుగులు పెట్టనిచో తన గౌరవము దక్కదుగదా! అట్లే భర్త అడుగుజాడలలో నడువనిచో భార్యలకు గౌరవముండదని ధ్వని.)

134. లక్ష్మీదేవి యిట్లు పలుకుచుండగా, విష్ణువామెను సరసాలాపము లతో సాదరముగా గౌరవించి చిరునవ్వులతో కౌగలించుకొని, గరుత్మంతునిపై నధిరోహించెను. గంధర్వాది దేవగణములు జయజయ ధ్వానములు చేయు చుండగా, పరివారముతో కలసి వైకుంఠపురమునకు ప్రయాణ మయ్యెను.

(ఇది ఒక వ్యక్తి కథ కాదనియు, నరజాతి యొక్క చరిత్ర మొత్తము నమూనా (Blue Print)గా చెప్పబడిన దనియు ఇంతకు ముందు చెప్పుకొని యుంటిమి. ఇట్టి నమూనా నరజాతి కథలు పురాణములలో వివిధ స్థాయులలో అర్థవాదములుగా నీయబడి యున్నవి. సృష్టికి ముందు బ్రహ్మ మోహము చెంది, నారాయణుని శరణువేడి మరల సృష్టి సామర్థ్యమును పొందుట; ప్రజాపతియగు దక్షుడు అహంకార మూర్తియై ప్రవర్తించి ఈశ్వర రహితమగు యజ్ఞము చేయుట; శిరస్సు ఖండింపబడి మరల ఈశ్వరునితో యజ్ఞము చేయుట- ఇట్టి కథలన్నియు అర్థవాదములే! **ఈ గజేంద్రుని కథ కూడ అట్టి అర్థవాద కథయే!**

దైవప్రజ్ఞ సామూహిక జీవప్రజ్ఞగా దిగివచ్చి ఒక జీవుడుగా వేరుపడు ననియు, అతడే గజరాజు అనియు చెప్పుకొంటిమి. ఒక సరస్సును చూడగనే అది తనకు అనువైన దేహ వ్యూహమని గ్రహించి సంతోషముతో దానిలో ప్రవేశించెననియు చెప్పుకొంటిమి. ఒక శరీరమును ధరించగనే 'అది తనదే' యను భావము అహంకారమయుడగు జీవుని ఆవహించును. దీనిని వ్యామోహ మందురు. అట్లు భావించుటయే అభ్యాసమైపోవును. 'ఇది నాదే' అను స్థితి

నుండి 'ఇది నేనే' (ఈ శరీర వ్యూహము నేనే) అను స్థితిలోనికి దిగిపోవును. ఈ అభ్యాస-వ్యామోహముల పట్టు అసాధారణమైనది. అదియే మొసలియై పురుషుని పట్టుకొనును.

ఈ పట్టులోనుండి బయటపడుటకు జీవుడు ఒంటరిగానే యత్నింప వలెను. తన భార్యలుగా నున్న తన స్వభావము తన కేమాత్రము సహాయము చేయలేదు. బ్రహ్మాది దేవతలు కూడ ప్రకృతిలోని భాగములే యగుదురు గనుక ఒక జీవుని మోక్షమునకు సహాయము చేయలేరు. అది కేవలము నరునకు-నారాయణునకు మధ్యగల వ్యవహారమే తప్ప, ఇతరులకు అందులో ప్రమేయము లేదు.

ఏ సృష్టిలోనైనను దేవతలతోబాటు పరిపూర్ణ నరప్రజ్ఞ పనిచేయుచునే యుండును. అసలు దేవతలు, బ్రహ్మ కూడ పుట్టక ముందే, నారాయణుని నాభికేంద్రమున నరప్రజ్ఞ మేల్కొనెను. ఈ నరుని అవతరణము, జన్మము, పరిణామము, మోక్షము అను నంశములు; ప్రతి స్థాయిలోను నారాయణుని ప్రమేయము, అనుగ్రహము ఎట్లుండునను అంశములు ప్రతి అర్థవాదములోను వివరింపబడినవి. సృష్టిలోని ప్రతి స్థాయిలోను పరిపూర్ణ నరప్రజ్ఞలు పనిచేయుచునే యుండును. కపిలుడు, మనువు మున్నగువా రందరు అట్టివారే! ప్రతి కథయు స్వయం సంపూర్ణముగా నుండును. కాని ఒక్కొక్క కథలో ఒక్కొక్క అంశము ప్రధానమై, మానవులకు సాధకులకు మార్గోపదేశము చేయుచుండును.

## ఫలశృతి

ఈ కథలో అభ్యాస-వ్యామోహముల పట్టు ఎట్లుండునో, దాని నుండి విడివడుటకు జీవుని ప్రయత్నము, నారాయణుని అనుగ్రహము, గురువు మార్గదర్శకత్వము అను నంశములు మనోజ్ఞముగా వర్ణింపబడినవి.)

**135.** పరీక్షిన్మహారాజా! నా చేత నీకు వివరింపబడిన ఈ గజేంద్రమోక్షణ కథ కృష్ణానుభావమైనది. (అనుభావము అనగా దానితో బాటు అనుసరించి వచ్చు భావము **(Correlated Feeling)**. ఈ గాథను స్మరించిన వారికి కృష్ణుని

తత్త్వము చక్కగా స్ఫురించు చుండును.) వినువారి పాపములను ఈ కథ పోగొట్టి కీర్తి నిచ్చును. దుఃఖములను, దుస్వప్నములను నశింపజేయును. ప్రాతః కాలమున మేలుకొని పరిశుద్ధులై ఈ కథను నిత్యము పఠించువారు బ్రాహ్మణు లైనను వైభవములు సమకూరును. (ఇతర వర్ణములవారు ధనాది సంపదలను కోరి ఆర్జింతురు. వారి కభివృద్ధి కలుగుటలో ఆశ్చర్యము లేదు. అట్టి ప్రయత్నమే చేయని బ్రాహ్మణులకు కూడ అయాచితముగా సంపదలు సమకూరునని భావము.) సంపద వృద్ధిచెంది పీడలు శాంతించును. కనుక సుఖములు, శుభములు కలుగును. తన భావములు తనను బంధింపవు గనుక మోక్షము అరచేతిలో వలె సిద్ధమై యుండును. తనలో సంతోషము నిండియుండునని విష్ణుదేవుడే సెలవిచ్చెను.

**136.** పరమేశ్వరుడగు విష్ణువు ఇంకను ఇట్లని సెలవిచ్చెను: “ఎవ్వడైనను రాత్రి మూడవ జామున మేలుకొని నిశ్చలమైన మనస్సుతో ఈ క్రింది అంశము లను స్మరింపవలెను. నారాయణ నివాసమగు శ్వేత ద్వీపము, ఆయనకు ప్రీతి పాత్రమగు పాల సముద్రము, మేరు పర్వతము, త్రికూట పర్వత గుహలు, అరణ్యములు, పేము వెదురు జొంపములు, లతా గుల్మములు, కల్పవృక్షము, త్రిమూర్తులు వసించుచుండు త్రికూట శిఖరములు, కౌమోదకి యను గద, సుదర్శన చక్రము, కౌస్తుభమణి, పాంచజన్యమను శంఖము, శ్రీదేవి, శేషుడు, గరుత్మంతుడు, వాసుకి, ప్రహ్లాదుడు, నారదాది ఋషులు, మత్స్య కూర్మాది అవతారములు, ఆ అవతారములలోని లీలలు, సూర్య - చంద్ర-అగ్నులు, దేవతలు, ఓంకారము, ధర్మము, తపస్సు, సత్యము. **4** వేదములు, **6** వేదాంగ ములు, **6** శాస్త్రములు, గోవులు, బ్రాహ్మణులు, సాధుపుంగవులు, పతివ్రతలగు స్త్రీలు, చంద్రుడు, కశ్యపుని భార్యలు, నక్షత్రములు, గౌరి, గంగ, కాళింది, సరస్వతి, సునంద మొదలగు పుణ్యనదులు, దేవతలు, ఐరావతము, అమృతము, ధ్రువుడు, బ్రహ్మర్షులు, పుణ్యచరిత్రులైన మానవులు- ఈ అంశములను నిశ్చలమైన మనస్సుతో స్మరింపవలెను. అట్లు నిరంతరము చేయువారికి వారి మరణ సమయమున నిర్మలమైన విష్ణుపదమును విష్ణువే

ప్రసాదించును.” ఈ విధముగా సెలవిచ్చిన విష్ణువు శంఖమును పూరించి గరుడ వాహనుడై వైకుంఠ మును చేరెను. దేవత లందరును సంతోషించిరి- అని చెప్పి శుకయోగీంద్రుడు మరల నిట్లనెను.

(ఆధ్యాత్మిక సాధనలో రాత్రి మూడవ జాముకు విశేష స్థానమున్నది. వేకువనే **3-4** గంటల మధ్యకాలమున మేలుకొని, శరీరమును శుభ్రము చేసికొని, దైవసన్నిధిలో కూర్చుని యున్నవానికి మనస్సు ఎక్కువ ప్రసన్నముగా నుండును. ఆ సమయమున చోటులో పయనించుచున్న ఋషిప్రజ్ఞలు తనను అనుగ్రహించుట కవకాశముండును.)

**137.** ఈ గజేంద్రమోక్షణ కథను నిజముగా చదువుకొను వారికి గజరాజ వరదుడైన విష్ణువు సకల సంపదలతో బాటు మోక్షమును కూడ ప్రసాదించును.

(నిజముగా పఠించుట యనగా, అది సత్యమని నమ్మి చదువుట మరియు అది తనయందు సత్యమగునట్లు చదువుట. అది నిజమని నమ్మి చదువుచున్న కొలదియు అందలి నిజమైన తత్త్వము అంతరార్థములతో సహా బోధ పడుచుండును. అందలి ఉపదేశము క్రమముగా తన జీవితమునకు సమన్వయించి తనకు సత్యమగును. అప్పుడు అది ‘తనకు నిజముగా’ పఠించుట యగును.)



## OTHER BOOKS THROUGH MASTER K. PARVATHI KUMAR

*The following books are available in: English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (HI) and Kannada (K) languages.*

| | | |
|---|---|---|
| 1. | Agni (E/G/S) | 60-00 |
| 2. | Amanaskudu (T/K) | 18-00 |
| 3. | Antardarsana Dhyanamulu (T) | 100-00 |
| 4. | Anveshakudu (T) | 60-00 |
| 5. | Asangudu (T) | 15-00 |
| 6. | Ashram Leaves (E/G/S) | 100-00 |
| 7. | Ayurvedic Principles (E) | |
| 8. | Bharateeya Sampradayamu (T/Hi) | 10-00 |
| 9. | Cow ('Govu' Mahatyam Vivarana) (E/T/K) | 20-00 |
| 10. | Devapi Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 11. | Dhanakamuni Katha (T) | 25-00 |
| 12. | Doctorine of Eternal Presence (E) | 10-00 |
| 13. | Gayatri Mantra - Avagahana (T) | 10-00 |
| 14. | Geetopanishad - Gnana Yogamu (T) | 25-00 |
| 15. | Geetopanishad - Karma Yogamu (T) | 20-00 |
| 16. | Geetopanishad - Sankhya Yogamu (T) | 25-00 |
| 17. | Geetopanishad - Karmasanyasa Yogamu (T) | 20-00 |
| 18. | Good Friday (E/G/S/F/H) | 10-00 |
| 19 | Gurupaduka Sthavam (E) | |
| 20. | Health & Harmony (E) | 120-00 |
| 21. | Hercules-The Man and the Symbol (E/G/S/F) | 100-00 |
| 22. | Himalaya Guru Parampara (T/Hi) | 12-00 |
| 23. | Jupiter-The Path of Expansion (E/G/S) | 40-00 |

| | | |
|---|---|---|
| 24. | Jyotirlinga Yatra (T) | 20-00 |
| 25. | Katha Deepika (T) | 40-00 |
| 26. | Listening to Invisible Master (E/G/S/F/H) | 20-00 |
| 27. | Lord Maitreya-The World Teacher (E/G/S/F/H) | |
| 28. | Maitreya Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 29. | Mana Mastaru Garu (T) | 60-00 |
| 30. | Mantrams-Their Significance and Practice (E/G/S) | 35-00 |
| 31. | Maria Magdalena (E/S/G/F) | |
| 32. | Marriage-A Sacrament (E) | |
| 33. | Maruvu Maharshi Bodhalu (T/Hi) | 60-00 |
| 34. | Master C.V.V. (Birthday Message) (T) | 30-00 |
| 35. | Master C.V.V. Noothana Yogamu (T) | 20-00 |
| 36. | Master C.V.V. Yogamu (T) | 20-00 |
| 37. | Master C.V.V. Yogamu-Karma Rahityamu (T) | 10-00 |
| 38. | Master C.V.V. - May Call !(E/G/S) | 100-00 |
| 39. | Master C.V.V. - May Call ! II (E) | 100-00 |
| 40. | Master C.V.V. The Initiator - Master E.K. The Inspiror (E) | 15-00 |
| 41. | Master C.V.V. - Saturn Regulations | 125-00 |
| 42. | Master E.K. - The New Age Teacher (E/G/S) | 70-00 |
| 43. | Mithila-A New Age Syllabus (E/G/S) | 100-00 |
| 44. | Occult Meditations (E/G/S) | 100-00 |
| 45. | Omkaram (T) | 30-00 |
| 46. | On Change (E/G/S) | 50-00 |
| 47. | On Healing (E/G/S) | 100-00 |
| 48. | On Love (E/G/S) | 50-00 |

| | | |
|---|---|---|
| 49. | On Service (E/G/S) | 50-00 |
| 50. | On Silence (E/G/S) | 50-00 |
| 51. | Pranayamam (T) | 10-00 |
| 52. | Prayers (E/G/S) | 100-00 |
| 53. | Rudra (E/G/S) | 30-00 |
| 54. | Sankhya - The Sacred Doctrine (E/G/S) | 75-00 |
| 55. | Saraswathi - The Word (E/G/S) | 60-00 |
| 56. | Saturn-The Path of Systematised Growth (E/G/S) | 40-00 |
| 57. | Shodasopachara Pooja - Avagahana (T) | 10-00 |
| 58. | Sound-The Key and its Application (E/G/S) | 40-00 |
| 59. | Spiritualism - Business and Management (E/G/S) | 25-00 |
| 60. | Sri Dattatreya (E/G/S/T/Hi) | 33-00 |
| 61. | Sri Gurupaduka Sthavam (T) | 30-00 |
| 62. | Sri Krishna Namamrutham (T) | 25-00 |
| 63. | Sri Lalitha-1 (T) | 40-00 |
| 64. | Sri Lalitha-2 (T) | 40-00 |
| 65. | Sri Lalitha-3 (T) | 40-00 |
| 66. | Sri Lalitha-4 (T) | 40-00 |
| 67. | Sri Lalitha-5 (T) | 40-00 |
| 68. | Sri Lalitha-6 (T) | 40-00 |
| 69. | Sri Sastri Garu (E/G/S/F/T/H) | 40-00 |
| 70. | Sri Shiridi Sai Sayings (E/G/S/T/Hi) | 80-00 |
| 71. | Steps on Silence (E) | 75-00 |
| 72. | Suvarna Sopanamulu | |
| 73. | The Aquarian Cross (E/G/S) | 100-00 |
| 74. | The Aquarian Master (E/G/S) | 75-00 |
| 75. | The Doctorine of Ethics (E) | 35-00 |
| 76. | The Etheric Body (E/G/S) | |

| | | |
|---|---|---|
| 77. | The Path of Synthesis (E) | 40-00 |
| 78. | The Splendor of Seven Hills (E/T/Hi) | 15-00 |
| 79. | The Teachigs of Lord Sanatkumara | 150-00 |
| 80. | The Theosophical Movement (E/G/S) | 60-00 |
| 81. | The White Lotus (E/G/S) | 20-00 |
| 82. | Time - The Key (E/G/S) | |
| 83. | Uranus - The Alchemist of the Age | 150-00 |
| 84. | Venus - The Path of Immortality (E/G/S) | 80-00 |
| 85. | Violet Flame Invocation (E/G) | 60-00 |
| 86. | Vrutrasura Rahasyam (T) | 35-00 |
| 87. | Varunagraha Prabhavamu (T) | 22-00 |
| 88. | Wisdom Buds (E/S) | 20-00 |
| 89. | Wisdom Teachings of Vidura (E/G/S) | 80-00 |
| 90. | Moon & Spiritual Astrology (S) | |
| 91. | The Death & Reincarnation (S) | |
| 92. | Commentary on Om Namonarayanaya (S) | |
| 93. | Master Jesus, Life and Teachings (S) | |
| 94. | The Science of Ayurveda & Homoeopathy (S) | |
| 95. | The Teachings of Master D.K. (S) | |
| 96. | The Human Constitution (S) | |
| 97. | The Masters of Wisdom (S) | |
| 98. | The Path of Meditation (S) | |
| 99. | Stories for Disciples (S) | |
| 100. | Spirituality in Daily Life (S) | |
| 101. | Special Practices for Disciples (S) | |
| 102. | Fundamentals of Health & Healing (S) | |
| 103. | Ganesha, The Cosmic Lord of Groupings (S) | |
| 104. | Astrology and Healing (S) | |

## DHANISHTA OTHER PUBLICATIONS


| | | |
|---|---|---|
| 1. | Puranapurushuni Pooja Vidhanam (T) | 10-00 |
| 2. | Sarannavaratra Pooja Vidhanamu (T) | 30-00 |
| 3. | Sri Dattatreya Pooja Vidhanamu (T) | 10-00 |
| 4. | Sri Hanuman Chalisa (T) | 15-00 |
| 5. | Sri Mahalakshmi Pooja Vidhanamu (T) | 12-00 |
| 6. | Sri Rama Pooja Vidhanamu (T) | 10-00 |
| 7. | Sri Siva Hridayamu (T) | 5-00 |
| 8. | Sri Siva Pooja (T) | 15-00 |
| 9. | Sri Soukumarya Satakam (T) | 10-00 |
| 10. | Sri Surya Pooja Vidhanamu (T) | 7-00 |
| 11. | Sri Venkateswara Pooja Vidhanamu (T) | 8-00 |
| 12. | Vinayaka Vratakalpamu (T) | 25-00 |
| 13. | Vishnu Sahasranamam (T) | 12-00 |
| 14. | Sri Rama Charitramu (T) | |
| 15. | Sri Subrahmanya Pooja Vidhanamu (T) | 10-00 |
| 16. | Sri Yoga Ganapathi Pooja Vidhanamu (T) | 12-00 |



ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బరమేశ్వరు డెవ్వఁడు మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు సర్వముఁ దానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

* * *

లా వొక్కింతయులేదు ధైర్యము విలోలం బయ్యెఁ బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛ వచ్చెఁ దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

* * *

విశ్వమయత లేమి వినియు నూరక యుండి
రంబుజాసనాదు లడ్డపడక
విశ్వమయుఁడు విభుఁడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డపడఁ దలంచె.

* * *

కరుణాసింధుఁడు శౌరి వారిచరమున్ ఖండింపఁగా బంపె స
త్వరితాకంపితభూమిచక్రము మహోద్యద్విస్ఫులింగచ్ఛటా
పరిభూతాంబరశుక్రమున్ బహువిధబ్రహ్మాండభాండచ్ఛటాం
తరనిర్వక్రముఁ బాలితాఖిలసుధాంధశ్చక్రముం జక్రమున్.

ధనిష్ఠ